రాజకీయవీరుడు

# డాక్టరుఖాను

రచన :

బోయి భీమన్న

ప్రచురణ :

సుఖేలా నికేతన్

తొలి ముద్రణ
జనవరి, 1968

నాట్యకళ ప్రెస్
హైదరాబాద్

హక్కులు : రచయితవి

వెల : రూ. 3/-

ప్రతులకు :

సుఖేలా నికేతన్

ఐ.సి. 85, ఇర్రమంజిల్ కాలనీ,
హైదరాబాదు - 34.

# రాజకీయవీరుడు డాక్టరు ఖాను

## పరిచయము

బహు గ్రంథ కర్తలు, కవులు, వినూతన సిద్ధాంత ప్రతిపాదకులు నయిన శ్రీ బోయి భీమన్నగారు తెలుగు సారస్వత లోకానికి సుపరిచితులు. వివిధ సాహిత్య వీధులలో వారు కావించిన కృషి సుప్రసిద్ధమైనది. ఈ గ్రంథ రచనతో భీమన్నగారు మరొక క్రొత్త సాహిత్య ప్రక్రియకు పూనుకొనినారు.

ఈ గ్రంథము డాక్టర్ ఖాన్ జీవిత చరిత్ర. డాక్టర్ ఖాన్ గొప్ప అధికార పదవుల నలంకరించిన పౌరులు కాదు. అందుచేత ఆయన జీవిత వివరాలు చాల మందికి పరిచితమైనవి కావు. సుప్రసిద్ధుడు కాని వ్యక్తిని యీ గ్రంథ రూపమున పరిచయము కావించు ప్రయత్నములో యేదో యొక ముఖ్యమైన అభిప్రాయము గర్భితమై యుండక తప్పదు. నిజానికి యే దేశ చరిత్ర యైనను తెలుసుకొన వలెనన్నచో దేశ నాయకుల జీవితములను తెలుసుకొని నంత మాత్రమున సరిపోదు. ఎందుకనగా అసాధారణ వ్యక్తుల జీవితాలు దేశమునకు ఆదర్శపాత్రములే కాని, సమకాలిక దేశ పరిస్థితులను సంపూర్ణముగా తెలియజేయజాలవు. అందుచేతనే కాబోలు ఒక సాధారణ పౌరుని జీవిత చరిత్రను తీసుకొని, వివిధ రాజకీయ సామాజిక పరిస్థితులలో సాధారణ పౌరుడు జాతీయ సమైక్యతకు అనుగుణముగా తన బాధ్యతలను యెట్లు నిర్వహించినాడో భీమన్నగారు యీ గ్రంథమున చక్కగా చిత్రించినారు.

ఇందులోని కథా నాయకులు డాక్టర్ ఖాన్ జన్మచేత ఇస్లామ్ మత నాయకులు. కాని – కర్మచేత ఇస్లాం, హిందూ, క్రైస్తవ మత ధర్మాలలోని ఉదాత్తతను తన వ్యక్తిత్వములో మేళవించుకొనిన సంస్కృతీపరులు. కావుననే ఆయన మన భారత జాతీయతకు ప్రతిబింబ మని చెప్పవచ్చును.

గడచిన ముప్పది సంవత్సరాలలో మన దేశములో చరిత్రాత్మకమైన సంఘటనలు జరిగినవి. అనేక క్లిష్ట పరిస్థితులు ఉత్పన్నమైనవి. ఈ పరిస్థితులలో మన డాక్టర్ ఖాన్ భారత పౌర ధర్మమును ప్రశంసనీయముగా నెరవేర్చి దేశ నాయకుల మన్ననలను పొందినారు.

డాక్టర్ ఖాన్ దృష్టిలో అన్ని మతాలు, అన్ని కులాలు, అన్ని వర్గాలు ఒక్కటే. తనలో అందరిని, అందరిలో తనను చూసుకొనిన అద్వైతి ఆయన. తెలుగులో అక్షరాభ్యాసము చేసిన అచ్చ తెనుగు వాడు ఆయన. ఉరుదూతో పాటు తెలుగును ప్రేమించిన రసికుడు ఆయన. భారత జాతీయోద్యమములో, విశాలాంధ్ర ఉద్యమములో పాల్గనిన రాజకీయ వీరుడు ఆయన. ఆయన యింటిలో అన్ని భాషలకు, అన్ని మతాలకు సుస్వాగతము. ఆయన గృహము ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలను ముడివేసుకొన్నది. ఇటువంటి ఉదాత్త సంస్కృతీపరుని జీవిత వివరాలను యీ గ్రంథములో పేర్కొని శ్రీ బోయి భీమన్నగారు ప్రశంసనీయమైన పని చేసినారు.

భారతీయ పౌర ధర్మానికి, జాతీయ జీవనానికి ఆదర్శ ప్రాయమైనది డాక్టర్ ఖాన్ జీవితము. ఆయన వంటి పౌరుల సంఖ్య మన దేశములో అభివృద్ధి చెందినచో మన జాతీయ సమస్యలు సులభముగ పరిష్కారమయి, దేశము అభ్యుదయ మార్గమున పురోగమించ గలదు. డాక్టర్ ఖాన్‌కు నా శుభాకాంక్షలు. శ్రీ భీమన్నగారికి నా అభినందనలు.

హైదరాబాదు
ప్లవంగ సంక్రాంతి
14-1-1968

దేవులపల్లి రామానుజ రావు
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి

# కొత్త ప్రయోగం

డాక్టరు ఖాను చరిత్ర ఇంతే కాదు. ఇంకా చాలా ఉంది.

జీవిత చరిత్రను ఒక మహా సౌధంతో పోలిస్తే – ఈ గ్రంథం ఒక తాత్కాలిక కట్టడం మాత్రం.

ఇందులో స్పృశించబడ్డ అంశాలను సూక్ష్మంగా పరిశీలించి, పరిశోధించి, సమగ్రంగా వ్రాయడానికి భవిష్యత్తులో ఎవరైనా పూనుకొంటే – అట్టివారికి ఇది ప్రాతిపదిక గ్రంథం అనవచ్చు. అట్టి కృషి ద్వారా ఇంకా ఎన్నో గొప్ప గొప్ప క్రొత్త విషయాలు వెలుగులోకి రావచ్చు కూడ.

రాజుల ప్రతాపాలు, మంత్రుల చాణక్యాలు, అంతఃపుర కుట్రలు, తాంత్రిక యుద్ధాలు, విజయోన్మాదాలు, పటాటోపాలు – ఇవే చరిత్ర అనుకొన్న రోజులు పోయిన్నై. ప్రవక్తల, నియంతల, నాయకుల మహాకార్య నిర్వహణోదంతాల వివరణ పట్టికలే చరిత్ర అనుకొంటున్న రోజులు కూడ పోతున్నై. సామాన్య మానవుడి దైనందిన జీవిత చరిత్రే నిజమైన, సరియైన దేశ చరిత్ర అని గుర్తించవలసిన రోజులు వస్తున్నై. వచ్చేసినై.

సామాన్య మానవులలో డాక్టరు ఖాను ఎంతటి ఆదర్శ పురుషుడో, రచయితలలో శ్రీ బోయి భీమన్న అంతటి ఆదర్శ పురుషుడు.

ఇతర దేశాలలో వలె ఈ భారతదేశంలో కూడ మత విషయకమ్మైన కలహాలు,

కొట్లాటలు, రక్తపాతాలు లేకుండా ఉండాలంటే - ఇతర మతాల వారి వలెనే ఇస్లాం మతస్థులు కూడ ఈ దేశపు వేష భాషల్ని అనుసరించక తప్పదు.

తెలుగుదేశంలోని హిందువుడు ఎంతటి తెలుగువాడో, క్రైస్తవుడు కూడ అంతటి తెలుగువాడే. ముస్లిం కూడ అంతటి తెలుగు వాడే కావలసి ఉంది. ఎవరు ఏ ప్రాంతం వాడో నిర్ణయించేవి వేష భాషలు. తెలుగు వేషం, తెలుగు భాష - ఈ రెండింటిని అనుసరించ కుండా, ఎవడూ కూడ - చివరకు దేవుడైనా సరే - తెలుగువాడు కాలేడు.

అలానే ఏ భాషా ప్రాంతం విషయంలోనైనా కూడ.

ఈ విషయంలో భారతీయ ముస్లింలకు డాక్టరు ఖాను ఆదర్శ పురుషుడు.

తాను ముస్లిం. ఇస్లాం మతస్థుడు. మతం వ్యక్తిగతం. తాను తెలుగు వాడు. అన్ని విధాలా తెలుగు సంప్రదాయాన్ని అనుసరించిన వాడు. అందువల్ల ఆదర్శ పురుషుడు.

మనం ఏ నేలలో పుట్టామో, ఆ నేలకు విధేయులమై, విశ్వాస పాత్రులమై ఉండాలి. అదే దేశభక్తి. దేశభక్తి జీవిత రక్తికి, భుక్తికి, ముక్తికి కూడ అవసరమైన ప్రధాన విషయం. జాతీయత లేకుండా అంతర్జాతీయత లేదు.

భారతదేశంలో వివిధ భాషా ప్రాంతాలలో నివసించే ముస్లింలు ఎలా ప్రవర్తిస్తే వారు సరియైన భారత పౌరులు కాగలరో - తాను స్వయంగా ఆచరించి చూపుతున్న వాడు డాక్టరు ఖాను. ఈ ఒక్క ఆదర్శమూ చాలు, ఆయనను ఒక మహావ్యక్తిని చెయ్యడానికి.

అలాంటి ఒక ఆదర్శమూర్తి జీవిత చరిత్రను వ్రాయగల్గిన శ్రీ భీమన్నగారు - శ్రీ దేవులపల్లి రామానుజరావుగా రన్నట్లు - చరిత్ర రచనలో ఒక నూత్న యుగాన్నే సృష్టించిన వారైనారు. ప్రజాస్వామిక సోషలిజం లక్ష్యపథంలో ఒక విప్లవాన్నే సాధించిన వారైనారు.

ఈ దేశంలోని ముస్లింలలో అత్యధిక సంఖ్యాకులు సున్నీలు. ప్రవక్త

బోధనలు విని ముస్లిం లైనవారు. అంటే – మతాంతరులైన దేశీయులే. కనుక దేశీయమైన వేషభాషల్ని అవలంబించటానికి సంకోచపడవలసిందేమీ లేదు. డాక్టరు ఖాను నడుస్తున్న మార్గంలో నడిస్తే చాలు.

ఆదర్శ పురుషులైన ఇలాంటి వారి జీవిత చరిత్రలను ఇతోధికంగా వ్రాసి, దేశ నాయకుల లక్ష్యశుద్ధికి, సమాజ నేతల చిత్తశుద్ధికి ఒరవడి పెట్టవలసిందిగా శ్రీ భీమన్నగారిని కోరుతున్నాం. డాక్టరు ఖానుగారి ఆయురారోగ్యైశ్వర్యాల ఇతోధికాభివృద్ధి కోసం ప్రార్థిస్తున్నాం.

ఏవో నాలుగు మాటలు అభిప్రాయం వ్రాసిపెట్ట వలసిందిగా కోరిన వెంటనే, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, చక్కని అభిప్రాయ సుధా కలశాన్ని అందించ గల్గిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శులు శ్రీ దేవులపల్లి రామానుజ రావు గారికి ఎంతో కృతజ్ఞులం.

నిమిషాల మీద – అక్కడక్కడ అచ్చుతప్పులు దొర్లితే దొర్లాయి గాక – గ్రాంథాన్ని ముద్రించి ఇవ్వ గల్గిన నాట్యకళా ప్రెస్ వారికి, ముఖ్యంగా శ్రీ గిడుగు రామమూర్తి గారికి మా నమస్కారాలు. ఈ గ్రంథం అచ్చుకు వ్రాతప్రతిని తయారు చెయ్యటం వంటి కార్యక్రమాలలో మాకు ఎంతగానో తోడ్పడ్డ నటశేఖర శ్రీ వైద్యుల శ్రీనివాస రావు గారికి వందనాలు.

హైదరాబాదు,
జనవరి, 1968

సుఖేలా నికేతన్



డాక్టర్ ఎమ్.ఎ. ఖాను

# రాజకీయవీరుడు డాక్టరు ఖాను

## బిస్మిల్లా హిర్రహ్మాని ర్రహీమ్

(వరప్రదాయకుడు, కరుణామయుడు అగు అల్లా నామస్మరణతో ప్రారంభిస్తున్నాను.)

\- ఖురాన్

*ఎవ్వనిచే జనించు జగ*
*మెవ్వని లోపల నుండు లీనమై,*
*ఎవ్వని యందు డిందు పర*
*మేశ్వరు డెవ్వడు, మూల కారణం*
*బెవ్వ, డనాది మధ్యలయు*
*డెవ్వడు, సర్వము దానయైన వా*
*డెవ్వడు, వాని, నాత్మభవు,*
*నీశ్వరు, నే శరణంబు వేడెదన్.*

పౌరాణిక రాగ ధోరణిలో వినిపిస్తున్నదీ భాగవత పద్యం లోపల నుంచి - నేను డాక్టరు ఖానుగారి సూర్యభవనం ప్రాంగణంలోకి అడుగు పెట్టేటప్పటికి.

"రండి, రండి !" అంటూ లోపల నుంచి బయట మెట్ల దాకా వచ్చి నా చెయ్యి పట్టుకొని, హాలులోకి తీసుకుపోయాడు డాక్టరు ఖాను - మందహాసంతో.

"మేఘరంజనీ ! రెండు కప్పులు టీ తీసుకురా !" అంటూ లోనికి చెప్పి, నన్ను కూర్చోమని, లోపలికి వెళ్ళా డాయన.

ఒక ముస్లిం డాక్టరు భాగవతంలోని పద్యాన్ని అంత చక్కగా చదువుతున్నందుకే ఆశ్చర్యపోతున్న నేను, మేఘరంజని అనే పేరు విని మరీ విభ్రాంతుణ్ణయాను.

నేను ఎక్కడున్నాను ? ఒకచోటి కనుకొని మరొక చోటికి రాలేదు కదా !

"ఇంకా నిలబడే ఉన్నారా ?" అంటూ ప్రవేశించా డాయన – రెండు ప్లేట్ల బిస్కెట్లతో.

"అది కమలా నెహ్రూగారి ఫోటో. మా వెల్‌ఫేర్ సెంటర్ కోసం ఎన్‌లార్జ్ చేయించాను" అన్నాడు చేతిలోని ప్లేట్లను మేజా మీద పెడుతూ, నా చూపుల చివరకు తన చూపుల్ని కూడా పోనిచ్చి.

అప్పటి వరకూ నాకు కమలానెహ్రూగారి చిత్రం వంక చూస్తున్నాననే ధ్యాసే లేదు. మనస్సు మేఘరంజనితో గజేంద్రమోక్షం గానం చేస్తున్నది ! హృదయం డాక్టరు ఖానుగారి భారతీయ సంప్రదాయ పరమజ్ఞతా శుభ్రజ్యోత్స్నలో పొంగులు వారుతున్నది !

హాలు మొత్తం దేశనాయకుల పాతకాలం ఫొటోలతో నిండి ఉంది. గాంధీ, నెహ్రూ, పటేల్, మౌలానా ఆజాద్, ఆంధ్రకేసరి, నేతాజీ, శాస్త్రి, పొట్టి శ్రీరాములు, రాజేంద్రప్రసాద్, సరోజినీ దేవి, రాధాకృష్ణన్, జాకిర్ హుసేన్ వంటి నాయకుల ఫొటోలు ముఖ్యస్థానాల్లో అమర్చబడి ఉన్నాయి. కాంగ్రెసు వాదుల ఇండ్లలో సాధారణంగా ఈ ఫొటోలు అన్నీ ఉండేవే. ఇక్కడ కమలానెహ్రూ ఫొటో కూడా ఉండడం ఎంతో ముచ్చటగా ఉంది.

మేం బిస్కెట్లు తింటున్నాం. అంతలో అక్కడ ప్రత్యక్షమైంది – మెరుపులాంటి ఒక ఆరేండ్ల అమ్మాయి.

"మా పెద్దబ్బాయి కమల్ కూతురు, మేఘరంజనీ బేగం" అంటూ ఆ అమ్మాయిని పరిచయం చేశా డాయన నాకు. నేను చెయ్యి చాపాను. నా ఒళ్ళోకి వచ్చేసిందామె.

"సూర్యభవనం, మేఘరంజని - చాల అందమైన పేర్లు పెడతారు మీరు" అన్నాను నేను అభినందన పూర్వకంగా... "సంస్కృతభాష లోనే వుంది ఆ అందం" అన్నా డాయన.

డాక్టరు ఖానుతో పరిచయం నాకు కొత్త దేమీ కాదు. ఆయన నాకు చిరకాలంగా తెలిసినవాడే. జాతీయోద్యమంలో, సాంస్కృతిక కార్యక్రమాలలో మే మిద్దరం కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, మొన్న మొన్నటివరకు కూడా పరిచయం స్నేహంగా మారలేదు. మేము స్నేహితులమూ, సన్నిహితులమూ అయిన తర్వాత నేను వారింటికి రావడం ఇదే మొదటి సారి.

ఆయన స్వచ్ఛమైన దేశభక్తుడు, గాంధీజీ అనుచరుడు, నిర్మాణ కార్యకర్త, సత్యసంధుడు, స్నేహశీలి, భావుకుడు, గ్రంథకర్త, త్యాగి, మానవసేవా పరాయణుడు, సహృదయుడు. ఇదంతా నాకు చిరకాలంగా తెలిసిందే. అయితే, మత, సాంఘిక, సాంసారిక విషయాల్లో కూడా ఇంత కార్యవాది అనీ, విప్లవకారు డనీ నాకు అంతకు ముందు తెలియదు. ఇది నాకు ఒక అపూర్వమైన సత్యావిష్కారం !

ఎంతోమంది సంస్కర్తల్నీ, ప్రగతికాముల్నీ, విప్లవకారుల్నీ ఎరుగుదును నేను. అందులో - ఏ విధమైన స్వప్రయోజనాన్ని ఆశించని, ఎంతటి ప్రతిఘటనకైనా సరే వెనకడుగు వెయ్యని నిర్భయుల్నీ, నిజాయితీపరుల్ని కూడా చూశాను నేను.

కానీ -

ఇస్లాం మతానికి చెందిన ఒక వ్యక్తి, ఆ మతం పట్ల గాఢవిశ్వాసం గల ఒక ముస్లిం గృహస్థు, అంతవరకూ ఉన్న సంప్రదాయానికీ, ఆచారానికీ విరుద్ధంగా తన గృహానికీ, కుటుంబ సభ్యులకూ హైందవ సంప్రదాయం లోని పేర్లను పెట్టడం మాత్రం చాలా అపూర్వం !

'స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం' అనే గ్రంథంలో డాక్టరు ఖాను యీ సూచన చేసి ఉన్నాడు. ఆ విషయం నేను మరచేపోయాను. అయితే, అది ఆయన స్వప్నానికి సంబంధించిన విషయం. ఆయన కల నిజమై ఆంధ్రరాష్ట్రం సమగ్ర సుందరంగా ఏర్పడ్డ మాట వాస్తవమే. కాని, తన మనుమరాలికి మేఘరంజని అని పేరు పెట్టడం

కూడ నిజమైందంటే – ఆయన ఎంత కార్యవాదో, ఎంతటి సాహసోపేతుడో మనం ఊహించ వచ్చు.

"అనుకొన్న పని అనుకొన్నట్టు నెరవేర్చటంలో మీకు మీరే సాటి" అన్నాను నేను... మేఘరంజని తెచ్చిన తేనీటిని చాతకంలా చప్పరిస్తూ.

"మేఘరంజని అని పేరు పెట్టడం ముస్లిం సంప్రదాయానికి విరుద్ధమనీ, ఇస్లాం మతాచారాలను డాక్టరు ఖాను మంటగలుపు తున్నాడనీ, 1949లో నేను నా గ్రంథాన్ని ప్రకటించి నప్పుడే ముస్లింలీగు కార్యకర్తలు పెద్ద ఆందోళన లేవదీశారు – నాకు వ్యతిరేకంగా. అది ఒక పెద్ద ఉద్యమంగా కూడ పరిణమించింది. చివరకు కాంగ్రెసు నాయకుడు కాకాని వెంకటరత్నం గారు కలుగజేసుకుంటేనే కాని అది చల్లారలేదు" అన్నా డాయన.

"ఇంతకూ మేఘరంజని అనేది హిందూ పేరు కాదు కదా ! అది సంస్కృత పదం. సంగీతం లోని ఒక రాగం. సంస్కృతం ఒక భాష. ఒక భాష గానీ, ఒక కళ గానీ, యే ఒక్క మతానికీ చెంది వుండవు. చూడండీ ! ఆచారాలూ, సంప్రదా యాలూ ఎలా అపార్థాలకు లోనై, అనర్థాలకు హేతు వవుతున్నాయో ! మతాలు కాలక్రమేణా మానవుణ్ణి మరీ అంధుణ్ని చేస్తున్నాయి" అన్నాడు – నా ముఖం లోకి చూస్తూ.

డాక్టరు ఖాను ఎంత సంస్కారవంతుడో అప్పుడు తెలిసింది నాకు. నిజమే. భాష, భావం, కళ, సాహిత్యం, విజ్ఞానం, సౌందర్యం వంటి వన్నీ – గాలి, నేల, నీరు, నిప్పు వంటి వాటిలాగే – సర్వమానవకోటికీ చెందినట్టివి. మతాలూ, ఆచారాలూ, దేశ సరిహద్దులూ, ఆహారవిహారాలూ వంటి వ్యక్తిగత విషయాలకు అవి ఎన్నటికీ పరిమితం కావు.

ఆధునిక భాషల్లో ఇంగ్లీషులాగే, ప్రాచీన భాషల్లో సంస్కృతం విశ్వజనీన భాష. దేశకాల పాత్రావధులు లేవు దానికి. ముస్లింలు చేసే సమాజు సంస్కృత నమస్సే కదా ! భారతదేశం లోని యే మతం వాళ్ళు అయినా సరే, యే ప్రయోజనం కోసమైనా సరే, సంస్కృత పదజాలాన్ని స్వేచ్ఛగా వాడుకోవచ్చు. అలా వాడుకోవడమే నిజమైన జాతీయత అవుతుంది కూడ.

గాంధీజీ సిద్ధాంతాలను అక్షరాలా అమలు జరిపే నైష్ఠికుడు, సత్యాగ్రహి, సౌమ్యుడు అయిన డాక్టరు ఖానులో ఇంతటి విప్లవాత్మక శక్తి ఉండటం ఎంతో మహిమాన్వితం అనిపించింది నాకు. అందుకే అలాంటి మనస్తత్వమే కల నేను, ఆయనకి మరీ సన్నిహితుణ్ని కాగలిగాను.

★★★

## 2. ముస్లింలీగుతో తెగత్రెంపులు

అది 1945, జూలై 31వ తేది.

ఉషఃకిరణాలు బాణాల్లా దూసుకు వస్తున్నై తూర్పు నుంచి, చీకట్లు తిరిగి తిరిగి చూస్తూ పారిపోతున్నై పడమటి ముఖంగా. బ్రిటిషు సామ్రాజ్యంలో రవి అస్తమించ బోతూ, భారతదేశంలో ఉదయించబోతూ ఉన్న సంధ్యాసమయం అంది.

ఎవరో ఎత్తి కుదేసినంత ఊపుతో నిద్రలేచింది బెజవాడ పట్టణం ఆ ఉదయం. ఇంకా తిన్నగా తెల్లవారలేదు. పారిపోతున్న చీకట్లు వదిలి వేసిన మందుగుండు సామగ్రిలా పట్టణ నడివీధుల్లో గుండెలదర గొడుతున్నాయి పందులు. బెజవాడ ప్లాట్‌ఫారం మీద నుంచి కలకత్తా మెయిలు ఇంకా కదలనే లేదు. అది తెచ్చిన మద్రాసు పత్రికలు అప్పుడే కాఫీ హోటళ్ళలో ఇడ్లీలకు ఆర్డర్లు ఇస్తున్నాయి. రాజకీయ పార్టీల కార్యాలయాలలో వేడివేడి చర్చలు ప్రారంభమైనాయి. కాంగ్రెసు కార్యకర్తల ముఖాలలో సూర్యోదయ కాంతులు కట్టలు త్రెంచుకొంటూ ఉంటే, ముస్లిం లీగర్ల ముఖాల్లో క్రోధం అకాండతాండవం చెయ్యసాగింది. మొత్తం పట్టణం త్రుళ్ళిపడి, కళ్ళు నులుపుకొని, లేచి చూచేసరికి వాతావరణం శాంతభయానక రసాల కోలాహలంతో నిండిపోయి ఉంది.

ఈ పత్రిక లేమిటి ? ఈ ఉద్రేకా లేమిటి ? ఇంత పట్టణమూ ఇలా అట్టుడికి నట్టు ఉడికిపోతుండడానికి ఏమిటి కారణం ?

ఏం జరిగిందా ఉదయం ?

ఆ ఉదయం వచ్చిన పత్రికలలో డాక్టరు ఎం.ఏ. ఖాను చేసిన ప్రకటన

వుంది. కృష్ణా జిల్లా ముస్లింలీగు ఉపాధ్యక్ష పదవికీ, లీగు సభ్యత్వానికీ రాజీనామా చేస్తూ ఆయన చేసిన ప్రకటన అది.

"ముస్లింలీగు మహమ్మదీయుల హక్కులను కాపాడ గలదని నేను దానిలో చేరాను. కృష్ణాజిల్లా ముస్లింలీగుకు 1944లో జాయింట్ సెక్రటరీగానూ, 1945లో ఉపాధ్యక్షుడుగానూ ఉన్నాను. ఇండియాకు స్వాతంత్ర్యం ద్వారా మహమ్మదీయులు స్వతంత్రులు కావాలని నా కోరిక. వైస్రాయి కార్యవర్గంలో, హిందువులతో సమానంగా మహమ్మదీయులకు సభ్యత్వం ఇస్తానని వేవెల్ ప్రభువు చెప్పినప్పటికీ, జిన్నా సాహేబ్ ఒప్పుకోలేదు. చాలా మూర్ఖించి కూర్చున్నాడు. ఆ విధంగా సిమ్లా సభ భగ్నమై పోయింది. ఆ విధంగా మహమ్మదీయుల స్వాతంత్ర్య ప్రాప్తికి జిన్నా సాహేబ్ ప్రతిబంధక మైనాడు. బెంగాలులో కూడు గుడ్డ లేక వేల మంది ముసల్మానులు చచ్చిపోయారు. ప్రజాప్రభుత్వాలు యేర్పడి దొంగ వ్యాపారస్తుల్ని శిక్షించి, ఆకటిచావుల నుండి ప్రజల్ని రక్షించడానికి వీలు లేకుండా జిన్నా సాహేబ్ చేశాడు. కనుక జిన్నా సాహేబ్ దేశభక్తుడు కాడు. ఆయన మహమ్మదీయుల క్షేమం కోరేవాడు కాడు. మహమ్మదీయుల ప్రతినిధి కాడు. కాంగ్రెసు ప్రెసిడెంటు అయిన ఆజాద్ గారే జిన్నాగారి కంటే ఎక్కువ ప్రశంసాపాత్రంగా వ్యవహరించారు. మహమ్మదీయుల హక్కులను కూడా కాపాడగలిగి నట్టిది కాంగ్రెసు సంస్థే అని చూపించారు. సిమ్లా సమావేశం అయిన తర్వాత కాంగ్రెసు పట్ల మహమ్మదీయులకు గల అనుమానాలన్నీ తీరిపోయాయి. అందువల్ల ముస్లింలీగులో నా సభ్యత్వానికి రాజీనామా ఇస్తున్నాను. ఆంధ్ర దేశంలోని నా సోదర మహమ్మదీయులు కూడా ముస్లింలీగును విసర్జించి, కాంగ్రెసులో చేరి, మహమ్మదీయుల క్షేమాభివృద్ధికై కృషి చెయ్యవలసిందిగా కోరుతున్నాను".

1945 ప్రాంతంలో, దేశంలో రాజకీయ వాతావరణం ఎంత ఉద్రేక పూరితంగా ఉండినదో తెలిసిన వారికీ, ఆ వాతావరణంలో ఆనాడు పడి కొట్టు కొంటున్న వారికీ, డాక్టరు ఖాను చేసిన ఈ ప్రకటన ఎలాంటి ఉద్రేకాలను రెచ్చగొట్ట గలదో, హిందూ ముస్లిం జన సమ్మిశ్రితాలై ఉన్న బెజవాడ వంటి పట్టణాల్లో ఎలాంటి తుఫానుల్ని సృష్టించ గలదో వేరే చెప్పనక్కర లేదు. ఖానుగారి ఈ ప్రకటన వరుసగా

దేశంలోని తెలుగు, ఇంగ్లీషు పత్రిక లన్నిటిలోనూ రావడంతో, ఆలిండియా రేడియో ఢిల్లీ కేంద్రం నుంచి కూడా ప్రసారం కావడంతో ఒక ఆంధ్రదేశం లోనే గాక, మొత్తం భారతదేశంలోనే రగులుతున్న అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

విమర్శలూ, వ్యాఖ్యానాలూ, చర్చలూ, సమావేశాలూ తీవ్రంగా కొనసాగినాయి. ఆవేశకావేషాలు మిన్ను ముట్టినై. ఒక ప్రక్క మహమ్మదీయుల్లో ఉద్రేకాలు రెచ్చ గొట్టడానికి ముస్లింలీగు కార్యకర్తలు తంటాలు పడుతూ ఉండగా, మరోప్రక్క కమ్యూనిస్టు పార్టీ వారు ఖానుగారిని విపరీతంగా విమర్శించడం మొదలు పెట్టారు. డాక్టరు ఖాను ముస్లింలకు ద్రోహం చేశాడనీ, జనాబ్ జిన్నాగారి వద్ద ఆంధ్ర ముస్లింలకు తలవంపులు తెచ్చాడనీ తిట్టిపోశారు. దేశంలో ముస్లింల పరిస్థితి ఏమిటో, ముస్లింల హక్కులు ఏమిటో, సాధారణ ముస్లిం జనం పల్లెలలో, పట్టణాలలో ఎలా బ్రతుకుతున్నారో, వారికి కావలసిం దేమిటో తెలియని మతోన్మాదులు దానితో పెట్రేగి, డాక్టరు ఖానును ఎన్నో బాధలు పెట్టారా రోజుల్లో.

అందులో ఒక రోజు –

★★★

## 3. మతమౌఢ్య పరాకాష్ఠ

“ఉద్రేక పూరితులైన కొందరు రౌడీలు 'జిన్నా జిందాబాద్, ఖాన్ ముర్దాబాద్' అంటూ వచ్చేస్తున్నారు. కర్రలు, బరిసెలు పుచ్చుకొని ఆవేశంతో ఊగిపోతూ దండెత్తు కొస్తున్నారు. ఇక్కడ ఉండడం అపాయకరం. వెంటనే మీరు ఇక్కడ నుంచి తప్పించుకోండి. అదిగో ! అప్పుడే ఓవర్ బ్రిడ్జి దాటారు. ఆలస్యం చేయవద్దు. తొందరగా వచ్చెయ్యండి” అంటూ తొందరచేశాడు ఒక మిత్రుడు గాంధీనగరంలో వున్న నా ఆస్పత్రికి వచ్చి. చాలా కంగారుగా ఉన్నాడు అతడు. అప్పటికే ఆ రౌడీ మూకల దౌర్జన్య నినాదాలు సమీపంలోకి వచ్చేసినాయి.

“సరే, వారిని రానియ్యండి, నా పాలసీ వివరిస్తాను. వారికి నేను నచ్చ చెప్పగల ననుకుంటాను” – అన్నాను నేను. ఆస్పత్రి వరండాలోకి వచ్చి, దూరంలో ఆ గుంపును చూస్తూ.

ఆశ్చర్యంతో కళ్లు ఎర్రచేశాడా మిత్రుడు.

"వాళ్ళు మీ పాలసీలూ, గీలసీలూ వినే రకం కారు. వాళ్ళు విద్యా సంస్కారం కలవాళ్ళు కారు. మూఢ మతావేశం అనే పిశాచం ఆవేశించిన వాళ్ళు. కర్రలు, బరిసెలు తప్ప – మాటలూ, వాక్యాలూ అర్థం కావు వాళ్ళకి. మీరు మాట్లాడక ముందే దౌర్జన్యానికి దిగుతారు. వెంటనే ఆస్పత్రికి తాళం పెట్టి బయలుదేరండి" – అన్నాడా మిత్రుడు భయంతో వణికిపోతూ. అంటూనే నా సమాధానానికైనా ఎదురు చూడకుండా, కాంపౌండరును పిలిచి, తాళం వేయించి, నన్ను తనతో లాక్కు పోయాడు.

నేను తిన్నగా ఇంటిముఖం పట్టాను.

"ఇంటికి కాదు. మీ ఇల్లు వాళ్ళకు తెలుసు" – అంటూనే ఆ మిత్రుడు రిక్షా పిలిపించి, నన్ను ఎక్కించి, తిన్నగా అయ్యదేవర కాళేశ్వర రావుగారి ఇంటికి తీసుకువెళ్ళాడు.

క్విట్ ఇండియా మహావిప్లవంలోకి దూకి, విదేశీ ప్రభుత్వ క్రూర నిర్బంధంలో ఎంతో కాలం మ్రగ్గి, జైలు నుంచి విడుదలై వచ్చి, తీవ్రమైన కమ్యూనిస్టు వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఆంధ్ర అగ్రనాయకుడు కాళేశ్వరరావుగారు. బ్రిటిష్ పాలకుల యుద్ధవిధానాన్ని ఎదిరించి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరి కాంగ్రెసు నాయకులంతా జైళ్ళల్లో ఉండగా – కమ్యూనిస్టు పార్టీ మాత్రం బ్రిటిషు వారికి అండగా వుండడానికి నిర్ణయించుకొని, జాతీయ వ్యతిరేక వైఖరిని అవలంబించి, జిన్నాగారి పాకిస్తాన్ నినాదాన్ని బలపరుస్తూ తిరుగుతున్న రోజు లవి. రామకుమారవర్మ, మైనేని రామకోటయ్య, భూపతి కోటేశ్వరరావు, ఎన్.వి.యస్. ప్రసాద్, తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి, అన్నే శ్రీరాజ్యం వంటి యువతరం వారు కమ్యూనిస్టుల జాతీయ వ్యతిరేక ధోరణిని నిరోధిస్తూ, కాళేశ్వరరావు గారికి బాగా తోడ్పడ్డ కాలమది. పాకిస్తాన్ ఉద్యమానికి, జిన్నాగారి నాయకత్వానికి, కమ్యూనిస్టులు తోడ్పడకపోతే, మతోన్మాదాన్ని రెచ్చకొట్టకపోతే ముస్లింలీగు వర్కర్లు అంతగా రెచ్చిపోయి ఉండేవారు కారు. "ఏది యేమయినా ఆ రోజు కాళేశ్వరరావుగారి ఇల్లు చేరివుండక పోతే ఆనాటి కల్లోలంలో నేను ఏమై పోయి ఉండేవాడినో" అన్నాడు డాక్టరు ఖాను – ఆ రోజు సంఘటనలను గుర్తుకు తెచ్చుకొంటూ.

మూడు రోజుల పాటు కాళేశ్వరరావుగారి ఇంట్లోనే ఉన్నాడు డాక్టరు ఖాను. అలా ఉండక తప్పలేదు ఆయన. ఆ మూడు రోజులూ ఆయన పడిన మనోవేదన ఇంతా అంతా అనడానికి వీలు లేదు.

"ఆస్పత్రి మూసి వుండటం చూచి రెచ్చిపోయిన రౌడీ మూకలు, నాకు వ్యతిరేక నినాదాలు చేసుకొంటూ, ఉచ్చరించరాని దుర్భాషలతో అచట నుంచి కదిలి, అరండేల్ పేటలో వున్న మా ఇంటిని చుట్టుముట్టి, ముస్లిం లీగ్ - జిందాబాద్, డాక్టర్ ఖాన్ - మురదాబాద్ అంటూ కొంతసేపు అరచి, అక్కడ నుంచి కదలి వెళ్ళారట. ఆ తర్వాత జిన్నా లైబ్రరీ వద్ద మీటింగ్ పెట్టి, ఆ సభలో అనేక విధాల నన్ను దూషించారట. ఈ విషయాలు ఎప్పటి కప్పుడు నాకు తెలుస్తూనే ఉన్నాయి. నా కుటుంబ రక్షణ గురించి నేను ఎప్పుడూ ఆందోళన పడలేదు. ఆ భారాన్ని కాళేశ్వర రావుగారు తదితర కాంగ్రెసు యువ కార్యకర్తలూ స్వీకరించారు. ముస్లింలీగు వర్కర్ల దౌర్జన్యానికి కూడా నేను భయపడలేదు. లీగ్ నుంచి నా రాజీనామా, జిన్నాగారిపై నేను చేసిన ఆరోపణలూ లీగర్లకు కోపం తెప్పించటం సహజమే. మతపిచ్చి కలవాళ్ళు సత్యాన్నీ, హేతువునూ దర్శించలేరు. అటువంటి మూఢోన్మాదులు ప్రతి మతంలోనూ వుంటారు. అందుకు నే నేమీ చింతపడలేదు, భయపడలేదు. కాని, నా మీద వ్యతిరేక ప్రదర్శనలు చేసిన మూకలో ఎంతోమంది హిందూ యువకులు కూడా ఉండటం నన్ను చాలా ఆందోళన పరిచింది. విచారంలో ముంచింది. విదేశీ పరిపాలకుల సామ్రాజ్యవాద యుద్ధం ప్రజాయుద్ధ మంటూ ప్రచారం చేస్తున్న కమ్యూనిస్టులు భారతీయ యువకుల్ని ఎలా పెడదారులు పట్టిస్తున్నారో చూచి, చాలా భయపడ్డాను, బాధపడ్డాను. నేను బయటకు పోయి, నా దృక్పథాన్ని, నా చర్యలో వున్న సహేతుకతను ప్రజలకు వివరించి చెప్పాలని యెన్నోసార్లు ప్రయత్నించాను. అందుకు కాళేశ్వర రావుగారు, మరుపిళ్ళ చిట్టిగారు వంటి మిత్రులు అంగీకరించ లేదు" అన్నా డాయన - అప్పటి తన మనస్థితిని గురించి వివరిస్తూ.

ఆ తర్వాత కాళేశ్వర రావుగారే ఒక కారును యేర్పాటు చేసి - ఆయననూ, ఆయన కుటుంబాన్ని నిడదవోలు పంపించివేశారు. నిడదవోలు డాక్టరు ఖాను అత్తవారి ఊరు.

★★★

# 4. ప్రహ్లాద చరిత్ర

"డాక్టరు ఖాను ఈ మెయిల్లో ప్రయాణం చేస్తున్నాడు" అనే టెలిగ్రాములు వందలూ వేలూ యివ్వబడేవి ఆ రోజుల్లో.

రైలు మార్గానికి సమీపంలో వుండే ప్రతి పట్టణానికీ అందేవి ఈ టెలిగ్రాములు. ఆయనను అల్లరి పెట్టడం కోసం ముస్లీం లీగర్లకు, ఆయనకు రక్షణ కల్పించడం కోసం కాంగ్రెసు వర్కర్లకు కూడా అందేవి అవి. ఏ స్టేషన్ ప్లాట్‌ఫారం మీదనైనా ఆయన ప్రయాణం చేస్తున్న మెయిలు ఆగగానే, వ్యతిరేక నినాదాలతో లీగర్లు ప్రదర్శనాలు జరిపేవారు. ఎలాంటి ఆత్యయిక పరిస్థితి ఏర్పడినా ఎదుర్కోడానికి కాంగ్రెసు వాలంటీర్లు కూడా హాజరుగానే వుండేవారు. ఆనాటి రాజకీయ వాతావరణం అలాంటిది. ఉద్రేకాలు అట్టివి.

నిడదవోలులో అత్తవారి ఇంట ఒక వారం రోజులు వుండి, తరువాత కార్యక్రమానికి ఒక పథకం వేసుకొని, బెజవాడ వెళ్ళి కాళేశ్వరరావుగారి ఆమోదం పొంది, ఆంధ్ర జిల్లాలలో పర్యటించడం ప్రారంభించా డాయన. అట్టి పర్యటనల సందర్భాలలో ఆయన ఎదుర్కొన వలసిన పరిస్థితి ఎంతో విషమం.

ఆ రోజుల్లో ఆయన ప్రయాణాలూ, రైల్వే ప్లాటుఫారాల మీద ప్రదర్శనాలూ, మహాసభల్లో ప్రతిఘటనలూ, జాతీయ భావావేశంలో ఆయన పడ్డ బాధలూ వింటూ వుంటే నాకు ప్రహ్లాద చరిత్ర జ్ఞాపకానికి వచ్చింది.

సత్యాన్నీ, శ్రేయాన్నీ గుర్తించలేని హిరణ్యకశిపుని రాక్షస మూకల మధ్య, ఆనాడు ప్రహ్లాదుడు పడ్డ బాధలు కూడా ఇటువంటివే కదా అనిపించి – దృఢ నిశ్చయంతో, సత్యం కోసం పోరాడే ప్రతి జీవితం లోనూ కూడా చరిత్ర పునరావృత్తం అవుతుంది కదా అని ఆశ్చర్యపడ్డాను నేను.

చరిత్ర పెద్ద కొండ వంటిదే కావచ్చు. అది ఎంత చిన్న అద్దంలో అయినా ప్రతిబింబించక తప్పదు. వ్యక్తి పెద్దవాడైతే, అగ్రస్థానం లోని వాడైతే, అతని కాలిచెప్పు తెగినా అది చారిత్రక విషయమే అవుతుంది. దానికి పత్రికల వంటి ప్రచార సాధనాలు

పెద్ద శీర్షిక పెడతాయి. వ్యక్తి సామాన్య ప్రజలలో ఒకడైనప్పుడు, అతడు దేశసేవలో తన సర్వస్వాన్ని, తుదకు ప్రాణాన్ని కూడా కోల్పోయినా, అది చరిత్రకు కాదు కదా, స్థానిక పత్రికలకు కూడా ఎక్కదు. మానవుడు కల్పించుకొన్న ఈ హెచ్చు తగ్గులు, ఇక్కడ సాంఘిక ప్రయోజనాలకు ఉపయోగపడవచ్చు, సృష్టి ప్రణాళికలో మాత్రం మనిషికీ – మనిషికీ మధ్య తేడా ఉండదు.

అధికార బధిరాంధక దౌర్జన్యాన్ని ధైర్యంతో ఎదిరించి నిల్చే ప్రతి యువకుడూ ప్రహ్లాదుడే నా దృష్టిలో, అతడు రాజపుత్రుడే కాని, కార్మిక బాలుడే కాని, అమీర్ గాని, గరీబ్ కానీ.

ఆంధ్రదేశం మొత్తం మీద ప్రతి ముఖ్యప్రాంతం లోనూ పర్యటించి ముస్లిం లీగుకు వ్యతిరేకంగా, కాంగ్రెసును బలపరుస్తూ, డాక్టరు ఖాను చేసిన అసంఖ్యాకమైన ప్రసంగాల ధోరణి ఎలా ఉండేది ?

"మౌలానా ఆజాద్‌గారి అధ్యక్షతను అఖిల భారత కాంగ్రెసు 1942వ సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో సమావేశమై, సంపూర్ణ స్వాతంత్ర్యం క్విట్ ఇండియా తీర్మానములు చేసింది. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు ఈ తీర్మానాలకు ఆగ్రహావేశ పూరితులై దేశనాయకుల నందరినీ నిర్బంధించారు. అగ్రనాయకులే గాక రాష్ట్ర, జిల్లా, తాలూకా, గ్రామస్థాయి నాయకుల్ని కూడా, ప్రజావిశ్వాసాన్ని చూరగొన్న ప్రతి కాంగ్రెసువాదినీ కూడా జైళ్ళలో పెట్టారు. ఒక ప్రక్క గాంధీజీ నాయకత్వము క్రింద, జాతీయ కాంగ్రెసు నాయకు లందరూ సత్యాగ్రహోద్యమానికి గురై దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సలుపుతూ కారాగారాల్లో మ్రగ్గుతూ ఉండగా, మరో ప్రక్క సుభాస్ చంద్రబోసు వంటి తీవ్రవాదులు సైనిక చర్యల ద్వారా విదేశీయ ప్రభుత్వాన్ని దేశం లోంచి వెడలగొట్టి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించటానికి కంకణం కట్టుకొని అజాద్ హింద్ ఫౌజ్‌ని నిర్మించి "ఢిల్లీ ఛలో" అంటూ జైత్రయాత్ర సాగుతున్న సమయంలో, జాతీయ వ్యతిరేక చర్యలకు కమ్యునిస్టు పార్టీ పూనుకొంది. నేతాజీ వంటి జాతీయ మహావీరుణ్ని దేశద్రోహి అంటూ నినాదాలు ఇవ్వసాగింది.

"ఈ విధంగా దేశం అల్లకల్లోలంలో మునిగి ఉండగా, ముస్లిం లందరకు తానే నాయకుడ నంటూ జిన్నా సాహెబ్‌గారు బయలుదేరారు. దేశానికి, భారతజాతికి,

జాతీయోద్యమానికి వ్యతిరేకంగా ముస్లింలలో మతదురభిమానాన్ని రెచ్చగొట్టారు. "ఇస్లాం ఇన్ డేంజర్" అనే నినాదాన్ని లేవనెత్తారు. అమాయకులైన ముస్లింలను మత పిచ్చి ద్వారా లోబరచుకొని, పాకిస్తాన్‌కు అనుకూలంగా చిలుక పలుకులు పలికిస్తున్నారు. విడదీసి పాలించడమే రాజనీతిగా గల బ్రిటిష్ పాలకులు జిన్నాగారి నాయకత్వానికి పక్క తాళం వేస్తున్నారు. ఈ పరిస్థితిని, ఈ కల్లోలాన్ని, అవ్యవస్థని తమ పార్టీ పలుకుబడిని పెంచుకోవడం కోసం కమ్యునిస్టులు అటు బ్రిటిష్ వారికి ఇటు జిన్నాగారి ముస్లింలీగుకు వంతపాట ప్రారంభించారు. పాకిస్తాన్‌ను సమర్థిస్తూ, జిన్నా నాయకత్వాన్ని బలపరుస్తూ కమ్యూనిస్టులు చేస్తున్న ప్రచారం, కమ్యూనిస్టు పార్టీ మూలసూత్రాలకే ఎంత విరుద్ధమైందో, మతోద్రేకాన్ని రెచ్చగొట్టడం ఎంత సిద్ధాంత ద్రోహకరమైన విధానమో అందరికీ తెలిసిందే. పాకిస్తాన్ ఉద్యమం బలపడటానికి జిన్నాగారి వాద బలంకన్న, కమ్యునిస్టుల ప్రచారబలమే ఎక్కువగా తోడ్పడిందంటే అది అతిశయోక్తి మాత్రం కాదు.

"ఇంతకూ, పాకిస్తాన్ అంటే ఏమిటి ? మొన్న సిమ్లా సమావేశం వరకు దాని నిజస్వరూపం ఎవరికీ ఎరుక పడలేదు. పాకిస్తాన్ అంటే ముసల్మానుల హక్కులు గుర్తించడం, వారి మతస్వేచ్ఛను రక్షించడం, వారిని సాంఘికంగా అభివృద్ధి పరచడం అని కమ్యునిస్టులు ప్రచారం చేశారు. దానికి ముస్లిం నాయకు లంతా తలలాడిం చేశారు. జిన్నాగారు కూడా పాకిస్తాన్ అంటే మొన్నటి వరకూ స్పష్టం చేయలేదు. పాకిస్థాన్ అంటే ముస్లింల అభివృద్ధికి కృషి చేయడం అనే చాలా మంది ముస్లిం ప్రజలు భావించారు. నేను కూడా అలానే అనుకొన్నాను. అందుకే, జాతీయవాదినైన నేను ముస్లిం లీగులో చేరి ప్రధానమైన బాధ్యతలు నిర్వహించాను. పాకిస్తాన్ అంటే దేశాన్ని రెండు ముక్కలు చెయ్యడం అని జిన్నాగారు స్పష్టపరిచేదాకా నేనూ, నాలాంటి అనేక మంది జాతీయ భావాలు గల దేశభక్తులైన ముస్లిం సోదరులూ అదే భ్రాంతిలో ఉన్నాం.

"ఫైట్ ఫర్ పాకిస్తాన్ ఈజ్ ఫైట్‌ఫర్ ఇండియాస్ ఇండిపెండెన్స్" (పాకిస్తాన్ కోసం పోరాడటమే భారత స్వాతంత్ర్యం కోసం పోరాడటం) అనే మొన్నటి వరకూ లియాఖత్ అలీఖాన్‌గారు కూడ చెపుతూ వచ్చారు. మా అందరి భ్రాంతి మొన్నటితో

(1945 జులై సిమ్లా కాన్ఫరెన్సుతో) విడిపోయింది. పాకిస్తాన్ అంటే దేశవిభజన అని స్పష్టపడి పోయింది. దేశాన్ని రెండు ముక్కలు చేయడం మొత్తం భారత జాతికే గాక, ముస్లింలకు కూడా తీరని అపకారం చెయ్యడమే. శాశ్వతమైన కీడును కలిగించడమే. ఏదో కొద్దిమంది జనాబ్‌ల ప్రాభవాడంబరాల కోసం, కోట్ల కొలది పేద ముస్లింలకు ఘోరమైన అన్యాయం చెయ్యడమే. ఈ విషయంలో నా కే మాత్రం సందేహం లేదు. అందుకే, పాకిస్తాన్ డిమాండ్ లోని నిజస్వరూపం నాకు గోచరించిన తక్షణమే నేను ముస్లింలీగు సభ్యత్వానికి రాజీనామా చేశాను. ముస్లిం ప్రజానీకానికి పాకిస్తాన్ వాదం తీరని అపకారం కలిగిస్తుంది. ముస్లింల భవిష్యత్తును నాశనం చేస్తుంది. ఏదో, ఎక్కడో కొద్దిపాటి భూభాగం ముస్లింల వాటాకు వస్తే రావచ్చు. ఎక్కడో, ఏదో కొద్దిమంది ముస్లిం నాయకుల అహంకారానికి మేత దొరికితే దొరక వచ్చు. కాని, జనాబ్ జిన్నాగారి కోరిక ఫలించి, దేశం ముక్కలై పాకిస్తానే ఏర్పడితే – అసంఖ్యాకులైన ముస్లిం ప్రజలు, సుప్రసిద్ధమైన, సువిశాలమైన భారత ఉపఖండాన్ని శాశ్వతంగా పోగొట్టుకున్న వారవుతారు. అటువంటి దుష్టచర్యతో నేను సంబంధం పెట్టుకో దలుచుకోలేదు. అందుకే ముస్లిం లీగు నుంచి బయటకు వచ్చేశాను.

"హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, బ్రహ్మ సామాజికులు, ఆర్యసామాజికులు – ఈ విధంగా అనేక వర్గాల వారు చిరకాలంగా భారతదేశంలో ఇరుగు పొరుగున అన్నదమ్ముల వలె కలిసి మెలసి నివసిస్తున్నారు. అలాగే ఎల్లప్పుడూ కలసి ఉండాలనే నా కోరిక. తత్కాలికమైన కష్టాలు, నష్టాలు, కలహాలు, కావేషాలు ఒక పురాతన జాతిని శాశ్వతంగా విడదీయకూడదు. అలాంటి కలహ కావేషాలు మతాల మధ్యే కాదు... కులాల మధ్య, కుటుంబాల మధ్య, స్వంత అన్నదమ్ముల మధ్య కూడా ఏర్పడుతూనే ఉంటాయి. అంతమాత్రం చేత దేశాన్ని ముక్కలు చేస్తాం అనడం అన్యాయం. క్రైస్తవులు, హిందువులు కలిసి బ్రతకడం లేదా ? శతాబ్దాల పాటు హిందువులు ముస్లింలు కలిసి బ్రతక లేదా ? దేశాన్ని విభజింప వలసిన అవసరం ఇప్పుడేం వచ్చింది ?

"అందువల్ల జనాబ్ జిన్నాగారి వాదంతో నేను కాదు మతి ఉన్న ఏ ముస్లిం సోదరుడు కూడా అంగీకరించడు. అంగీకరించలేడు. దేశభక్తుడైన ఏ భారతీయుడూ

అట్టి దుశ్చర్యను సహించలేదు. మనమంతా కలిసి బ్రతుకుదాం. దేశాభ్యుదయం కోసం కలిసి కృషి చేద్దాం. అందుకు ముందుగా కాంగ్రెసువారి క్విట్ ఇండియా తీర్మానం అమలు జరుగవలసి ఉంది. దేశం నుంచి విదేశీ పాలకులు వైదొలగ వలసి ఉంది. అందు నిమిత్తం మనమంతా ఏకైక జాతీయ సంస్థ అయిన కాంగ్రెసును బలపరచవలసి ఉంది".

ఈ ధోరణిలో సాగింది ఆ కాలంలో డాక్టరు ఖాను రాజకీయ ప్రచారం.

★★★

## 5. ముస్లింలకు తెలుగే మాతృభాష

కేవలం తెలుగు రాని ముస్లింలతో మాట్లాడవలసి వచ్చినపుడు మాత్రమే డాక్టరు ఖాను ఉరుదూ భాషను ఉపయోగించేవాడు. తక్కిన సమయాలలో ఆయన స్వచ్ఛమైన తెలుగునే మాట్లాడేవాడు. ఆయన ఉపన్యాసాలన్నీ తెలుగులోనే సాగాయి.

నిజానికి తెలుగు దేశంలో ఉన్న ముస్లిం లందరికీ తెలుగే మాతృ భాష. అలానే ఏ రాష్ట్రంలో ఉన్న ముస్లింలకు... ఒక్క ముస్లింలకే కాదు, ఏ మతం వారికైనా సరే... ఆ రాష్ట్ర భాషే మాతృభాష.

ఉరుదు దేశ భాష కాదు. ఏ రాష్ట్ర ప్రజలకూ అది మాతృభాష కాదు.

పూర్వం మధ్య ప్రాంతం నుంచి పారసీకులు, తురుష్కులు, అరబ్బులు వంటి పరభాషీయులు భారత దేశంపై దండెత్తి వచ్చి, ఇక్కడ రాజ్యాలు నెలకొల్పుకొన్న ఆ రోజుల్లో... దైనందిన ప్రజావ్యవహారాల నిర్వహణ కోసం, స్వదేశీ, విదేశీ పదాల సమ్మిశ్రణంతో ఒక కొత్త భాష ఏర్పడ్డది. అది అటు విదేశీ భాషా కాదు, ఇటు స్వదేశీ భాషా కాదు. భారతదేశానికి వచ్చి భారతీయులుగా నిలచిపోయిన మధ్య ప్రాచ్యుల రాజరికాలకు పరిపాలనా భాషగా ఆ మిశ్రభాష అభివృద్ధి పొందింది.

ఆ మిశ్ర భాష నుంచే విదేశీ లిపితో, విదేశీ పదజాల ప్రాబల్యంతో హిందుస్తానీ ఏర్పడింది. నిజానికి ఈ రెండు భాషల స్వరూపం మొత్తం మీద ఒకటే. ఈ రెండూ కూడా సిసలైన దేశభాషలు కావు. ఢిల్లీ చుట్టు ప్రక్కల పరిపాలనా సంబంధంగా ప్రచారంలో ఉన్న ఈ భాషలు, రాజ్యోద్యోగులతో పాటు దేశం

నలుమూలలకూ విస్తరించిన మాట నిజమే. అంత మాత్రం చేత అవి ఎవరికీ మాతృభాషలు కాలేవు.

ఈనాడు ఇంగ్లీషు భాష భారతదేశం లోని ఏ రాష్ట్ర ప్రజలకూ మాతృభాష కానట్టే, ఉరుదు కూడ కాదు. అందువల్లనే... ఈ వైజ్ఞానిక కాలంలో కూడా ఇంకా మతాచార మూఢులుగా ఉన్నవారిని అలా ఉంచేస్తే – ఏ రాష్ట్రంలో ఉన్న ముస్లింలకు ఆ రాష్ట్రభాషే మాతృభాష. ఈ సత్యం ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన దక్షిణాది రాష్ట్రాలలో ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నది.

తెలుగు దేశంలో నివసిస్తున్న మహమ్మదీయు లంతా తెలుగు ప్రజలే. వారికి తెలుగు భాష క్షుణ్ణంగా రావాలి. తక్కిన దక్షిణాది రాష్ట్రాల లోని ముస్లింలకు ఆ రాష్ట్ర భాషలు తప్ప. ఉరుదు భాష రానే రాదు.

మతం వేరు. భాష వేరు. వ్యక్తి ఏ మత విశ్వాసాలు కలిగి ఉన్నా, ఏ సంప్రదా యాలను అనుసరించినా, భగవంతుణ్ని ఏ రూపంలో ధ్యానించినా, తాను ఏ నేలలో పుట్టాడో ఆ నేలకు స్వభావ సిద్ధమైన భాషలో అట్టి అనుష్టానాన్ని జరిపినప్పుడే, దానికి ఆత్మీయత సిద్ధించి పరమాత్మీయత లభిస్తుంది. భాషకు ప్రాధాన్యం ఇచ్చేవారికి మతం అప్రధానం. మతానికి ప్రాధాన్యం ఇచ్చేవారికి భగవంతుడు అప్రధానం. భగవంతుడికే ప్రాధాన్యం ఇచ్చేవాడికి కులం, మతం, భాష, దేశం వంటి వన్నీ అప్రధానాలే.

తన మాతృభాష అయిన తెలుగులో మంచి ప్రవేశాన్ని సంపాదించిన డాక్టరు ఖాను అచిరకాలం లోనే తెలుగు ప్రజల, నాయకుల అభిమానాన్ని చూరగొన గలిగాడు.

"ఆంధ్రదేశంలో తెలుగులో నావలె మాట్లాడగల వాడివి నీవొక్కడవే !" అంటూ వేదిక మీదనే కౌగిలించు కొన్నాడు, ఆయనను మహాకవి ఉమర్ ఆలీషా... ఒకసారి బాపట్లలో ఒక సభలో. ఉమర్ ఆలీషా మహాకవి, మహావక్త. ఆ రోజులలో ఉపన్యాస ధోరణిలో ఆయనను మించినవారు నిజంగానే లేరు.

సంకుచిత మత రాజకీయాల నుంచి వైదొలగి, స్వచ్ఛమైన ఇస్లాం సిద్ధాంతాలను అనుసరిస్తూ, జాతీయోద్యమంలోకి ఉరికాడు కనుక... అకలంక దేశభక్తుడుగా, దేశదాస్య విమోచనా రణయోధుడుగా ప్రఖ్యాతి గడించాడు కనుక...

అప్పటి రాష్ట్ర కాంగ్రెసు అగ్రనాయకులైన అయ్యదేవర కాళేశ్వరరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం, వి.వి.గిరి, కళావెంకట్రావు, ఆచార్య రంగా, తెన్నేటి విశ్వనాథం, పల్లంరాజు, కడప కోటిరెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, మాగంటి బాపినీడు, వేముల కూర్మయ్య, బి.యస్.మూర్తి, అల్లూరి సత్యనారాయణ రాజు వంటి వారి ప్రశంసలకు పాత్రమైనాడు డాక్టరు ఖాన్.

★★★

## 6. పార్టీల పతనాలూ, హేతువులూ

కాంగ్రెసు నాయకులూ, కార్యకర్తలూ అంతా జైళ్ళ నుంచి విడుదలై వచ్చి, తిరిగి జాతీయోద్యమం ఉవ్వెత్తున విజృంభిస్తున్న తరుణంలో 1947లో సార్వత్రిక ఎన్నికలు తలపెట్టబడినాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర మండలి గెలిచింది. అయినా బ్రిటన్‌కు విజయోత్సవం లేకుండా పోయింది. ఆయుధాలతో సాయుధులైన శత్రులోకాన్ని నిర్జించగలిగిన బ్రిటన్ భారతదేశంలో నిరాయుధమైన స్వాతంత్ర్యోద్యమాన్ని ఏమీ చెయ్యలేక పోయింది.

కాంగ్రెసు వారి క్విట్‌ఇండియా తీర్మానానికి బ్రిటన్ ఇక తల ఒగ్గక తప్పదేమో అన్న పరిస్థితి అది.

ఒక ప్రక్క నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్, మరొక ప్రక్క ఐ.యన్.యస్. తిరుగుబాటు, ఇంకొక ప్రక్క షానవాజ్, ధిల్లాన్ ప్రభృతుల విచారణ. అదే సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ, భులాభాయిదేశాయి వంటి మేధావులు నాదబలం. దేశం నిండా స్వాతంత్ర్యోద్యమం, ప్రజావాహిని పొంగు... ఈ పరిస్థితులలో జరిగినాయి ఆ ఎన్నికలు.

ఆ ఎన్నికల సందర్భంలో కాళేశ్వరరావుగారు డాక్టరు ఖానుకు కబురు చేసి, కృష్ణాజిల్లా ముస్లిం నియోజకవర్గం నుంచి కాంగ్రెసు తరపున శాసన సభకు నిలబడ వలసిందిగా కోరారు.

అందుకు ఖాను ఒప్పుకోలేదు.

తనకు పదవీ వ్యామోహం లేదనీ, అయినప్పటికీ ముస్లిం నియోజక వర్గం నుంచి కాంగ్రెసు గెలవడం సాధ్యం కాదనీ కాళేశ్వరరావుగారికి ఆయన చెప్పాడు.

అప్పటికి ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గపు పద్ధతి ఉంది. ముస్లిం నియోజక వర్గం నుంచి నిలబడే అభ్యర్థిని ముస్లిం ఓటర్లు మాత్రమే ఎన్నుకోవలసి ఉంది. హరిజనులకు కూడ ప్రత్యేక నియోజకవర్గ పద్ధతి ఉంది. అది పాక్షిక మైనట్టిది.

పాక్షికపు పద్ధతిలో జాతీయవాది అయిన హరిజన అభ్యర్థి కాంగ్రెసు తరఫున ఎన్నిక కావడానికి వీలుంది. ముస్లింల విషయంలో అట్టి వీలు లేదు.

నూటికి తొంభై మంది ముస్లింలు ముస్లిం లీగు యొక్క దుష్ప్రచారత వ్యామోహంలో ఉన్నవాళ్ళే. అందువల్ల అక్కడ కాంగ్రెసు అభ్యర్థి గెలిచే అవకాశం లేదు. ఓడిపోవటం తప్పదని తెలిసి కూడా రంగంలో దిగడం అవివేకం. ఈ విషయా లన్నీ కాళేశ్వరరావుగారికి డాక్టరు ఖాను వివరించి చెప్పాడు.

డాక్టరు ఖాను అంచనా నిజమే. దానిని కాళేశ్వరరావుగారు ఆమోదించడమూ విజ్ఞతే.

అయితే నిజమైన అంచనాలను, సక్రమమైన నిర్ణయాలను అమలు జరుగ నివ్వరు అనుచరులు. తమ తమ స్వార్థాలతో నాయకుల నిర్ణయాలను కలుషితం చేసి, నిజాయితీ పరులను త్రోసిరాజని, తాము ముందుకు వస్తూ ఉంటారు చాలా మంది.

ఎంత బలమైన పార్టీలైనా విచ్ఛిన్నమై పోవడానికి, ఎంత ప్రజ్ఞావంతుడైన నాయకుడైనా పతనమై పోవడానికి అనుచరుల స్వప్రయోజన కాంక్షా ప్రాబల్యమే ప్రధాన హేతువు.

అలానే జరిగింది అప్పుడు కూడా – డాక్టరు ఖానును, కాళేశ్వర రావుగారిని కూడా గాదని – ముస్లిం సీటుకు కాంగ్రెసు అభ్యర్థి నిర్ణయించబడటం, అపజయం పొందటం కూడా జరిగిపోయిం దప్పుడు.

ఆ ఎన్నికలలో కాంగ్రెసు తరఫున చాలా తీవ్రమైన ప్రచారం చేశాడు డాక్టరు ఖాను. ముఖ్యంగా ఆ ప్రచారంలో చాలా భాగం ముస్లిం ప్రజలలో జరిగింది.

ముస్లిం ప్రజలలో జాతీయ భావాన్ని రేకెత్తించడానికి, జిన్నాగారు పన్నిన మతోద్రేక వాగురుల నుంచి ముస్లిం ప్రజానీకాన్ని విముక్తుల్ని చేయడానికి తగినంత మంది ముస్లిం కార్యకర్తలు, ప్రత్యేక ప్రచారకులు ఆనాడు కాంగ్రెసుకు లేరు. నిజానికి నేటికీ లేరు.

అసహాయ వీరుడుగా డాక్టరు ఖాను చేసిన త్యాగం, ముస్లింల పట్ల కాంగ్రెసు వారికి కల అభిమానాన్ని పెంచగలిగిందే కాని, కాంగ్రెసు వారికి మాత్రం ముస్లిం వోట్లను ఎక్కువగా తేలేకపోయింది.

ఆ రోజుల్లో హరిజన ప్రజల పరిస్థితి కూడా ఒక విధంగా అలాంటిదే.

రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా ఉన్నాను నే నప్పుడు. హరిజన ప్రజల్లో కాంగ్రెసు లక్ష్యాలను ప్రచారం చేసి, అసంఖ్యాకంగా వారిని కాంగ్రెసు సంస్థలో చేర్చడం అప్పటి నా లక్ష్యం. హరిజనులకు ప్రత్యేక కాలనీల పద్ధతి కావాలన్న డాక్టర్ అంబేడ్కర్ గారి విధానం ఫలకారి కాదని జాతీయ సమైక్యం కోసం పోరాడిన కొద్దిమంది ఆంధ్ర జాతీయ వాదుల్లో నే నొకణ్ని.

వేముల కూర్మయ్య, బి.యస్. మూర్తిగార్ల అగ్రనాయకత్వం క్రింద, హరిజన ప్రజాబాహుళ్యంలో కాంగ్రెసు ప్రచారం బాగానే జరిగింది. కాని, సామాన్య హరిజన ప్రజలలో మాత్రం కాంగ్రెసు పట్ల సంపూర్ణ విశ్వాసం ఏర్పడి ఉండలేదు. అందుకు కారణం స్థానిక కాంగ్రెసు నాయకుల వైఖరి.

ప్రతి గ్రామంలోను హరిజను లున్నారు. కులాల వారిగా చూస్తే, మొత్తం గ్రామంలో ఉండే అన్ని కులాల్లోను హరిజనులే మెజారిటీ కులం. అయినా - అంటరానితనానికీ, కులతత్వ దౌర్జన్యానికీ, నిర్బంధ దాస్యానికీ, నిరంతర దారిద్ర్యానికీ ఇతర కులాల చేత వాళ్ళు గురిచేయ బడుతూనే ఉన్నారు. దైనందిన జీవితంలో ప్రతి క్షణమూ ప్రత్యక్షంగా ఇంతగా పీడిస్తున్న స్థానిక నాయకులు కాంగ్రెసు తరఫున నాయకులుగా తయారైనపుడు, గాంధీజీ సిద్ధాంతాలను ఒక అక్షరమైనా అమలు

పరచడానికి విముఖులుగా ఉంటున్నప్పుడు, చూస్తూ చూస్తూ ఆ పీడిత ప్రజలు కాంగ్రెసును ఎలా బల పరచగలరు ?

★★★

## 7. జిన్నా - అంబేద్కరు

ఆ ఎన్నికలలో ముస్లిం వోటర్ల వైఖరీ, హరిజన వోటర్ల వైఖరీ ఒకే విధంగా ఉన్నట్లు కనిపించినా రెండు వైఖర్లూ రెండు విరుద్ధ మార్గాలలో ప్రవహించి, ఒకటి దేశ విభజనకు, మరొకటి జాతి సమైక్యతకూ హేతు భూతమైనవి.

మత మూర్ఖత గల ప్రజల బలంతో, అంతకు మించి బ్రిటీష్‌వారి అండ దండలతో జిన్నాగారు తమ పట్టుదల వదలక, దేశాన్ని ముక్కలు చేసి ముస్లిం ప్రజలకు శాశ్వతమైన భయాన్ని, అస్థిరత్వాన్ని తెచ్చిపెట్టాడు, ఆ విధంగా ఆ నాయకత్వం ముస్లింలకు పరాజయ కారణమే అయింది.

సర్వమత సర్వజన సమతా దృష్టి కల ప్రజల బలంతో గాంధీజీ సహకారంతో డాక్టర్ అంబేడ్కర్ గారు తమ పట్టును సడలించుకొని, తదితర నాయకులతో సమాధాన పడి, హరిజనులకు ప్రత్యేక సదుపాయాలను సాధించడం ద్వారా, ఒక్క హరిజనుల సత్వరాభివృద్ధికే గాక, మొత్తం జాతి బహు ముఖాభివృద్ధికే ఎంతగానో దోహద కారులయ్యారు.

ఈ పరిస్థితిని, "దేశం మనదే" అన్న భావాన్ని, జనసంఖ్యలో ఇతర కులాల కంటే హరిజనులదే మెజారిటీ కులమన్న సత్యాన్ని, హరిజనుల అభివృద్ధి కోసం గాంధీజీ చేసిన త్యాగాన్ని, తదితర కులాల అగ్రనాయకులు చేస్తున్న నిస్వార్థ సేవని, ప్రత్యక్షంగా వివరించి నిరూపించడం ద్వారా - హరిజన వోటర్ల సహకారాన్ని ఇతోధికంగా మేము కాంగ్రెసుకు సంపాదించి పెట్టగలిగాం.

హిందూ సమాజంలో అనంతంగా ఉన్న క్లిష్ట సమస్యల్లో హరిజన సమస్య ఒకటి. అంటరానితనం పోతే హరిజన సమస్య పోతుంది. అంటరానితనాన్ని తొలగించటానికి దేశం యావత్తూ కంకణం కట్టుకొంది. మహమ్మదీయుల సమస్య అలాంటిది కాదు.

అందువల్లనే పాకిస్తాన్ ఏర్పడి, జిన్నాగారి నాయకత్వం లోని బండారం బయటపడి, భారత ఉపఖండంలో మిగిలిపోయిన కోట్ల కొలది ముస్లింలకు దైన్యం తప్ప మరేదీ లభించకుండా పోయినప్పుడు గాని మహమ్మదీయులలో అధిక సంఖ్యాకులు కళ్ళు తెరువలేకపోయారు.

అందువల్లనే – అ ఎన్నికల సంరంభంలో జిల్లా లన్నిటి లోనూ పర్యటిస్తున్న డాక్టరు ఖానును పిలిపించి, ఎన్నికల పరిస్థితులను గురించి, ముస్లిం వోటర్ల వైఖరిని గురించి ప్రకాశం పంతులుగారు ప్రశ్నించినప్పుడు కూడా మహమ్మదీయుల వోట్లు కాంగ్రెసుకు రావు అని ఆయన చెప్ప గలిగాడు.

"నీవు ధైర్యంగా సత్యం చెప్పినందుకు సంతోషిస్తున్నాను. ముస్లిం వోట్లు మనకు బాగానే వస్తాయని మన కార్యకర్తలు ఎంతో మంది చెపుతున్నప్పటికీ నేను నమ్మలేదు. కాంగ్రెసు దృక్పథాన్ని, జాతీయ నిర్మాణ కార్యక్రమాన్ని గురించి ముస్లింలలో ఎక్కువగా ప్రచారం జరుగలేదు. జిన్నాగారి మాయలో పడటంలో వాళ్ళ తప్పేమీ లేదు. ఆ మాయ నుంచి వాళ్ళను కాపాడే నిమిత్తం వాళ్లకు దేశకాల పరిస్థితుల్ని, కాంగ్రెసు సిద్ధాంతాల్ని, అది చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించే ప్రయత్నం ఇంతవరకూ మనం ఏం చేశాం ?" అన్నారు ప్రకాశం పంతులుగారు ఆయనతో అప్పుడు.

ప్రకాశంగారి వద్ద డాక్టరు ఖాను మూడు రోజుల పాటు ఉన్నాడు. అది తన జీవితంలో మరపురాని ఘట్టమని ఇప్పటికీ అంటూ ఉంటా డాయన... తళ తళమనే కళ్లని జేబురుమాలుతో ఒత్తు కొంటూ.

"ఓరే ! చొక్కాలు లేవు. రేపు నేను ఢిల్లీ వెళ్ళాలి. రెండు చొక్కాలు కుట్టించు" అని అప్పుడే అక్కడకు వచ్చిన ఒక యువ కాంగ్రెసువాదితో అన్నారు పంతులు గారు. వెంటనే ఆ కాంగ్రెస్ మిత్రుడు సాయంత్రానికే తెస్తానంటూ వెళ్ళిపోయాడు. అక్కడే ఉన్న నన్ను చూచి ఒక కాగితాన్ని అందిస్తూ... "ఓరే ! ఈ టెలిగ్రాం గాంధీజీ గారికి ఇచ్చిరా..." అన్నా రాయన. నేను వెంటనే దాన్ని అందుకొని, కళ్ల కద్దుకొని పోష్టాఫీసుకు పరుగెత్తాను.

"హై కోర్టు న్యాయవాదుల్లో అంతవాడు లేడనిపించుకొని, లక్షలార్జించి

తమ సమస్తాన్ని దేశమాత పాద పద్మాలకు సమర్పించి, శిబి, దధీచుల వంటి మహాత్ములను మించిన త్యాగాలు చేసి, దేశదాస్య విమోచన సమరమధ్యంలో సతమతమై పోతున్న ఈ మహానాయకుడికి, ఈ మాత్రం సేవైనా చేసే భాగ్యం నాకు లభించింది కదా అని, ఆ రోజున ఎంత ఆనందంతో నేను తలమున్కలైపోయానో ఈ నాటికీ జ్ఞాపకం ఉంది" అంటాడు డాక్టరు ఖాను ఆ ప్రస్తావన వచ్చినప్పుడల్లా.

ఆనాటి నుంచీ చివరి వరకు కూడా, పంతులుగారు డాక్టరు ఖాను పట్ల వాత్సల్య పరినిష్ఠులుగానే ఉన్నారు.

ఆ ఎన్నికల సందర్భంలోనే ఒక మూడు రోజుల పాటు డాక్టరు ఖానుతో ఉండి, ఆయన ఏర్పాటు చేసిన ముస్లిం సభలలో పాల్గొని, ఆంధ్ర కేసరి తమ అగ్ర నాయకత్వాన్ని బహుముఖం చేసుకొన్నారు.

★★★

## 8. ముస్లింలు - వక్ఫ్ సంస్థలు

ఎన్నికలలో కాంగ్రెసు గెలిచింది.

ప్రకాశం పంతులుగారి నాయకత్వం క్రింద మద్రాసులో కాంగ్రెసు మంత్రి వర్గం ఏర్పడింది. అవన్నీ చరిత్ర ప్రసిద్ధమైన విషయాలే. అందరికీ తెలిసిన విషయాలే.

1947 ఆగష్టు 15తో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం లభించింది. అంత త్వరగా స్వాతంత్ర్యం వస్తుందని ఎవరూ ఊహించక పోవడం వల్ల, చివరకు కాంగ్రెసు నాయకులు కూడా అనుకోకపోవడం వల్ల, దాని వల్ల ఏర్పడే కష్టసుఖాలను ఎదుర్కొనడానికి దేశం సర్వసన్నద్ధంగా ఉండలేదు. స్వాతంత్ర్య సంతోషంతో పాటు దేశవిభజన దుఃఖం ప్రజల్ని అల్లకల్లోల పరిచింది.

పాకిస్తాన్ వల్ల భారతీయ ముస్లింలకు లాభం కలుగకపోగా అది ఎంతో నష్టాన్ని తెచ్చిపెట్టింది. అందువల్ల బెజవాడలో ఉన్న ముస్లింలీగర్లు ఆనాడు డాక్టరు ఖాను పట్ల ప్రదర్శించిన దౌర్జన్య వైఖరికి పశ్చాత్తాప పడసాగారు. వారికి ఆయన

పట్ల స్నేహసంబంధాలు అంతగా తిరిగి ఏర్పడక పోయినా, విరోధభావం మాత్రం చాలా వరకు తొలగిపోయింది. అంతటితో ఆయన బెజవాడలో ఉన్న తన ఆస్పత్రిని మళ్ళీ తెరవసాగాడు.

అభ్యుదయ భావాలు కల ముస్లిం యువకులలో ఎప్పుడైతే జిన్నా వ్యామోహం, కమ్యూనిస్టుల గారడీ ప్రభావం తొలగిపోవటం ప్రారంభమైందో డాక్టరు ఖాను జాతీయ నాయకత్వంపైని వారికి విశ్వాసం కుదరసాగింది. అప్పుడే ఆయన దేశంలోని జాతీయ ముస్లిం శక్తులను సమీకరించి, ఒక జాతీయ ముస్లిం రాజకీయ సంస్థను ఏర్పాటు చేయ గలిగాడు. జాతీయ ముస్లిం నాయకుడుగా సుస్థిరకీర్తిని పొందగలిగాడు. ఆయన నాయకత్వం క్రింద జాతీయ ముస్లిం మహాసభ ఆ తర్వాత సాధించిన విజయాలు అద్వితీయ మైనట్టివి.

హిందూ ముస్లిం సమైక్యతకు, హరిజనోద్ధరణకు, కార్మికాభ్యుదయానికి, సహకారోద్యమ వికాసానికి, గాంధీజీ నిర్మాణ కార్యక్రమం లోని వివిధ ప్రణాళికల నిర్వహణకు, వక్ఫ్‌సంస్థ పునరుజ్జీవనానికి డాక్టరు ఖాను ఎంతో కృషి చేశాడు.

హిందూ ధర్మాదాయ దేవాదాయ సంస్థ వంటిదే, ముస్లిం ధర్మాదాయ దేవా దాయాలకు చెందిన వక్ఫ్‌సంస్థ. ముస్లిం ప్రజల సాంఘిక, మత, వైజ్ఞానిక పురోభి వృద్ధికి వినియోగించడం కోసం ఏర్పాటైన నిధులే ముస్లిం దేవాదాయ ధర్మాదాయ నిధులు. ఉదారులైన ముస్లిం ధనవంతులు బహూకరించిన ఆస్తులతోనూ, కేటాయిం చిన ధనంతోనూ ఈ నిధులు ఏర్పడ్డాయి.

ఈ నిధులన్నీ సక్రమంగా ఉపయోగించడం కోసం నియమింపబడ్డ ధర్మకర్తలు వాటిని తరచు దుర్వినియోగం చేస్తూ ఉండడం వల్ల వాటిపై ప్రభుత్వం వారి అజమాయిషీ అవసరమైంది. అట్టి అజమాయిషీ కోసం ఉద్దేశించబడినట్టిదే వక్ఫ్‌బోర్డు.

"ముస్లిం ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం ఆయా దాతలు చేసిన దాన ధర్మాలివి. ఏ మహదాశయంతో ఈ ధర్మనిధులు సమకూర్చబడ్డాయో అట్టి మహదాశయాన్ని అర్థం చేసుకోలేని స్వార్థపరులు ఆ నిధులకు ధర్మకర్తలై, ఆశయాలను

మంట కలిపి, ఆత్మ ప్రాగల్భ్యానికి వాటిని వాడుకో సాగారు. పేద ముస్లింల ఆలనా పాలనా కూడా జరగలేదు. ఆ అన్యాయాన్ని, అధర్మాన్ని, అదైవిక విధానాన్ని భరించ లేని ముస్లిం ప్రజలు ఆందోళన జరిపి, ప్రభుత్వ దృష్టిని ఇటు మళ్ళించగలిగారు. తత్ ఫలితంగానే అప్పటికి తొలిసారిగా అధికారంలోకి వచ్చి ఉన్న కాంగ్రెసు ప్రభుత్వం 1938 వక్ఫ్ బిల్లును ప్రతిపాదించింది. ఆ తర్వాత 1954లో పార్లమెంటుచే ఆమోదించబడి యావత్ భారతానికి అది చట్టమైంది" అన్నాడు డాక్టరు ఖాను ఈ విషయంలో మాటాడుతూ.

1938లో ముస్లిం దేవాదాయ ధర్మాదాయ ఆస్తులను, అనగా ముస్లిం వక్ఫ్‌లను తన అజమాయిషీ కిందకు తెచ్చుకోవడానికి మద్రాసు ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించడం దగ్గర నుంచీ - 1954లో కేంద్ర ప్రభుత్వం యావత్ దేశానికి వర్తించే చట్టాన్ని నిర్మించడం వరకు - జరిగిన నిరంతర కృషిలో డాక్టరు ఖాను నిర్వహించిన పాత్ర అతిప్రధాన మైనట్టిది. ఆంధ్ర కాంగ్రెసు సభ్యుడుగా ఉంటూ, జాతీయ ముస్లిం నాయకుడుగా ఉంటూ, ఇటు ప్రభుత్వంలోనూ, అటు ముస్లిం లోను కూడా అత్యధికమైన పలుకుబడి కలిగి ఉన్నందు వల్ల, తోటి ప్రధాన నాయకుల సహకారంతో ముస్లిం వక్ఫ్‌లకు సుస్థిరమైన ఒక వ్యవస్థను సాధించి పెట్టగలిగాడు ఆయన.

ఈ విషయంలో డాక్టరు ఖాను చేసిన కృషి ఎంతో నిర్మాణాత్మకమైనట్టిది. దేశం యావత్తూ తిరిగి, ముఖ్యంగా ఆంధ్రదేశం నలుమూలలా పర్యటించి వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన వివరా లన్నిటినీ సేకరించా డాయన. ఆయన సేకరించిన వివరాలతో ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించాడు.

ఆయన సేకరించిన వివరాలను బట్టి ఆంధ్ర ప్రాంతంలో 3,483 ముస్లిం వక్ఫ్ సంస్థలు ఉన్నాయి. అందులో 1,350 మసీదులు, 1,535 పీర్ల పంజాలు, 330 దర్గాలు, 142 ఈద్‌గాలు, 43 ధర్మశాలలు, 12 పవిత్ర స్థలాలు, 69 మర్త్రాతులు, ఘద్మతులు. వీటికి 66,200 ఎకరాల సేద్యయోగ్యమైన భూములు ఉన్నాయి. సుమారు నాల్గువేల బిల్డింగులు ఉన్నాయి. ఈ ఆస్తుల విలువ మొత్తం మీద నాలుగున్నర కోట్ల రూపాయలు. ఈ ఆస్తులపై సాలీనా వచ్చే నికరాదాయం పది లక్షల రూపాయలు అప్పటిలో.

ఇంత ఆస్తీ, ఇంత ఆదాయం ఉన్న ముస్లిం వక్ఫులు, అప్పటికి ఎంత అస్తవ్యస్తంగా, అక్రమంగా, అదుపూ ఆజ్ఞా లేకుండా నిర్వహించ బడుతున్నాయో డాక్టరు ఖాను ప్రభుత్వానికి వివరించి చెప్పాడు. 1954 చట్టం క్రింద తెలంగాణాలో ఏర్పడిన వక్ఫుబోర్డు కూడా, ప్రజలతో సంబంధం లేని పెద్దల చేతుల్లో పడి, ఎలా నిరర్థకమై పోయిందో వివరించి.. తెలంగాణా వక్ఫుబోర్డును రద్దు చెయ్యాలనీ, మొత్తం ఆంధ్ర ప్రదేశ్ అంతకూ ఒకే ఒక బోర్డును ప్రజాసేవా పరాయణులైన జాతీయ ముస్లిం పెద్దలతో పునర్నిర్మించాలనీ ఆయన ప్రభుత్వాన్ని కోరాడు.

అప్పటికి ముఖ్యమంత్రిగా ఉన్న దామోదరం సంజీవయ్యగారు, దేవాదాయ మంత్రిగా ఉన్న అనగాని భగవంతరావుగారు, డాక్టరు ఖానుగారి కృషిని, పట్టుదలను ఎంతగానో ప్రశంసించారు. ఆనాటి పత్రికలు, ప్రజలు, డాక్టరు ఖానుగారి ప్రజాసేవా దీక్షా పరాయణతను బహు విధాల కీర్తించినాయి.

"తెలంగాణలోని ముస్లిం దేవాదాయ ధర్మాదాయాలకు ఒక బోర్డు పనిచేసిన మాట నిజమే. కాని ఈ బోర్డులో జాగీర్దారులను, నవాబులను సభ్యులుగా నియమించడం వల్ల సామాన్య ప్రజానీకానికి ఎట్టి మేలూ జరగ లేదు. ఆ బోర్డు సభ్యులకు దేశాభిమానం గానీ, సాంఘిక సేవా భావం కానీ లేనందువల్ల అవి సక్రమంగా పనిచెయ్యలేదనీ, తోటి ముస్లింలకు వాటి వల్ల ఎట్టి ప్రయోజనమూ సిద్ధించలేదనీ," ఆ బోర్డు కార్యకలాపాలపై విచారణ జరిపిన ఒక అధికారి పేర్కొన్నారు...

వక్ఫుబోర్డులు, ముస్లిం దేవాదాయ సంస్థలను సుసంఘటితం చేయడమే కాకుండా, వాటి ఆదాయంతో ముస్లిం ప్రజలకు ఎంతైనా ఉపకారం చెయ్యవచ్చు...

నిరుద్యోగులైన ముస్లిం సోదరులను ఆదుకోవచ్చు. చిన్న చిన్న పరిశ్రమలను స్థాపించడం, వితంతువులకు సహాయపడటం, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం మున్నగు చర్యల ద్వారా పేద ముస్లింల సముద్ధరణకు ఈ మతాదాయ సంస్థల ఆదాయాన్ని వినియోగించటం ధర్మం. అయితే ఈ వక్ఫుబోర్డు సభ్యులుగా ప్రజాబాహుళ్యంతో సంబంధం లేని నవాబులనూ, జాగీర్దారులనూ, బ్రిటిష్ వారికి తొత్తులుగా పనిచేసిన వారినీ నియమిస్తే దానివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర వహించిన సాంఘికసేవా పరాయణులనూ,

ప్రజానీకంలో పలుకుబడి కలవారినీ, ఈ వక్ఫ్ సంస్థల వ్యవహారాలలో ఆది నుంచి శ్రద్ధ వహించి పనిచేసిన వారినీ సభ్యులుగా నియమిస్తేనే ఈ బోర్డు తన ఉనికిని సార్థకపరుచుకో కలదు" అంటూ తెలుగు దిన పత్రిక ఆంధ్ర జనత తమ సంపాదకీయంలో ఉద్ఘాటించింది.

డాక్టరు ఖాను కృషి ఫలించి, మొత్తం ఆంధ్రప్రదేశ్ అంతకూ ఒకే ఒక వక్ఫ్ బోర్డును ఏర్పాటు చెయ్యడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది 1961లో.

ఆ తర్వాత కొద్ది నెలలకే ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు నిర్మాణం జరిగింది. జిల్లా వక్ఫ్ కమిటీల నియామకం కూడా జరిగింది. అందులో ఎక్కడా డాక్టరు ఖాను పేరు లేదు. సరికదా, ఆయన ప్రస్తావన కూడా లేదు !

ఈ వైపరీత్యానికి ఎంతో మంది ప్రజలు ముక్కుపై వేలు వేసుకున్నా - సంపూర్ణ స్వాతంత్ర్య మహోద్యమం నుంచి మంత్రి పదవుల స్వీకరణ వరకూ దేశకాల రాజకీయ పరిణామ పరిస్థితిని అవలోకిస్తున్న వారికి మాత్రం అందులో వింతేమీ కనిపించలేదు.

రాష్ట్ర బోర్డుకే అధ్యక్షుడు అవుతా డనుకొంటున్న డాక్టరు ఖాను సభ్యుడు కూడా కాకపోవటంతో, ఆశావాదులైన ఎంతో మంది మిత్రులు నిరాశావాదులై పోయారు. డాక్టరు ఖాను మాత్రం తన కృషి ఫలించినందుకు ఎంతో సంబరపడ్డాడు. ఆనాడు మిత్రు లందరికీ విందు కూడ చేశాడు. ఈ వక్ఫ్‌బోర్డు నిర్మాణ వార్తను, జిల్లా కమిటీల సభ్యుల పేర్లతో సహా, తన 'ఆజాద్' పత్రికలో ప్రముఖంగా ప్రకటించాడు.

★★★

## 9. బొండాడలంక వ్యవహారం

ఒక ప్రక్క మత విషయంలో ముస్లిం ధర్మాదాయ సంస్థల పునర్నిర్మాణానికి కృషి చేస్తూనే, మరో ప్రక్క గాంధీజీ ఇచ్చిన నిర్మాణ కార్యక్రమ ప్రణాళికలతో సతమత మవుతూనే, సహకార విధానం ద్వారా వ్యవసాయ కూలీలను సంఘటితపరచి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని, స్వయం సేవా పరాయణత్వాన్ని, సంఘబల ప్రాధాన్యాన్నీ

ఉద్బోధించాలనీ, కార్యరూపంలో ఆచరించి చూపాలనీ ఒక నిర్ణయానికి వచ్చి - బొండాడ లంకలో 1946లోనే ఒక ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించాడు డాక్టరు ఖాను.

ప్రభుత్వ బంజరు భూముల్ని వ్యవసాయ కూలీలకూ, పేద రైతులకూ ఇప్పించడం, సాముదాయక వ్యవసాయ పద్ధతి ద్వారా ఆ భూముల్ని పండించడం, ఫలితాన్ని అందరూ సమానంగా అనుభవించడం, వ్యవసాయానికి కావలసిన పెట్టుబడి, పరికరాలు మొదలైన వన్నిటినీ సహకార పద్ధతిలో సేకరించడం... ఇవి ఈ సొసైటీ స్థాపనలో గల ముఖ్య లక్ష్యాలు.

తాను స్వయంగా ఈ సొసైటీని నడిపి, వ్యవసాయ కూలీలలోనూ పేద రైతులలోనూ సాముదాయక సహకార వ్యవసాయోద్యమాన్ని ఆదర్శప్రాయంగా అమలు జరిపి చూపించాలనే డాక్టరు ఖాను ఉద్దేశం. అందుకే ఆ సొసైటీకి తానే అధ్యక్షుడైనాడు.

తన లక్ష్యానికి అనుగుణంగా బైలాస్ వగైరాలు రూపొందించి, ఆ సొసైటీ సెక్రటరీతో కలిసి మద్రాసు వెళ్ళి రిజిష్టరు కూడా చేయించుకొచ్చా డాయన. ఎంతో మంది వ్యవసాయ కూలీలను, రైతులను సభ్యులుగా చేర్చాడు. అలా నాలుగు వందల మంది సభ్యులు చేరా రందులో.

అధికాహారోత్పత్తికి ప్రభుత్వం ఎంతో సహాయం చేస్తున్న రోజులవి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలో, బొండాడ లంకలో 1,945 ఎకరాల ఏకఖండిక భూమిని ఆ సొసైటీకి సంపాదించాడు. సంఘ సభ్యుల నుంచి సుమారు ఇరవై ఐదువేల రూపాయలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని కృష్ణా కోఆపరేటివ్ బ్యాంకులో డిపాజిట్ చేయించాడు.

భూమి యొక్క కొలతలు, మేపులు అన్నీ తయారైనాయి. జిల్లా కలెక్టరును, సహకార సంఘాల రిజిస్ట్రారును కలుసుకోవడం, సలహాలు పొందడం వంటి వన్నీ చురుకుగా సాగదొడగినాయి. సొసైటీ యొక్క వర్కింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాలలో నిర్మాణాత్మకమైన, ఉత్తేజ కరమైన ఎన్నో చర్చలు సాగేవి. భవిష్యత్ కార్యక్రమాలు, వాటివల్ల కలిగే సంపదైశ్వభవాలు గురించి ఖాను వర్ణిస్తూ ఉంటే సభ్యులెంతో ఉత్సాహ భరితు లయ్యేవారు.

అట్టి పరిస్థితిలో, కొందరిలో అసూయా పిశాచం తలెత్తింది. వ్యతిరేక ప్రచారాలు ప్రారంభమైనాయి. ఖానుకు మతిపోయిందని, ఈ పనంతా సాగేదేనా అని, ప్రజల డబ్బు తినెయ్యడానికే ఈ ఎత్తు ఎత్తాడని – సభ్యులలో రహస్య ప్రచారం కొనసాగింది.

సహకార వ్యవసాయోద్యమం ద్వారా కూలీలూ, పేదరైతులూ బాగుపడితే, స్వతంత్రులైతే, తమ కాళ్ళపై తాము నిలబడగల స్థితి ఏర్పడితే – ఇక తమ ఆటలు సాగ వనుకొన్న భూస్వాములు – కూలీలలోనూ, రైతులలోనూ డాక్టరు ఖానువంటి కాంగ్రెసువాదులు పలుకుబడి సంపాదించుకుంటే తమ పార్టీ ప్రాబల్యానికి అధికారం పోతుందనుకొన్న కమ్యునిస్టులు కూడా – సొసైటి సభ్యులలో ఖాను పట్ల వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టారు.

"గాంధీజీకి నిజమైన అనుచరుడవు నీ వొక్కడవేనయ్యా –" అని ఎదర మెచ్చుకొనేవాళ్ళు సైతం వెనుక గోతులు తవ్వేవారే అయినారు.

ఈ పరిస్థితికి ఖాను చాలా బాధపడ్డాడు. రెండు చేతులా ఆర్జించుకునే వైద్య వృత్తి ఉన్నవాడు. మొదటి నుంచీ ఇతరులకు ఇంత పెట్టడమే గాని, ఇతరులది రవ్వంతైనా తినడం చేతకానివాడు. ఇచ్చే కుటుంబం నుంచి వచ్చినవాడు. పుచ్చుకోవడం ఎరగనివాడు. అటువంటి వాడు ఎటువంటి దుష్ప్రచారాన్నయినా ఎలా సహించగలడు ?

గొర్రె గొర్రెల వాడిని నమ్మదన్నట్లు – ప్రజాభ్యుదయాన్ని కోరే నిజమైన నాయకుణ్ణి ప్రజలు నమ్మరు.

అందుకే డాక్టరు ఖాను ఆ సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా పెట్టాడు.

సభ్యుల నుంచి వసూలైన డబ్బు పైసలతో సహా బ్యాంకులో ఉంది. చట్టరీత్యా సొసైటీకి చేయవలసిన ఖర్చులు కూడా తన స్వంత డబ్బు నుంచే పెట్టాడు. సొసైటీ డబ్బును వాడనే లేదు. సొసైటీ రిజిస్ట్రేషన్ కోసం వెళ్ళినప్పుడు కూడా తన ఖర్చంతా తానే పెట్టుకొన్నాడు. స్టేషనరీ కూడా తన డబ్బుతోనే కొన్నాడు. ఎందుకూ, ఎప్పుడూ సొసైటీ డబ్బును ఒక్క పైసా కూడా వాడలేదు. ఈ విషయాలన్నీ సభ్యులకు చెప్పి, తన వద్ద కల రికార్డులను, బ్యాంకు పుస్తకాల్ని అప్పగించేసి చేతులు కడుక్కొన్నాడు.

బ్యాంకులో 25 వేల రూపాయలు, చేతిలో 1,945 ఎకరాల లంక భూమి. ఎవరు వదలుకొంటారు – నిస్వార్థసేవా పరతంత్రుడైన డాక్టరు ఖాను వంటివారు తప్ప ?

డాక్టరు ఖాను రాజీనామాను ప్రేరేపించిన మరొక సంఘటన ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రి పదవి నుండి దింపివేయబడడం.

అప్పటి మద్రాసు ప్రభుత్వంలో వేముల కూర్మయ్యగారు హరిజన సంక్షేమ మంత్రిగా ఉండి – అనేకమైన చట్టాలూ, శాసనాలు చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ, హరిజనాభివృద్ధికీ, వెనుకబడిన తరగతుల అభ్యుదయానికీ ఎంతో కృషి చేస్తున్న రోజులవి. బొండాడ లంక సొసైటీలో ఎక్కువమంది సభ్యులు హరిజనులే. తాను సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చినప్పటికీ, సొసైటీ అభివృద్ధే తన ధ్యేయం కనుక – మద్రాసు వెళ్ళి మంత్రి కూర్మయ్యగారిని కలుసుకొంటే సొసైటీకి ఎంతో ఉపకారం జరుగుతుందని ఆయన తన తర్వాత వచ్చిన కార్యకర్తలకు సలహా ఇచ్చాడు. అయితే, ఆయన సలహా దుర్వినియోగమే అయింది.

అంత నిస్వార్థంగా, కేవలం ప్రజాసేవా భావంతో సొంత వృత్తిని కూడ అలక్ష్యం చేసి, సొంత డబ్బును సొసైటీ కోసం ఖర్చుపెడితే – అందుకు ఫలితంగా డాక్టరు ఖానుకు లభించిం దేమిటి ? దుర్వినియోగపు కేసు !

బొండాడ లంక సొసైటీ డబ్బును డాక్టరు ఖాను తినేశాడంటూ ఆయనపై ఒక కేసు పెట్టబడింది. ఆయనపై దుష్ప్రచారం చేసినవారే, ఆ తర్వాత సొసైటీని తమ చేతుల్లోనికి తీసుకొని, దుర్వినియోగం చేసో, చేయదలచో – ఆ నేరాన్ని డాక్టరు ఖాను పైకి త్రోసివెయ్యడానికి ప్రయత్నించారు. మంచికి పోతే చెడ్డ ఎదురు వచ్చింది.

ప్రజలకు సంబంధించిన ప్రతి పనీ అంతే. రాజకీయాలు, సాంఘిక సేవ వంటి ప్రజా సంబంధ కార్యరంగాలలో అంతవరకూ దైవంగా ఉన్న నాయకుడే, అంతలో దెయ్యంగా మారిపోతూ ఉంటాడు ప్రజల దృష్టిలో. అందుకు స్పష్టమైన కారణాలు ఉండవు. ఎవడో ఒక అసూయాపరుడైన వ్యక్తి ప్రజలను నడిపిస్తూ ఉంటాడు వెనుక ఉండి. ప్రజలు మాత్రం ఏం చెయ్యగలరు ? అదిగో పులి అంటే ఇదిగో తోక. అంతే మానవ స్వభావం !

ఆ కేసు డాక్టరు ఖానును బాగా కృంగ దీసింది. ఎంత అన్యాయం ? భగవంతుడనే వాడు లేడా ? పుణ్యానికి పోతే పాపం ఎదురైందే ! గాఢమైన మనో వ్యథతో బాధపడ్డా డాయన. వృత్తిని ఇంకా అలక్ష్యం చేశాడు. చేతిలో ఉన్న డబ్బు కాస్తా అయిపోయింది. తన కేసుకు ప్లీడరును కూడా పెట్టుకోలేదు. ఆయన లేకుండానే కేసు విచారణ జరిగింది. న్యాయం కలిగించమని భగవంతుడ్ని ప్రార్థించటం తప్ప మరేమీ చేయలే దాయన. సాక్షులను కూడా పెట్టుకోలేదు.

1949లో కేసు విచారణ ముగిసింది. తీర్పు చెప్పబడింది. న్యాయం గెలిచింది. ఆయనపై చేయబడ్డ ఆరోపణ లన్నీ నిరాధారాలని కొట్టివేయబడ్డాయి. ఆయన తన సొంత డబ్బుతో సొసైటీకి చేసిన సేవను న్యాయస్థానం గుర్తించి కీర్తించింది. దైవం ఉన్నా డనుకొన్నా డాయన.

ఈ బొండాడలంక ఉదంతం మానవ నైజం లోని రెండు సత్యాలను కన్నులకు కట్టిస్తుంది.

కాంగ్రెసు లక్ష్యమైన సోషలిస్టు సమాజ నిర్మాణం, ఫీల్డు లేబరు కోఆపరేటివ్ సొసైటీల పద్ధతిలో, బీజప్రాయంగా ఉంది. అయితే, దాన్ని అమలు పరచడానికి ఎవరూ పూనుకోరు. పూనుకొనే నిజాయితీ పరుల్ని నిరుత్సాహ పరుస్తారు.

రెండో దేమిటంటే – రాజకీయ పార్టీలు సామాన్య ప్రజలను ఉద్ధరించవు.

ఏ రాజకీయ పార్టీ లక్ష్యమైనా ఒక్కటే – అధికారంలోకి రావడం. అధికారం లోకి వచ్చేవరకు ప్రజల్ని ఉపయోగించుకొని, ఆ తర్వాత ఎక్కడి ప్రజల్ని అక్కడే అణచి ఉంచటానికి అన్ని విధాల ప్రయత్నిస్తుంది అది.

★★★

## 10. ఇదా స్వరాజ్యం ?

ఆ విధంగా రకరకాల సమస్యలతో సతమతమౌతూనే, ఆంధ్రరాష్ట్ర నిర్మాణం గురించి కూడా ఆలోచించడం సాగించాడు డాక్టరు ఖాను.

బ్రిటిష్ సామ్రాజ్య వాదులతో ఎంతో కాలం పోరాడి, ఎన్నో త్యాగాలు చేసిన మీదట స్వరాజ్యం వచ్చింది మనకు. అయితే, స్వరాజ్యంతో పాటు మనకు

వస్తుందను కొన్న రామరాజ్యం రాలేదు. పైగా స్వరాజ్యం లభించిన తర్వాత దేశంలో స్వార్థ పరత్వం, లంచగొండితనం, అధికార వ్యామోహం, పదవీ గర్వం వగైరా శ్రుతిమించి పెరిగి పోతున్నట్టుగా కనిపించ సాగినాయి.

త్యాగాలు చేసిన వాళ్ళకు, జాతీయ పోరాటంలో సమస్తమూ పోగొట్టుకొన్న వాళ్ళకు, ఏ పదవులను ఆశించక ప్రజలలోనే సేవ చేస్తూ ఉండిపోయిన ఉత్తమ దేశభక్తులకు రాజకీయ రంగంలో స్థానం లేకుండా పోయింది. డబ్బున్న వాళ్ళు, నోరున్న వాళ్ళు, అగ్రశేణుల్లోకి చేరుకొని, అధికార పదవుల్ని అందినంత వరకూ ఆక్రమించుకో సాగారు. గాంధీజీ చెప్పిన మంచితనానికి, నిస్వార్థసేవకు, శక్తి సామర్థ్యాలకు, దేశభక్తికి పరిగణ లేకుండా పోయింది.

స్వరాజ్యం వచ్చిన ఇంత అచిర కాలం లోనే దాన్ని తమ చేతుల్లోకి తీసుకొన్న నాయకుల దృక్పథం, మనస్తత్వం ఇంతగా మారిపోతే ఇక భవిష్యత్తు ఎలా ఉంటుందో అని ఆందోళన పడసాగింది దేశం.

డాక్టరు ఖానును మరీ కల్లోల పరచినట్టిది ప్రత్యేక రాష్ట్ర సమస్య. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆంధ్ర నాయకులంతా ఒక త్రాటిపై నిలిచి, చిరకాలం నుంచీ పోరాడుతూ ఉన్నారు. 1912 నుంచి కూడా ఈ పోరాటం సాగుతూనే ఉంది. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చెయ్యాలన్న విధానాన్ని జాతీయ కాంగ్రెసు మహాసంస్థ ఆమోదించి ఉంది. 1947 ఆగష్టులో దేశ పరిపాలనాధికారం కాంగ్రెసు చేతుల్లోకి వచ్చిన తర్వాత కూడా రాష్ట్ర వ్యవస్థను భాషా ప్రయుక్తంగా పునర్ని నిర్మాణం చెయ్యాలన్న ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.

అందులోనూ, మద్రాసు రాష్ట్రంతో ఉమ్మడి కాపురం చెయ్యడం ఆంధ్రులకు మరీ బాధగా ఉంది. ఉమ్మడి భాషా రాష్ట్రాలలో తెలుగు భాషకు, తెలుగు నేలకు జరిగినంత అన్యాయం దేశంలో మరెవ్వరికీ జరగలేదు.

దేశంలోని తదితర ఏ భాషల వారికీ లేనన్ని బాధలు తెలుగు వారు అను భవిస్తున్నా, తెలుగు నేలకు మాత్రం ప్రత్యేక రాష్ట్ర మహద్భాగ్యం లభించలేదు.

అట్టిది లభించే సూచన కూడా అప్పటికి కన్పించలేదు. ఈ విషయమై మనస్సును పాడుచేసుకొంటున్న భాషా రాష్ట్ర వాదుల్లో, డాక్టరు ఖాను ఒకడు.

అది అలా వుండగా, ఆ వచ్చిన స్వరాజ్యమైనా సుఖప్రదంగా రాలేదు.

బ్రిటిష్ పాలకులు పోతూ పోతూ దేశాన్ని రెండు ముక్కలు చేసి ఒకటి హిందువులకు, ఒకటి ముస్లింలకు ఇచ్చి పోయారు. దానితో నౌకాళీ దురాంతాల వంటి మతోన్మాద జాతీయ వ్యతిరేక శక్తులు గొలుసులు త్రెంచుకొని దేశం మీదకు దూకినవి. హిందూ ముస్లిం అమాయక ప్రజల రక్తంతో భారతభూమి కురుక్షేత్రమే అయింది. అంతవరకూ అన్నదమ్ములై ఇరుగు పొరుగున బ్రతుకుతున్న హిందువులూ, ముస్లింలూ అంతటితో ఒకరి కొకరు విదేశీయులై, ప్రాణశత్రువులై ఒకరి పీకలు ఒకరు నరుక్కో సాగారు.

అప్పటి స్థితి పాకిస్తాన్‌లోని హిందువులకు సద్యః ప్రాణాంతకం కాగా, భారత దేశంలోని ముస్లింలకు దినదిన గండంగా పరిణమించింది. భారతమాత రెండు భుజాలపై రెండు కుంపట్లులా పాకిస్తాన్ రెండు భాగాలు రగలడం మొదలు పెట్టినవి.

స్వరాజ్య ప్రదాత, జాతిపిత, యుగపురుషుడు, హరిజనోద్ధారకుడు అయిన గాంధీజీ ఘోరంగా హత్య చేయ బడటంతో దేశంలో పాశవిక శక్తుల విలయతాండవం పరాకాష్టకు చేరుకొంది.

"ఏమిటి భగవాన్ ! స్వరాజ్యం వచ్చిన తర్వాత దేశం ఇలా తయారైంది ? చేసిన పోరాటం, అహింసతో కూడుకొన్నట్టిదైనా, చివరకు ఏ యుద్ధంలోనూ చావ నంత మంది హిందూ ముస్లిం ప్రజలు చావటం తప్పలేదు. రక్తం కాలువలుగా ప్రవహించింది. లక్షల మంది నిలువ నీడ లేని పక్షులయ్యారు. ఆకలి బాధ హెచ్చింది. ఆహార ధరలు ఆకాశానికి పెరిగినవి. పేదలు మరీ పేద లవుతున్నారు. ఎక్కడా శాంతిలేదు. ధనికులు మరీ ధనికులవుతున్నారు. రైతుల్లో, కూలీలలో, ఉద్యోగులలో విద్యార్థులలో ఎక్కడ చూచినా ఆకలి, అసంతృప్తి, అశాంతి, నిరుద్యోగం, సమ్మెలు ! ఏమిటిదంతా ?" అంటూ వాపోయాడు డాక్టరు ఖాను. మనస్సు మరీ అల్లకల్లోలమై మతి పోగొట్టుకున్నా డాయన.

అలాంటి పరిస్థితిలో ఆయన ఇల్లు విడిచి, అడవి దారులు పట్టాడు. జాతీయ అంతర్జాతీయ సమస్యలతో ఆయన మస్తిష్కం ఒక తేనె పట్టులా తయారైంది.

ప్రపంచ మంతా భగవంతుని సృష్టే కదా? మానవు లంతా ఆయన సంతానమే కదా ? ఏ మతం బోధించినా మానవ సౌభాతృత్వాన్నే కదా ? మరి... ఈ మత కలహాలూ, జాతి ద్వేషాలూ, దేశ వైరాలూ, అసూయలూ, ఈర్ష్యలూ, ఉద్రేకాలూ, పోరాటాలూ, హత్యలూ, రక్తపాతాలూ ఇవన్నీ ఏమిటి ? ఎందుకు ?

రోజుకు మూడు పూటలా తిండి కోసమేనా... మానవుడు ఇంత ఘోరానికి పాలుపడుతున్నది ?

కొత్తగా ఆటంబాంబులు వచ్చాయి. విజ్ఞాన శాస్త్రం పెరిగే కొలది మారణా యుధాల హత్యాశక్తి విపరీతంగా పెరిగి పోతున్నది. మూడవ ప్రపంచ యుద్ధమే వస్తే అది ఆటంబాంబులతోనే ప్రారంభం అవుతుంది. రెండు మూడు రోజుల్లోనే మొత్తం మానవజాతే తుడిచిపెట్టుకు పోగలదు అప్పు డింకేం మిగులుతుంది ? అంతా బూడిద !

కులం, మతం, జాతి, స్వార్థాలు, అధికారాలు, అహంకారాలు సమస్తమూ వట్టి బూడిద.

ఎవళ్లూ ఆలోచించటం లేదు. ఎవరి మట్టుకు వారు తమ స్వార్థాల చుట్టూ పేక మేడలు నిర్మించుకొంటూ బయటి ప్రపంచాన్ని చూడలేక పోతున్నారు. ఒకడు విపరీతంగా ధనవంతుడై భోగభాగ్యాలు అనుభవిస్తూ ఉంటే, ఆ ప్రక్కనే మరొకడు తిండికి, గుడ్డకు మాడి చస్తున్నాడు. అలా ఎందుకు జరగాలి ? అందరూ భగవంతుని సంతానమే కదా ? అలాంటి అసమత్వాలు, అన్యాయాలు ఇచ్చే ఫలితాలు చివరకు ఎంత ఘోరంగా ఉంటాయో ! ఎవళ్ళూ ఆలోచించటం లేదు.

వాస్తవాలు పోరుగుర్రాల్లా దౌడు తీస్తూ ఉంటే, నాయకులు కళ్ళు మూసుకొని నిద్రపోతున్నారు. ప్రజలు దిక్కుతోచక కాళ్ళు త్రొక్కుకొంటున్నారు. ఎప్పుడు కలుగుతుందో లోకానికి వివేకం ? ఎలా కలుగుతుందో మనస్సుకు శాంతి ?

★★★

# 11. కోయప్రజల ఆదర్శం

ఈ విధమైన ఆలోచనలతో డాక్టరు ఖాను ఎటు, ఎక్కడికి అనే విచక్షణ లేకుండా, నడచి పోసాగాడు. గోదావరి అడ్డం వస్తే దాటాడు. లాంచి కనిపిస్తే ఎక్కాడు, అది ఆగిపోతే దిగి పోయాడు, బాగా రాత్రి పడ్డ తర్వాత గాని అదొక కీకారణ్యమన్న సంగతి ఆయనకు గుర్తే రాలేదు.

అది భద్రాచలం ప్రాంతం లోని ఒక దట్టమైన అరణ్యం !

చీకట్లో భయంకరమైన ప్రకృతి తనను చుట్టుముట్టేదాకా ఆయన మనస్సుకు మెలకువ రాలేదు !

మానవ స్వభావమే అంత. అంతరంగికమైన ఆలోచనల, బాధల, బాధ్యతల, ఊహపోహల మధనంతో వ్యాకులపడుతున్న వాడికి హఠాత్తుగా బాహ్యవిపత్తు ఏదో తారసపడితే – అంతరంగిక మనస్తాపాలన్నీ ఒక్క సారిగా ఎరిగిపోతాయి. బాహ్య విపత్తులను ప్రతిఘటించడానికే అతనిలోని సర్వశక్తులూ ఏకముఖంగా సమాయత్త మౌతాయి. అది ప్రకృతి స్వభావం. డాక్టరు ఖాను విషయంలో కూడా అలానే జరిగింది. ఏకాకిగా చీకటిరాత్రి కీకారణ్యంలో ఉన్నట్లు తాను తెలుసుకోగానే అంతవరకు అన్యాయత్తమైన ఆయన మనస్సు ఒక్కసారిగా జాగృతమై కింకర్తవ్యతా భావాభి ముఖమైంది.

మనశ్శాంతి కోసం చాలా కాలం ఆయన ఆ అడవుల్లోనే గడిపాడు. అప్పటి తన అనుభవాలను "స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం" అనే గ్రంథంలో ఆయన ఎంతో హృద్యంగా వర్ణించి ఉన్నాడు. ఆ వర్ణన చదువుతూ ఉంటే మనం కూడా అలాంటి అపూర్వానుభూతిని జీవితంలో ఒక్కసారైనా పొందా లనిపిస్తుంది.

కీకారణ్యాలు, క్రూర మృగాలు, వింత రొదలు, గర్జనలు, పక్షుల కోలాహలం, గాలిచేసే రాగధ్వనులు, కార్చిచ్చులు, కారుమేఘాలు, కొండలు, కొండవాగులు,

నీటిపట్లు, నెమళ్ళు, ఎగులుబంట్లు, కొండచిలువలు, పులులు, పునుగు పిల్లలు, ఉడుతలు, ఉగ్రలోయలు – ఓహో ! ఉద్వేగ ప్రకృతి ! దాని ఒడిలో ఒక మానవుడు ! ఎంతటి మహానుభూతి !

ఆ అరణ్య మధ్యంలో ఉన్న ఒక కోయ గూడెంలో గడిపాడు చాలా కాలం ఆయన. అక్కడి ఆ గిరిజనుల విధానాలను గురించి ఆయన చేసిన వర్ణనలను చదువుతూ ఉంటే, అవన్నీ మనం కళ్ళార చూడా లనిపిస్తుంది.

ఎత్తైన మంచెల మీద వేసిన గుడిసెలు. ప్రతి గుడిసె ముందూ పెద్ద పెద్ద నెగడులు, గూడెం చుట్టూ వంతులవారీ పహరాలు, గెడచువ్వల మెట్లు, గుడిసెల లోపల పాలకర్ర దివ్వెలు, క్రొవ్వు కాగడాలు, ఊచబియ్యం, తేనె, వెలగపళ్ళు, విప్పపువ్వు, అడవి సారా ఎంతటి అహ్లాదకరాలో... వాళ్ళ ఆచారవ్యవహారాలూ, నీతినియమాలూ అంతటి ఉత్తేజకరాలు ! నాగరికుల మనుకొంటున్న మనం ఈ ఆదిమవాసుల నుండి నేర్చుకోవలసింది ఎంతో ఉన్నదంటాడు ఆయన.

అక్కడ తాను గడిపిన రోజుల్లో తాను చూచిన వింతలను, జరిగిన సంఘటనలను, కోయ ప్రజల ప్రేమ వాత్సల్యాలను, వాళ్ళు వేటాడే పద్ధతులను, ఒక వీరజాతిగా వాళ్ళు చూపుతున్న ధైర్యసాహసాలను గురించిన ఎన్నో విషయాలను ఎంతో మనోహరంగా వివరించా డాయన తన గ్రంథంలో.

తాను వైద్యుడు కావడం వల్ల, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పుట్టుక నుంచే జీర్ణించుకొన్నవాడు కావడం వల్ల, ఆ ప్రజల ప్రేమాభిమానాలకు పాత్రుడై తాను పోగొట్టుకున్న శాంతిని తిరిగి పొందగలిగాడు. అప్పుడే ఆంధ్ర రాష్ట్రాన్ని, అది సాధించగల ప్రగతినీ గురించి కలలు కన్నాడు. ఆ కలలనన్నీ తాను ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత గ్రంథస్థం చేసి ప్రకటించాడు.

★★★

# 12. అనుభవజ్ఞుడే ఋషి - మహాకవి

'స్వప్నంలో ఆంధ్ర రాష్ట్రం' అన్న గ్రంథంలో ఒక మహాకవిగా కనిపిస్తాడు డాక్టరు ఖాను.

అత డెంత కార్యవాదో అంత భావుకుడు. మహాకవులు కాతగిన ఋషులంతా కార్యవాదులే అన్నది చరిత్ర సత్యం. కార్యవాది కానివాడు, స్వయంగా సాహస కార్యాలు చేయలేనివాడు, ప్రజల్ని ఎరగనివాడు, పరుల కోసం బాధలు పడనివాడు మహాకవి ఎన్నటికీ కాలేడు.

రమణీయార్థ ప్రతిపాదక మైనట్టిదే కావ్యం అనుకొంటే - డాక్టరు ఖాను ఊహించిన ఆంధ్రరాష్ట్ర స్వరూపం, దాన్ని ఆయన చిత్రించిన విధానం పరమ రమణీయం కనుక, ఆయన ఒక మహాకవే అంటున్నాను. ఆయన నాకు మిత్రుడు కనుక అంటున్న మాట కాదిది. ఒక మహాకవిగా ఆయనను లోకం గుర్తిస్తుందనీ కాదు. అలా ఎన్నటికీ జరగదని నాకు తెలుసు.

అయినా -

రాగం ఎంత చిన్నదైనా అది సంగీతమే. నాదం ఎంత అనామకమైనా అది పరబ్రహ్మమే.

"ఆంధ్ర రాష్ట్రాన్ని మనం సాధించి తీరాలి. అందుకోసం ఎంత త్యాగాన్నయినా చెయ్యటానికి వెనుదీయకూడదు. ఆ వచ్చిన రాష్ట్రాన్ని మనం ఫలానా విధంగా అభివృద్ధి చేసుకోవాలి" అంటూ ఉపన్యాసం చెప్పలేదు ఆయన. రాష్ట్రం వచ్చిన 20 సంవత్సరాల తర్వాత అది ఎలా ఉంటుందో తన భావనలో తాను చూచి మనకు చూపించాడు స్పష్టంగా. మనస్సుకు హత్తుకునేటట్టు లక్ష్యాన్ని నిరూపించి చెప్పటానికి ఇది ఒక చమత్కారమైన పద్ధతి. ఒక అప్రతిహతమైన శాసన విధానం. కార్యరంగంలో, భావనా రంగంలోను కూడా సిద్ధహస్తులైన అనుభవజ్ఞులకే రచనా విధానంలో ఇట్టి ప్రక్రియ సాధ్యం.

1949లో ప్రచురింపబడ్డ ఈ గ్రంథం చిన్నదే కావచ్చు. సాహితీ వేత్తల దృష్టిని కాని, రాజకీయ నాయకుల దృష్టిని కాని ఆకర్షించేటంత పెద్దది కాకపోవచ్చు. రచనా ప్రణాళికలో సమగ్రత లేకపోవచ్చు. రచయితగా ఆయన ప్రసిద్ధుడు కాకపోవచ్చు. నిజమైన ఏ వ్యక్తీ బాహ్య ప్రపంచాన్ని లక్ష్యం చెయ్యడు. సూక్ష్మంగా పరిశీలిస్తే, ఒక మహా కావ్యానికి ఉండవలసిన బీజబలం ఈ గ్రంథానికి ఉంది. ఒక్క ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికే కాక, ఏ రాష్ట్ర నిర్మాణానికైనా సరే, ఇది లక్ష్య నిర్వచన గ్రంథమే కాగలదు.

"మానవునికి కావలసిం దేమిటి ? అశాంతి, అసత్యం, అత్యాశ, అత్యాచారం లేని కోయగూడెం లోని ప్రజల కంటే నాగరిక ప్రజలు ఎక్కువ సుఖపడు తున్నారా ? మనిషికి కావలసింది సుఖ శాంతులే అయితే, ఈ కోయగూడెం వాతావరణాన్నే ప్రపంచమంతా ఎందుకు నెల కొల్పుకొనకూడదు ?" అన్న ఊహతో ప్రారంభించి – ప్రపంచం ఇక వెనక్కు నడవదు గనుక, దిన దిన ప్రవర్ధమాన మవుతున్న ప్రకృతి విజ్ఞానం ద్వారా, ముఖ్యంగా అణుశక్తి ద్వారా, ఒక మహోన్నత స్థాయిలో మానవుడికి సుఖ శాంతుల్ని సాధించి పెట్టగల ఒక ఉజ్జ్వల ప్రణాళికను ఊహించాడు డాక్టరు ఖాను. ఆ ప్రణాళికను ఒక ఆంధ్ర రాష్ట్రంలోనే ఆయన తన భావనలో అమలు పరచి చూపినా, అది విశ్వజనీన ప్రణాళికే. అదే దాని గొప్ప తనం.

కేవలం పది జిల్లాలతో కూడిన ఆంధ్ర రాష్ట్రమైనా ఏర్పడుతుందో లేదో తెలియని 1949 లోనే, నేటి 20 జిల్లాలతో కూడిన సమగ్ర ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఊహించ గలిగా డాయన.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన 20 సంవత్సరాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వమూ, ప్రజలూ ఎంత గొప్ప అభివృద్ధిని సాధించ వచ్చునో ఊహించా డాయన. ఆ ఊహా చిత్రం మొత్తం మీద ఇలా ఉంది.

విజయవాడతో గుంటూరు కలిపి ఒక మహానగరంగా నిర్మించాడు. ఇది వరకు ఉన్న పాత ఇళ్ళూ, కట్టడాలూ, అన్నీ పడగొట్టి, నగర ప్రణాళిక క్రింద పునః

నిర్మించాడు. భూగర్భ రైల్వేలు, ఫ్యాక్టరీలు, ఆఫీసులు, కాలేజీలు, యూనివర్సిటీలు, విమానాశ్రయాలు వగైరాలతో ప్రపంచంలోని మహా నగరాలలో ఇదొకటైంది.

రామపాద సాగర్, నాగార్జున సాగర్, తుంగభద్రా సాగర్ మొదలైన ప్రాజెక్టుల వల్ల దేశం స్వయం సమృద్ధమైంది. మన పంటలు, సరుకులు, కళలు, కవితలు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. చౌకగా లభిస్తున్న విద్యుచ్ఛక్తితో ప్రతి గ్రామమూ మనోమోహనంగా ఉంది.

రాయలసీమ రత్నాల గనులతోను, సానపెట్టే కర్మాగారాలతోను కలకల లాడుతోంది. పూర్వం తెలుగు నేలలో దొరికిన కోహినూర్, రిజంట్ వజ్రాల వంటి అనేక రకాల గొప్ప గొప్ప వజ్రాలు దేశ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

కోస్తా పొడుగునా ఓడ రేవులు - నౌకా నిర్మాణ పరిశ్రమలతో, విదేశ వ్యాపార రద్దీతో విరామం లేకుండా పనిచేస్తున్నాయి. ప్రతి రేవుకూ రైల్వేలు, పడవ కాలువలు. ప్రతి నది మీద ఎన్నో ప్రాజెక్టులు. నదులన్నీ కాలువలు ద్వారా కలుపబడినాయి. బస్సులు, కార్లు, స్టీమర్లు, రైళ్ళు, విమానాలు - వేటిమీదనైనా సరే రాష్ట్రంలోని ప్రతి ముఖ్యపట్నానికీ, రేవుకూ, క్షేత్రానికీ నిమిషాల మీద పోవచ్చు.

రకరకాల లోహాల, ఖనిజాల గనులు పాతాళలోకాలను జయిస్తుంటే - వివిధ ఫలాల, పుష్పాల, ధాన్యాల రాశులు నియల్లోకాలతో వియ్యమందుతున్నాయి. రాష్ట్రం మొత్తం ఒక వైకుంఠం, ప్రతి గృహమూ ఒక లక్ష్మీనివాసం.

పరిపాలనా వ్యవస్థ వికేంద్రీకరించబడి, స్థానికమైన అన్ని వ్యవహారాలు గ్రామ పంచాయతీలే నిర్వహిస్తున్నాయి. గ్రామపంచాయతీలన్నీ తాలూకా పంచాయితీకీ, తాలూకా పంచాయితీలన్నీ జిల్లా పంచాయితీలకీ అనుబంధించబడినాయి. పరిపాలనా కేంద్రం గ్రామమే. గ్రామస్థులంతా పంచాయితీ సభ్యులే.

కులతత్వం పూర్తిగా నిర్మూలించబడింది. చదువురాని వాళ్ళు ఒకరూ లేరు. అంటు వ్యాధులన్నీ అరికట్టబడినాయి. అకాల మరణాలు, బాలారిష్టాలు మచ్చుకైనా లేవు. నిరుద్యోగం లేదు. బిచ్చగాళ్ళు లేరు.

అణుశక్తి కేంద్రాలు రాష్ట్రంలోని ఐదారు ఉన్నాయి. ఒకో కేంద్రం ఒకొక్క రంగంలో పనిచేస్తున్నది.

రోదసీ నౌకలు గ్రహాంతర ప్రయాణాలు చేసి వస్తున్నాయి.

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధించి స్వర్గంలా ఉంది, ప్రజలు దేవతల్లా జీవిస్తున్నారు. అణుశక్తి సులభసాధ్యం కావటంతో అన్నిటికీ అదే ఉపయోగపడు తున్నది. అందరికీ అన్ని సౌఖ్యాలు అనాయాసంగా లభిస్తున్నాయి.

ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ఒక ఇరవై సంవత్సరాల లోనే కాదు, ఇరవై ఐదువేల సంవత్సరాల లోనైనా ఈ విధంగా తయారు కాగలదా?

మానవుడిలో నేటి కామ క్రోధ మద మాత్సర్యాది దుష్టగుణాలు ఇలానే ఉన్నంతకాలం స్వార్థమూ, దారిద్ర్యమూ, హింసా, దీనత్వమూ పోతాయనుకోలేం. అయినా ప్రతి మానవుడూ తోటి మానవుడి సంక్షేమానికి అవకాశం కలిగిస్తూ ప్రవర్తించడం నేర్చుకొన్ననాడు, మానవ సమాజం ఎంతో దివ్యంగా భాసించడానికి అభ్యంతరం ఉండదనే అనుకొంటాను.

ఉచిత విద్య, ఉచిత వైద్యం, శిశు సంరక్షణ, ఉద్యోగం, వృద్ధాప్యపుభత్యం, ఉచిత గృహవసతి, ఉచిత వినోద విజ్ఞాన విహార సౌకర్యాలు - మొత్తం మీద మనిషి పుట్టిన మరుక్షణం నుంచీ చచ్చిన మరుక్షణం దాకా, మన ప్రతిభా ప్రాభవాలను క్షణక్షణం వికసింప చేసుకొంటూ జీవించడానికి కావలసిన సమస్త సౌకర్యాలు... తప్పకుండా వాటంతటవే లభించేటట్టు ప్రభుత్వం చూడగలిగితే సర్వజన సమ సమాజం ఏర్పడి తీరుతుంది, "దీపసభ" మొదలైన కావ్యాలలో నేను ఇదే చెప్పి ఉన్నాను.

ప్రజలూ, ప్రజా ప్రతినిధులూ, స్వార్థరహితంగా, త్యాగబుద్ధితో కృషి చేస్తే, అట్టిది అసాధ్యమేమీ కాదు. అవసరానికి వైద్యసహాయం, చదువుకు ధనసహాయం, మంచి జీతం గల ఉద్యోగం, మార్కెట్టు నిండా కావలసిన సరుకులు, ముసలితనంలో తిండి బట్టలకు గ్యారంటీ, ఉండటానికి ఒక సొంత ఇల్లు ఇవన్నీ వుంటే ఎవడు మాత్రం రేపటి కోసం బెంగపెట్టుకొంటాడు ? ఎందుకు డబ్బు నిలవ చేస్తాడు ?

డబ్బు నిల్వ చేయడం, ఆస్తులు సంపాదించడం, అందుకోసం ఎలాంటి హింసలు, దోపిడిలు, పాపాలు చెయ్యడానికైనా సరే సిద్ధపడడం ఎందుకు ? రేపటి పరిస్థితి ఏమిటో, ఎలా ఉంటుందో తెలియక పోవడం వల్లనే కదా ? ప్రతి మనిషికి రేపటి పరిస్థితిని సుస్థిరం చెయ్యడం (కనీసం కూడు గుడ్డల వరకైనా) ప్రభుత్వానికి అంత కష్ట సాధ్యమా ?

అందుకే ఆంధ్రరాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని గురించి డాక్టరు ఖాను చేసిన ఊహ నన్నింతం గా ఆకర్షించింది. దానిని నేను ఇంతగా విపులీకరించడం జరిగింది.

★★★

## 13. సమకాలిక సమీక్షలు

*"చిత్రించితివి కలన్ చిత్రవిస్ఫూర్తితో*
*రాజ్యాంగ తంత్ర విరాజితముగ,*
*మేల్కొల్పితిని సాటి మేధా నిధుల నెల్ల*
*నవనవోన్మేషమౌ నాదగతితో,*
*కల్పించితివి గాథ కమనీయమౌ శ్రుతిన్*
*'స్వప్నాంధ్రరాష్ట్రంపు' సౌమ్యతీవి,*
*కూర్చినాదవు జాతి గువలయానందమౌ*
*భావికాలపు దివ్యపాటవంబు,*
*కలయు గాదది సోదరా! ఖానా ! నీకు*
*గలుగబోయెడి నవ్యాంధ్ర కాంత ప్రతిభ*
*గాంచినాడవు తొలిరేఖ కనులలోన*
*దాగియున్నట్టి ఆంధ్రుల ధైర్య పటిమ !*
*ప్రజలలో గల కోర్కెలు ప్రగతి గాంచి*
*కూర్చినాడవు నీలోని కోర్కె నిట్లు*
*ఇంతియేగాని 'కల' కాదిదెల్ల మనకు*

*జరుగ బోయెడు నవ్యాంధ్ర జాడ గాదె ?*
*కోటి తెలగాణవారల కోర్కెలెల్ల*
*రూపుగావించి నాడవు రూఢిగతిని,*
*కాలగతిలోన నీ మార్పు కలుగునయ్య !*
*ఆంధ్రరాజ్యంపు తొలిబిడ్డ వగుదువోయి !'*

అంటూ ప్రశంసించాడు శ్రీ తిరుక్కోవళ్ళూర్ అనే కవి, డాక్టరు ఖాను "స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం' గ్రంథం తొలిసారి ప్రకటించబడినప్పుడు.

"ప్రపంచ యుద్ధం మమ్మురంగా ఉన్న రోజుల్లో విజయవాడలో డాక్టరు ఖానుగారిని చూశాను. ఇంగ్లీషువాణ్ని భుజాల మీద నుంచి దింపు కోవడానికి భారతం పోరాడుతున్న రోజులవి. ఇంగ్లీషు వాడితో పాటు దేశ ప్రజల్ని పీడించుకొని తింటున్న దారిద్ర్యం, అనారోగ్యం వంటి ఇతర పీడలతో కూడా పోరాటం జరిపిన దేశభక్తుల్లో డాక్టరు ఖానుగారు ఒకరు. అసలు ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందా లేదా అన్నంత ప్రతికూల వాతావరణం ఉన్నరోజుల్లో అనేకులకు డాక్టరు ఖానుగారికి వలెనే ఊహలు పొడమినవి. అయితే, ఆయన వాటికి చక్కని అక్షరరూపము ఇచ్చినాడు. పరిణత మనస్కుడైన దేశభక్తుడు. ఊహాశాలియొక్క ఆలోచనరీతి ఈ గ్రంథంలో చక్కగా సాక్షాత్కారిస్తున్నది" అన్నారు తెలంగాణా రచయితల సంఘ ఉపాధ్యక్షుడైన మహాకవి దాశరథి ఈ గ్రంథం రెండవ ముద్రణ పరిచయంలో.

"ఆంధ్ర సంస్కృతిని అన్నివిధాల అపురూపంగా తీర్చిదిద్దిన గోదావరీమతల్లి పర్యంకం మీద చల్లగాలి తెమ్మెరలలో పడుకొని, ఆంధ్రరాష్ట్రపు భవిష్యత్తును ఆలోచించు కొంటూ ఒక ఆంధ్ర యువకుడు నిద్రిస్తాడు. వైజ్ఞానికంగా, సాంఘికంగా, రాజకీయంగా, నిర్మాణాత్మకమైన స్వీయరాష్ట్రాన్ని మహోన్నత దివ్యస్వర్గంగా దర్శించు కొంటాడు. స్వరాష్ట్రంలో ఆంధ్రుడి బ్రతు కొక రంగు రంగుల బంగారపు భరిణ అనుకొంటాడు. తాను చూచి పొంగిపోయిన సుస్వప్నానికి అక్షరరూపమే ఈ పుస్తకం. నిజానికి ఇది చక్కని అనుభూతిని ఇచ్చే మధురమైన కల అని ఒప్పుకోవాలి. ఈ తియ్యని అనుభూతిని మన అందరికీ పంచి ఇచ్చిన డాక్టర్ ఖాన్‌గారిని అభినందిస్తున్నాను. కలలు నిజమౌతాయంటారు పెద్దలు ! నేను కలగన్న రాష్ట్రం

రాకుండా పోతుందా ? ఇష్ట వాంఛాఫల సిద్ధిరస్తు, అభీప్సిత సిద్ధిరస్తు. ఇది అదృశ్యవాణి ఆశీర్వాదంగా అనిపిస్తున్నది - " అన్నది అనందవాణి.

"ఇదిగో అదిగో అంటూ అవతరింపనున్న ఆంధ్ర రాష్ట్రము మన ప్రజా ప్రభుత్వము ఏ విధముగా, ఎటువంటి లక్ష్యములతో నడుపవలెనో సూచించు ఒక ఊహా చిత్రణ ఇది" అంది భారతి.

"ఆంధ్రరాష్ట్రం వేరుపడితే బానిసలకు స్వరాజ్యం వచ్చినంత సంబరపడేవారు అనేకు లున్నారు. స్వరాష్ట్రంలో ఎంతో సుఖం మరెన్నో సదుపాయాలూ, ఇంకెంతో విజ్ఞానం లభిస్తాయనే ఆశలు చాలా మందికి ఉ న్నాయి. ప్రతి వ్యక్తి అదేదో స్వర్గంలా అవతరిస్తుందని కలలు కనేవారే కాని ఫలానా కా రణాల వల్ల. ఫలానా పరివర్తనలు జరిగి, ఫలానా విధమైన స్వర్గం ఆంధ్రరాష్ట్రంలో వెలుస్తుందని చెప్పేవాళ్ళు లెక్కకు కనుపించడం లేదు. డాక్టరు ఖానుగారు తానూహిస్తున్న భవిష్యదాంధ్రరాష్ట్రం ఇలా ఉంటుందీ అని నిర్దిష్టంగా చెప్పాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రచించడం మెచ్చుకోదగ్గ సంగతి. చదివితే అంతా విచక్షణాయుతంగా, కార్యకారణ ఫలిత సామ్య దృక్పథంతో వివరంగా కనిపిస్తున్నది. అందుగ్గాను మనం చేయవలసిన కృషినీ, మార్చుకోవలసిన పద్ధతులనూ సూచించారు" అన్నది జ్యోతి.

"రచయితగా డాక్టర్ ఖాన్ తాను కలగన్న విశాలాంధ్రౌన్నత్య స్వరూపాన్ని తేట తెలుగు నుడికారంతో చిత్రించాడు. రానున్న 'ఆంధ్రరాష్ట్రం' ఆ పిదప అది 'విశాలాంధ్ర'గా రూపొంది సర్వాలంకార శోభితంగా మారిన ఇరువది సంవత్సరాల మేరకు ఊహించాడు. సర్వమానవ సౌభ్రాతృత్వంతో విశాలాంధ్ర విలసిల్లాలనే విశాల భావంతో విహరించి చిత్రించిన స్వప్న దృశ్యం చదువుటకు చక్కగా ఉంది" అన్నది జాగృతి.

ఇంకా ములుకోల, వినోదిని, గ్రామోద్ధరణ, శారద, వెండి తెర వంటి ఆనాటి పత్రికలు, అనుమోలు దుర్గా మల్లికార్జున శర్మ, గోపరాజు వెంకటానందం, మహాకవి జాషువ, గిడుతూరి సూర్యం వంటి ప్రముఖులు డాక్టరు ఖానుగారి కల నిజం కావాలని ఆశీర్వదించారు.

★★★

# 14. లాఠీకి నమస్కారం

## నమస్కారానికి లాఠీ

ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి నాయకుల ప్రజల ఆందోళన ఎంతగా తోడ్పడిందో, ఆ ఆందోళనను ప్రవేగీకరించడానికి డాక్టరు ఖానుగారి రచన అంతగానూ తోడ్పడింది. వేల కొలది ప్రతులను ముద్రించి ఆయన ఉచితంగా పంచిపెట్టడం వల్ల, తానే స్వయంగా వాటిని వివిధ నాయకులకు, ముఖ్యంగా ఢిల్లీలో ఉన్న ఆంధ్ర నాయకులకు, తదితర పెద్దలకు అందివ్వడం వల్ల, ఏమైనా సరే రాష్ట్రాన్ని సాధించాలనే పట్టుదల ప్రజల్లోనూ నాయకులలోనూ కలిగింది. ఆందోళన తీవ్రతరమైంది. దాని ఫలితమే పొట్టి శ్రీరాములుగారి నిరశన దీక్ష.

1951-52 ప్రాంతంలో భారత ప్రధాని నెహ్రూగారు విజయవాడ వచ్చినప్పుడు ప్రత్యేక రాష్ట్ర వాంఛను నిర్దిష్టంగా ఆయన ముందు ఉంచిన వారిలో డాక్టరు ఖాను ఒకడు. ఆంధ్ర ముస్లింల తరఫున కూడ ఒక విజ్ఞాపన పత్రాన్ని ఆయన సమర్పించాడు.

తక్షణం ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేకించబడాలని, దానికి చెన్న పట్టణమే రాజధానిగా ఉండాలని ఆంధ్రులంతా ఏక కంఠంతో ఎలుగెత్తి చాటారు. ఆంధ్రుల ఈ చిరకాల వాంఛ ఈడేరే వరకు తాను మంచి నీళ్ళుకూడా ముట్టనని పొట్టి శ్రీరాములు గారు శపథం చేసి దీక్షలో కూర్చున్నారు. మద్రాసు నగరంలో మైలాపూరులోని మహర్షి బులుసు సాంబమూర్తిగారి గృహంలో ఆ దీక్ష సాగింది. దేశం ఉద్రిక్తమైంది.

చచ్చినా మద్రాసు విడిచిపెట్ట మంటూ తమిళ నాయకులు ఉద్ఘాటనలు చెయ్య సాగారు. న్యాయం జరగాలంటూ ఆంధ్ర నాయకులు ఉద్ఘోషించసాగారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం రాజగోపాలాచారిగారి చేతుల్లో ఉంది. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణానికి ఆయన ప్రబల విరోధి. విజయమో వీరమరణమో అన్న పరిస్థితులలో దీక్షాబద్ధులైనారు పొట్టి శ్రీరాములు గారు. శ్రీరాములు గారు దీక్ష సాగించిన ఆ 58 రోజులూ మద్రాసులో ఏ నిమిషంలో ఏం జరుగుతుందో తెలియని

ఉద్రిక్త స్థితి ఏర్పడింది. ఆయన దీక్షను అపార్థం చేసుకొన్నవారు, అవహేళన చేసినవారు ఒక్క సారిగా నిశ్చేష్టులైపోయారు – డిసెంబరు 15వ తేదీన, ఆయన పూర్ణాహుతి అయిపోయినప్పుడు

శ్రీరాములుగారి పూర్ణాహుతికి దేశం యావత్తూ కన్నీరు కార్చింది. అందులో డాక్టరు ఖాను ఒక్కరని వేరే చెప్పనక్కర లేదు.

ఆంధ్రప్రజలు ఉద్రిక్తులైనారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రాంతంలో చెలరేగిన విప్లవం పట్టపగ్గాలు లేనట్టిది. దానిని తట్టుకోవడం కోసం ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరుస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన చెయ్యక తప్పలేదు.

ఆందోళనలూ, సమ్మెలూ, దౌర్జన్యాలూ, ఆత్మాహుతులూ వంటి హింసాకాండ జరిగితేనే తప్ప, అహింసా సిద్ధాంతంపై ఏర్పడ్డ ప్రభుత్వాలు సైతం న్యాయాన్ని గుర్తించక పోవడంలోని దేవరహస్యం ఏమిటో ?

చెన్నపట్టణం లేకుండానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలన్నది ప్రభుత్వ నిర్ణయం. అయితే, ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని ఏదీ ?

రాజధానిగా ఉండటానికి అర్హత గల ఒక పట్టణాన్ని నిర్ణయించటం కోసం వాంఛూ ఆంధ్రప్రాంత పర్యటనకు పంపబడ్డారు. ఆ సందర్భంలో ఆయనకు మంచి సూచనలు చేసిన వారిలో డాక్టరు ఖాను ఒకడు.

జాతీయ ముస్లిం మహాసభ అధ్యక్షుడుగా ఆయన వాంఛూను కలుసుకొన్నాడు. బెజవాడ పట్టణం ఒక్కటే ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కాదగిన అర్హత కలిగి ఉన్నదని ఆయన నిరూపించాడు. గుంటూరు, బెజవాడ, తెనాలి ఈ మూడు పట్టణాలూ కలిసి పోగలవని, తత్ఫలితంగా ఒక మహానగరం ఉద్భవించగలదని ఆయన వాదన. ఆయన కన్న కల కూడా అదే. చిత్రమేమంటే – ఆంధ్రలోని అన్ని జిల్లాల ముఖ్య పట్టణాలనూ, ప్రధాన ప్రాంతాలనూ దర్శించి, ఎంతో మంది ప్రజల, నాయకుల సలహాలను సేకరించి, పరిస్థితిని కరతలామలకం గావించుకొన్న వాంఛూ తన నివేదికలో డాక్టరు ఖాను చేసిన సూచన వంటి సూచనలే చెయ్యటం !

బెజవాడ, గుంటూరు, తెనాలి. ఈ మధ్య ప్రాంతం రాజధాని నగర నిర్మాణానికి తగి ఉంటుందని శ్రీ వాంఛూ సూచించారట.

1953, అక్టోబరులో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు ఎంతో ప్రత్యేక మైనట్టిది. దానిని సాధించటానికి ఆంధ్రులు చేసిన త్యాగం, జరిపిన పోరాటం, పడ్డ బాధ వర్ణనాతీతం.

దీన్ని సాధించిన శక్తుల్ని మూడు భాగాలుగా పేర్కొంటే – అందులో అతి ముఖ్యమైన శక్తి అమరజీవి పొట్టి శ్రీరాములుగారు. రెండవ శక్తి అయ్యదేవర కాళేశ్వరరావుగారి వంటి అగ్రనాయకులు. మూడవ శక్తి డాక్టరు ఖాను వంటి భావుకులూ, కార్యకర్తలూ.

ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భం లోనే ఆంధ్రుల స్వర్ణయుగం అన్న పేరుతో ఆంధ్రజాతి చరిత్రనూ, రాష్ట్రోద్యమ చరిత్రనూ ముఖ్యమైన వివరాలతో ఒక చిన్న గ్రంథంగా వ్రాసి, ఆంధ్ర సరస్వతికి ఒక ఆభరణంగా అర్పించాడు డాక్టరు ఖాను. ఆ గ్రంథం చూడటానికి చిన్నదే అయినా, అందులోని వివరాలు చరిత్రకు ఆణిముత్యాలు.

★★★

## 15. రసలింగం

బెజవాడ పట్టణంలో, గాంధీ నగరంలోని తాలూకా ఆఫీసు ఎదురుగా ఉన్న మేడ మీద 'రే అండ్ కో' అనే బోర్డును చూడని వారెవ్వరూ ఉండరు.

ముస్లింలీగు నుంచి రాజీనామా చేసి, జిన్నాను ఎదిరించి, డాక్టరు ఖాను జాతీయోద్యమంలో చేరిన మరునాడు ముస్లిం లీగర్లు, కమ్యూనిస్టు వర్కర్ల ముట్టడికి లోనైంది ఆ మేడే. స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం ప్రకటించబడ్డ తర్వాత, అందులో ఖానుగారి మనుమరాలికి మేఘరంజని అన్న పేరు పెట్టబడి ఉండడం చూచి, ముస్లింలలోని పామరజనం కొందరు మళ్ళీ మరొకసారి ముట్టడి జరిపిన మేడ కూడా అదే.

అటువంటి చరిత్ర కలది ఆ మేడ. అందుకే "రే అండ్ కో" అన్న బోర్డు అంత ప్రసిద్ధిని పొందింది. అది డాక్టరు ఖానుగారి వైద్యశాల.

వైద్యవృత్తి డాక్టరు ఖానుగారి కుటుంబంలో వంశానుగతంగా వస్తున్నట్టిది. డాక్టరు ఖాను తండ్రిగారు డాక్టరు నవాబ్ హుస్సేన్ ఆలీఖాన్. డాక్టరు ఆలీఖాన్‌గారు ఆలోపతి (ఇంగ్లీష్) వైద్యంలో మంచి పేరున్న వాడు. తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురంలో గవర్నమెంటు హాస్పటలులో ఆనరరీ సర్జనుగా ఉండేవాడు. సర్జరీ కేసులలో సిద్ధహస్తుడు. రెండు చేతులా సంపాదించేవాడు. ఒక పెద్దాపురంలోనే కాదు ఆ చుట్టుపట్ల కూడా ఆయనకు మంచిపేరు ఉండేది.

1916లో పెద్దాపురంలోనే, డాక్టరు ఆలీఖాన్ మోహతాబీ బేగం దంపతులకు ఒక కుమారుడు జన్మించాడు. ఆయన పేరు సర్కార్ మహబూబ్ ఆలీఖాన్. ఆయనే మన డాక్టరు ఎం.ఎ. ఖాను.

డాక్టరు ఖాను మూడేండ్ల పసిపాపగా ఉన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. ఆ తర్వాత ఆయన పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

1934లో ఏలూరులో చదువుకొంటున్న రోజుల్లో డాక్టరు ఖాను దృష్టి వైద్యం మీదికి మళ్ళింది. డాక్టరుగారి కొడుకు కావడం వల్ల ఆయన పుట్టుకతోనే డాక్టరు అయినాడు. రోగ నిదానం దానంతట అదే అలవడింది. చికిత్సకు మందులు అందుబాటులోనే ఉన్నాయి. హరిజనవాడల్లోనూ తదితర పేద ప్రజల్లోను, బజారు ల్లోని కూలీలలోను, హోటళ్ళలోని సర్వర్లలోనూ, ఆయన వైద్యం పాదరసంలా ప్రవహించ సాగింది. చిన్నచిన్న రోగాలకు పెద్ద పెద్ద మందులిచ్చి ఆయన రోజుకు నాలుగైదు రూపాయల వరకు సంపాదించ గలిగేవాడట. అప్పటి కాయన వయస్సు 18 సంవత్సరాలు మాత్రం. ఈ రోజుల్లో నలభై యాభై రూపాయలన్న మాట. సామాన్య జనం ఒక కుర్రవాడికి ఆ మాత్రం డబ్బు మెచ్చి ఇచ్చే వారంటే అప్పటికే ఆయన వైద్యం ఎంత పటిష్ఠంగా ఉండేదో మనం ఊహించుకోవచ్చు.

ఆ తర్వాత కుటుంబంలో ప్రారంభమైన గాలిదెబ్బలకు గురై, అనాతవరంలో తన తండ్రివైపు బంధువైన షేక్ పెదమౌలా సాహెబ్ గారి వద్ద కొంత కాలం గడప

వలసి వచ్చింది. షేక్ పెదమౌలాసాహేబ్ మంచి స్థితిపరుడు. సహృదయుడు, దేశ భక్తుడు.

గోదావరి శాఖలైన గౌతమీ వైనతేయ నదుల మధ్య గల అమలాపురం - ప్రకృతి సౌందర్యంలో పరాకాష్ఠ నందుకొన్న కోనసీమలోని ఒక భాగం. బహుశా, అక్కడ గడపిన ఆ రోజులే ఆయనలోని జాతీయతను, దేశభక్తిని, సౌందర్యారాధనను, కవితాభావుకతను, స్వతంత్రజీవిత కాంక్షను వికసింపజేసి ఉండవచ్చు. ఆయన అక్కడ ఉన్నప్పుడే పాదరసపు గుళికలు, అమృతాంజనాన్ని పోలిన తైలాలు స్వయంగా చేసి అమలాపురంలోనూ, ఆ చుట్టుప్రక్కలను వైద్యం చేయటం సాగించాడు.

స్వయంగా మందులు తయారు చేయడం అప్పుడే అబ్బిం దాయనకు. ఆయన చేసే వైద్యంలో ప్రధానమైన ఔషధం పాదరసపు గుళిక. ఇది సర్వరోగ నివారిణి. రసాన్ని శుద్ధిచేసి కట్టిన ఈ గుళికలు సరైన అనుపానాలతోను, పథ్యంతోను వాడితే ఏ వ్యాధినైనా సరే నివారించగలవట !

ఇది తరతరాల నుంచీ వస్తున్న గృహయోగం కనుక, డాక్టరు ఖాను చిన్న నాటి నుంచే ఇందులో సిద్ధహస్తు డైనాడు.

ఆయన వద్దనున్న మరొక అపూర్వ యోగం రసలింగం. "రసము కట్టినేని రాజ్యంబు కట్టును" అని వేమనయోగి చెప్పాడని, అట్టి రసయోగం కోసం తన తాతగారు, తండ్రిగారు కూడ ఎన్నో పరిశోధనలు జరుపుతూ వచ్చారని డాక్టరు ఖాను అంటాడు.

రసలింగం అంటే పాదరసాన్ని లింగాకారంలో గడ్డకట్టించడం. ఆ లింగాన్ని మెడలో ధరిస్తే ఎన్నోరకాల వ్యాధులు నయమౌతాయట !

ఈ రసలింగానికి ఆ రోజుల్లో పండితులలోను, పామరులలోను కూడ చెప్పలేనంత గిరాకీ ఉండేది. ఆనాడు అమలాపురంలోని ఒక ప్రముఖ మెడికల్ స్టోర్స్ వారు ఈ గుళికలకు, రసలింగాలకు డాక్టరు ఖానుగారి ప్రత్యేక ఏజెంట్లుగా ఉండి, వివిధ ప్రాంతాలకు వాటిని సరఫరా చేసేవారు.

అలా వచ్చిన డబ్బుతో స్వేచ్ఛగా, హుందాగా కాలం గడుపుతూ ఉండేవాడా యన. అయితే, అక్కడ షేక్ పెదమౌలా సాహెబ్‌గారి వృత్తి ప్రధానంగా వ్యవసాయం

కావడం వల్ల, డాక్టరు ఖానును ఒక వ్యవసాయకుడిగా తీర్చిదిద్దడానికి ఆయన ప్రయత్నం చేయడం వల్ల అక్కడి జీవితం డాక్టరు ఖానుకు తృప్తిని ఇవ్వలేక పోయింది. ఆ తర్వాత కొద్దికాలానికే తన పెదతండ్రిగారి సలహాపై, కోనసీమ సౌందర్యానికి ఒక నమస్కారం చేసి, డాక్టరు ఖాను విజయనగరం వెళ్ళిపోయాడు.

★★★

## 16. రే అండ్ కో

డాక్టరు ఖాను జీవితంలో ఇదొక ప్రధాన ఘట్టం. ఒక ముఖ్యమైన మలుపు. ఈనాడు సర్కార్ మహబూబ్ ఆలీఖాన్ అనే కుర్రవాడు సుప్రసిద్ధుడైన ఒక డాక్టరు కాగలిగాడంటే, దేశంలో అసాధ్య మనుకునే ఒక ప్రత్యేక శారీరక బాధతో కుమిలి పోయే దురదృష్టవంతులైన అనేక మంది పురుషులకు దేవుడిచ్చిన ఒకవరంగా భాసిస్తున్నాడంటే అందుకు పునాది వేసింది ఆనాటి ఆయన విజయనగరం యాత్రే.

విజయనగరంలో ఆయన ప్రత్యేక వైద్యం ప్రారంభించిన కొద్ది కాలానికే తన ప్రఖ్యాతి ఆ చుట్టు ప్రక్కల అంతటా వ్యాపించింది.

తమ జీవితం ఇక వ్యర్థం అనుకొంటున్న ఎంతో మంది పురుషులు ఎంతో సులభంగా ఆయన దగ్గర రోగనివారణను పొంది, సంతానవంతులై ఆనందించ సాగారు. దానితో ఆయనకు డబ్బు బాగా వచ్చేది. అందులో కొంత భాగాన్ని ప్రతి నెలా తన తండ్రికి కూడా పంపుతూ తాను ఒక జమీందారులా ఉన్నతస్థాయిలో డబ్బును ఖర్చుపెడుతూ, ఇతరులకు సహాయం చేస్తూ ఎంతో వైభవంగా జీవితాన్ని అనుభవింప సాగాడాయన.

ఒక కాంపౌండరు, ఒక వంటవాడు, ఒక నౌకరు - ఇలా ప్రారంభమైన ఆయన ప్రత్యేక వైద్యవృత్తి దినదిన ప్రవర్ధమానమౌతూ విజయనగరం నుంచి అనకాపల్లికి, అనకాపల్లి నుంచి నిడదవోలుకు - అలా మజిలీలు చేసుకొంటూ, చివరకు బెజవాడలో "రే అండ్ కో" అనే పేరుతో ఒక పెద్ద ఆస్పత్రిగా వికసించింది.

రే అనే ఆంగ్ల పదానికి కిరణం అని అర్థం.

"సమస్త వ్యాధుల్నీ సూర్యకిరణాలు బాగుచేస్తాయి. అలాంటి వ్యాధుల్లో ఒక అసాధ్య వ్యాధిని ఎట్టి శస్త్ర చికిత్సా లేకుండా అనాయాసంగా బాగుచేసే వైద్య కేంద్రం ఇది. అందుకే నా ఆస్పత్రికి రే అండ్ కో అని పేరు పెట్టాను. దీనికి నా పేరో, నా తండ్రిగారి పేరో, మా అబ్బాయి పేరో పెట్ట గలను. అనాదిగా మా ఇంట వర్ధిల్లుతూ వస్తున్న వైద్య దేవత ఇది. మా వంశమూల పురుషుడి పేరు కూడా పెట్టవచ్చు దీనికి. కాని, నా దృష్టిలో వ్యక్తులు ప్రధానం కాదు. మా కుటుంబం లోని ఎందరో వ్యక్తులు ఈ వైద్యం చేశారు. ముందు ముందు ఇంకా ఎందరో వ్యక్తులు చేయబోతారు. అందుకే వైద్యానికి మాత్రమే నేను ప్రాధాన్యం ఇస్తాను. అందుకే ఆరోగ్య దైవతం అయిన సూర్య భగవానుడి అమృతహస్తం పేరు మీద ఈ వైద్య సంస్థను నెలకొల్పాను" అంటారు డాక్టరు ఖాను.

ఆ పేరు పెట్టడంలో ఆయన ఉద్దేశం ఏదైనప్పటికీ, బృహద్రోగ పీడితులై దిక్కు తోచక దుఃఖించే అనేక మంది పురుషులకు ఈ సంస్థ ఒక ఆశాకిరణంగా భాసిస్తున్న దనడానికి సందేహం ఏమీ లేదు. ఆయన వైద్య కేంద్రానికి ప్రతిదినం చికిత్స కోసం వచ్చిపోయే వేలాది పురుషులే అందుకు ప్రత్యక్ష నిదర్శనం.

"ఈ సంస్థను ఇంకా అభివృద్ధి చెయ్యాలని ఉంది నాకు. ఆధునికమైన ఆపరేషనులు తప్ప మరో గత్యంతరం లేని ఈ వ్యాధికి, ఇంద్రజాలం లాంటి ఈ చికిత్స ఎంతో అద్భుతంలా పనిచేస్తుంది. ఆపరేషన్‌లను రూఢిగా నమ్మలేం. ఈ చికిత్సలో అట్టి ప్రమాదం ఏదీ లేదు. రోగ నివారణ జరిగి తీరవలసిందే. ఇది అనాది సిద్ధమైన మూలికా యోగం. ఇది పూర్వం మా కుటుంబ పరిధిలోని వారికే ఉపయోగ పడేది. నేను ఒక మన రాష్ట్రంలోనే కాక మన చుట్టుప్రక్కల రాష్ట్రాలలోని ప్రజలకు కూడా దీని సేవను అందచేస్తున్నాను. ప్రపంచమంతటా ఈ ఔషధాన్ని, చికిత్స విధానాన్ని వ్యాపింపజేయాలని నా ఆకాంక్ష తైల రూపంలో, బిళ్ళల రూపంలో, ఇంజక్షన్ల రూపంలో దీన్ని విదేశాలకు ఎగుమతి చెయ్యవచ్చు. విదేశాల నుంచి కొత్త కొత్త ఔషధాలు, పేటెంటు మందులు అనేక రూపాలలో వేన వేలుగా మన దేశానికి దిగుమతి ఔతున్నాయి. ఈనాటికీ అప్రతిహతంగా, అప్రతిమానంగా, అసాధ్య

దీర్ఘరోగాలను సైతం నివారణ చేస్తున్న ఆయుర్వేదం, సిద్ధ, యునానీ ఔషధాలు మనకు ఉన్నాయి. గోసాయి చిట్కాలు, మూలికా యోగాలు వందలూ, వేలూ ఉన్నాయి. శుద్ధమైన ఒక సిద్ధ ఔషధాన్ని కూడా మనం విదేశాలకు ఎగుమతి చెయ్యలేక పోతున్నామూ అంటే ఏమను కోవాలి ? పరిశోధన, క్రియాశక్తి మనలో ఇంతగా ఎందుకు క్షీణించి పోయాయో ?" అంటాడు డాక్టరు ఖాను ఎంతో ఆవేశంతో.

రే అండ్ కో సంస్థను ప్రపంచ వ్యాప్తం చెయ్యాలని, తమ ఔషధాలను లోకం అన్ని మూలలకు అందుబాటులో ఉంచాలని ఆయన చిరకాల వాంఛ. ఆయన ఈ వాంఛే కాక - ఇటువంటి మహా వ్యక్తుల విశ్వజనీన సమ్యగభిలాషలన్నీ నెరవేరాలనేదే మనందరి కోరిక కూడ.

మానవ సేవే మాధవ సేవ అన్న గాంధీజీ తత్వబోధే పునాదిగా నడుస్తున్నది డాక్టరు ఖాను వైద్యసేవ - నిత్య నవనవోన్మేషంగా.

సూర్య కిరణం శక్తిదాయకం, చంద్రకిరణం ఓషధీ పోషకం. ప్రాణానికి ఆధారం చంద్ర సూర్యులే. బహుశా ఈ దృష్టితోనే కావచ్చు - ఆయన తన గృహాలలో ఒక దానికి సూర్య భవనం అని, మరొక దానికి చంద్ర భవనం అని నామకరణం చేశాడు.

★★★

## 17. తల్లిలేని బిడ్డ

తల్లిగారి మరణంతో, తండ్రిగారు మనఃక్లేశానికి గురై వైద్య వృత్తిని నిర్లక్ష్యం చెయ్యటంతో, డాక్టరు ఖాను కుటుంబాన్ని విషాద మేఘాలు క్రమ్ముకొన్న రోజులవి. ఆయన కప్పుడు మూడేండ్లు మాత్రమే. ఆయన జీవితంలో నిత్యం వెన్నంటి వస్తున్న తుఫాను గాలులు బహుశా అప్పుడే ప్రారంభించా యనుకోవచ్చు.

అప్పటికి పెద్దాపురంలో ఆయన కుటుంబం మంచి పలుకుబడిలోనే ఉంది. ఆయన తాతగారు షంషరల్లీ ఖాన్ మంచి ఆయుర్వేద వైద్యుడు. పెద్ద తండ్రి అబ్దుల్

అజీజ్‌ఖాన్ వెటరినరీ సర్జెను. మేనమామ ఇస్‌మేల్ ఖాన్ సివిల్ సర్జను. ఆయన పెద్దాపురం మునిపిపల్ ఛైర్‌మన్‌గా కూడా ఉండేవారు.

ఇంతటి ఉత్తేజకరమైన వాతావరణంలో, ఉత్తమ సంస్కారంలో, డాక్టర్ల వంశంలో పుట్టి కూడా చిన్నప్పుడే ఆయన తల్లిలేని బిడ్డ అయినాడంటే – మానవుని అసహాయత మరొకసారి రుజువు కావడమే.

ఆ తర్వాత తన నాయనమ్మ చేతుల్లో పెరిగాడు డాక్టరు ఖాను.

జనాబ్ హుసేన్ ఆలీఖాన్ భార్య మరణంతో పిచ్చివాడై – వృత్తిని, సంసారాన్ని కూడా నిర్లక్ష్యం చేసి – తిరుగుతున్నప్పుడు ఎంతో మంది ఆయన్ని ఓదార్చటానికి ప్రయత్నించారు. తనువులు శాశ్వతం కాదనీ, పుట్టిన వాళ్ళు గిట్టక తప్పదనీ – అలా ఎన్నో సత్యాలను బోధించారు. మానవ ధర్మాన్ని ఉపేక్షించ కూడదన్నారు. వైద్యవృత్తిని మానవద్దన్నారు. ఒకసారి మనస్సు పాడుచేసుకొంటే అది మళ్ళీ బాగుపడటం కష్టం అన్నారు.

ఏదీ కూడా డాక్టర్ ఆలీఖాన్ మనస్సుకు ఎక్కలేదు. అవన్నీ ఎవరికి తెలియవు గనుక. కష్టం కలిగినప్పుడు దుఃఖించడం, దుఃఖపడుతున్న వాళ్ళని ఓదార్చటం – ఇవన్నీ ఎప్పుడూ ఉంటూ ఉండేవే.

కాని –

తన సమస్తాన్నీ అర్పించి, తన కష్ట సుఖాలు అన్నిటిలోనూ భాగస్వామిని అయి, తన ప్రాణంలో ప్రాణంగా కలసిపోయిన సహ ధర్మచారిణిని కోల్పోయిన ఒక సహృదయుణ్ని ఎంతమంది ఓదార్చ గలరు ? ఎన్ని సత్యాలు సేదదీర్చ గలవు ?

అయినా – ఏలాంటి వారికైనా, ఎంతటి విలువైన వస్తువును పోగొట్టుకున్న వానికైనా, ఓదార్పు పొందటమూ తప్పదు, సేద దేరడమూ తప్పదు. భార్యా వియోగంతో మానసికమైన దౌర్బల్యం ఏర్పడి. విరక్తి కలిగి కూర్చున్న డాక్టర్ హుసేన్ అలీ ఖానును చిట్ట చివరకు కర్తవ్యాభిముఖుణ్ని చెయ్యగలిగిన గౌరవం లంకా సుబ్బారావు గారికి దక్కింది.

సుబ్బారావుగారు కాకినాడ వాస్తవ్యులు. జమీందారులు. ఆయన చేసిన కర్తవ్యోపదేశం డాక్టర్ హుసేన్ అలీఖాన్‌ను తిరిగి మేల్కొలిపింది. మనస్సు దిటవు చేసుకొని, తిరిగి వైద్య వృత్తిని అవలంబించటానికి ఆయన ఉత్సాహం కనబరచారు. అయితే – ఆమె లేని ఇంట్లో తానుండలేనని ఆయన చెప్పడం వల్ల, సుబ్బారావుగారు ఒక పరిచయ లేఖతో ఆయనను పంగెడిగూడెం పంపించారు. దానితో డాక్టరు ఖానుగారి కుటుంబం తూర్పు గోదావరి నుంచి పశ్చిమ గోదావరికి మారింది.

పంగెడిగూడెం పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు దగ్గర ఒక గ్రామం. నార్త్ వల్లూరు ఎస్టేట్ రాజాగారైన శ్రీ రాజా బొమ్మదేవర వెంకటరాయలు నాయుడు బహదూర్ వారి నివాసం అది. శ్రీ రాజావారు లంకా సుబ్బారావుగారికి బావగారు. రాజా వారికి మంచి అనుభవజ్ఞుడైన ఒక ఫేమిలీ డాక్టర్ అవసరమని ఎరిగి ఉన్న సుబ్బారావుగారు ఆ స్థానానికి డాక్టర్ హుస్సేన్ ఆలీఖాన్ గారిని రికమండ్ చేశారు. ఆ విధంగా డాక్టర్ హుస్సేన్ ఆలీఖాన్ గారు పంగెడిగూడెం రాజా వారికి ఆస్థాన వైద్యులైనారు.

కోటలోనే డాక్టరు గారికి వసతి ఏర్పాటు చేయబడింది. రాజా వారి బంగళాకు అటూ ఇటూ రెండు భవనాలు ఉండేవి. అందులో ఒకటి డాక్టరు గారికి, ఒకటి ఎస్టేట్ దివాను గారికి కేటాయించబడినాయి. అప్పటికి మన ఖానుకు నాలుగేండ్లు.

డాక్టరు ఖాను విద్యాభ్యాసం కోటలోనే ఓనమాలతో ప్రారంభమైంది.

ఒక ముస్లింబాలుని విద్యాభ్యాసం తెలుగు సంప్రదాయంలో ఓనమాలతోనూ, పెద్దబాలశిక్షతోనూ ప్రారంభమైనదంటే భాషకు మతానికి తేడా తెలియని కేవల ప్రాకృతులకు వింతగానే కనిపించవచ్చు. కానీ, సర్వజ్ఞుడు, సమదర్శనుడు అయిన పండితుడికి అదే ఉత్తమ సంస్కార మార్గం.

తెలుగు నేలలో పుట్టినవాడు తెలుగు చదవడం కనీస ధర్మం. తెలుగు చదవ దలచినవాడు తెలుగు సంప్రదాయ ప్రకారం అక్షరాభ్యాసం చెయ్యక తప్పదు. ఇది భాషా విషయం. మతంతో సంబంధం లేదు. ఇట్టి ఉత్తమ సంప్రదాయాన్ని

ఎరిగినవారు కనుకనే డాక్టరు ఖాను కుటుంబంవారు అట్టి పద్ధతిని అవలంబించ గలిగారు.

అంది పుచ్చుకున్నట్టుగా వచ్చింది చదువు డాక్టరు ఖానుకు. అచిర కాలంలోనే పెద్దబాలశిక్ష పూర్తి చేసి, గజేంద్రమోక్షం తీసుకున్నా డాయన ఆ తర్వాత రుక్మిణీ కల్యాణం. ఆయన గురువు కనకయ్య పంతులుగారు.

★★★

## 18. కనకయ్య పంతులుగారు

"గురువంటే కనకయ్య పంతులుగారే గురు వనిపిస్తుంది నాకు. ధనరూపంలో గాని, వస్తు రూపంలో గాని ఎన్నడూ ఏమీ తీసుకోలే దాయన మా దగ్గర. కేవలం చదువు కోసమే చదువు చెప్పేవా రాయన. భారత భాగవతాలను టీకా తాత్పర్యాలతో సహా ఆనాడు ఆయన నాకు అంతగా నూరిపొయ్యడం వల్లనే ఈనాడు నాకు ఈ మాత్రపు అక్షర జ్ఞానమైనా కలిగింది. గురువులోని ఆత్మీయతే శిష్యుణ్ని ఆత్మజ్ఞానిగా చేస్తుంది. గురుఃబ్రహ్మ, గురుఃవిష్ణు, గురుదేవో మహేశ్వరః - అనుకున్నప్పుడెల్లా నాకు నేటికీ ఆనాటి కనకయ్య పంతులుగారే కళ్ళముందు సాక్షాత్కరిస్తారు" అంటాడు డాక్టరు ఖాను, తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ. ఆయన జీవితంలో అదొక స్వర్ణయుగం.

డాక్టరు హుసేన్ అలీఖాన్ ఆస్థాన వైద్యుడైనట్లే, పంగెడిగూడెం సంస్థానంలో కనకయ్య పంతులుగారు ఆస్థానోపాధ్యాయుడు. కోటలోని రాజావారి పిల్లలకు, దివానుగారి, డాక్టరుగారి, సెక్రటరీగారి పిల్లలకు మాత్రమే చదువు చెప్పేవాడాయన. బాగా చదువు కొన్నవాడు. గొప్ప విద్వాంసుడు. అన్నిటినీ మించి సహృదయుడు. శ్రేయోభిలాషి. ఒక్క చదువుకు సంబంధించినంతవరకు మాత్రమే కాక బాలక్రియా రంగంలోని అనేక తదితర విషయాలకు సంబంధించి కూడా కనకయ్య పంతులుగారు డాక్టరు ఖానుకు గురువు.

బొబ్బిలి యుద్ధం నాటకంలో ఆయన రంగారాయుడుగా నిలిస్తే డాక్టరు

ఖాను చిన రంగారావు పాత్రను ధరించేవాడు. అంటే కనకయ్య పంతులుగారు డాక్టరు ఖానుకు నాటకాల గురువు కూడా అన్నమాట.

పంగెడిగూడానికి ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) చాలా దగ్గర. ఆరుమైళ్ళు మాత్రమే. అక్కడికి వెళ్ళేయాత్రికులు చాల వరకు పంగెడిగూడెం మీదుగానే వెళ్ళాలి. అందులో, పండితులైనవారు శ్రీరాజావారిని దర్శించి, ఎన్నో విధాల కీర్తించి, వారి వద్ద నుంచి ఎన్నో బహూమానాలను తీసుకొని పోతూ ఉండేవారు.

ఆ రోజుల్లో అది ఒక చిన్న కృష్ణదేవరాయల ఆస్థానంలా ఉండేది. దసరా ఉత్సవాలను చూడాలంటే మైసూరు తర్వాత పంగెడి గూడెమే అని ప్రజలు చెప్పుకొనే వారు. ఇక కనకయ్య పంతులుగారి ఆధ్వర్యంలో నాటకాలకు, వినోదప్రహసనాలకు లోపం ఉండేది కాదు.

డాక్టరు ఖాను శ్రావ్యంగా పాడేవాడు కూడ. రాజావారు, రాణీవారు, వారి కుటుంబ సభ్యులు చాల సరసులు, సహృదయులు. తోచినప్పుడెల్లా వారు ఆయనకు కబురు చేసి, ఆయనచేత రుక్మిణీ కళ్యాణంలోని పద్యాలు పాడించుకొంటూ, ఎన్నో బహుమతులు ఇస్తూ ఉండేవారు. అందు బంగినపల్లి మామిడిపళ్లూ, బత్తాయి నారింజపండ్లూ వంటి ఆయాకాలోపలబ్ధాలైన ఫలాలే ఎక్కువగా ఉంటూ ఉండేవి.

తనకు సంగీతం, సాహిత్యం, నాట్యం, శిల్పం, ఆశుకవిత, తెలుగు ఇంగ్లీషు భాషల్లో ప్రవేశం – మానవ జీవితం ఉత్తేజకరంగా సాగడానికి అవసరమైన అన్ని విద్యలూ, తనలో బీజప్రాయంగానైనా అవాపితాలై ఉన్నాయంటే, అందుకు కారణం కనకయ్య పంతులుగారి శుశ్రూషా, అక్కడ అమృత వాతావరణమూ – అంటాడు డాక్టరు ఖాను.

కనకయ్య పంతులుగారు విద్వత్తులోనూ, విద్యాబోధనలోనూ ఎంత గట్టివాడో, అంత స్వాతంత్ర్య ప్రవృత్తీ, ఆత్మాభిమానమూ కలవాడు.

ఒకసారి ఆయన పాఠం చెపుతూ, రాజావారికి సంబంధించిన ఒక పిల్లవాణ్ని బెత్తంతో కొట్టాడు. ఆ విషయం రాజావారికి తెలిసింది. రాజావారు ఆయన్ని పిలిపించారు. ఆ పిల్లవాడు పాఠాలు చదవటం లేదనీ, మందలించక తప్పలేదనీ పంతులుగారు అన్నారు. అయినా సరే పిల్లల్ని కొట్టకూడదన్నారు రాజావారు.

"అయ్యా ! విద్య చెప్పేటప్పుడు నా పద్ధతి నేను అనుసరిస్తాను. తెలివి తేటలు రకరకాలుగా ఉంటాయి. ఒకొక్క విద్యార్థి పట్ల ఒకొక్క విధానాన్ని ఉపాధ్యాయుడు అనుసరించ వలసి ఉంటుంది. వాత్సల్యం హృదయంలో ఉండవలసినట్టిది. విద్యను బోధించే వేళ కొంత కాఠిన్యం ప్రదర్శింపక తప్పదని నా ఉద్దేశం. లేకపోతే, సరైన శిక్షణ లేక పిల్లలు చెడిపోతారు. పిల్లల పట్ల విద్యకు సంబంధించినంత వరకు గారాబం పనికి రాదు. మీరు ఇలా కలుగ చేసుకుంటే, గురువుగా నా కర్తవ్యాన్ని నిర్వహించలేను" అంటూ పంతులుగారు ఆ బెత్తాన్ని రాజావారి ఎదుట ఉంచేసి, నమస్కారం చేసి, వెళ్ళిపోయారు, మళ్ళీ కనిపించలేదు. ఆయన కోసం రాజావారు ఎంత వెదికించినా, ఫలితం లేకపోయింది.

అది ఆనాటి ఉపాధ్యాయుల ఆత్మ గౌరవస్థాయి. జీతం కోసం, జీవితంకోసం తాపత్రయ పడటమే ఎరుగరు వారు. తమలో ఉన్న విద్యను ఎదుట వారిలో ప్రవేశపెట్టడం ఒక్కటే వారి లక్ష్యం. తమ శిష్యులు తమంత వారు కావాలన్నది ఒక్కటే వారి ధ్యేయం.

అందుకే ఆ రోజుల్లో సమాజంలో ప్రథమస్థానం ఉపాధ్యాయుడికే ఉండేది. విద్యార్థులలో అప్రతిమానమైన క్రమశిక్షణ ఉండేది. పాఠశాలల్లో సరస్వతి తాండవించేది. ఆనాటి ఉన్నతశ్రేణి శిక్షణ విధానం దిగజారి పోవడం వల్లనే ఈనాడు ఉపాధ్యాయుల గౌరవం, విద్యార్థుల తెలివితేటలు. క్రమశిక్షణ స్థాయి కూడ దిగజారి పోయింది.

భయభక్తులు లేని చోట విద్య అబ్బదు. విద్య అబ్బని చోట క్రమశిక్షణ ఉండదు. క్రమశిక్షణ లేని జాతి వట్టి జీవచ్ఛవం మాత్రమే.

ఈనాటి విద్యావిధానాన్ని పరిశీలించి చూస్తే – మిషనరీ స్కూళ్లలో ఉన్నంత ఉన్నతస్థాయిలో విద్య గవర్నమెంటు స్కూళ్ళలో ఉండటం లేదు. కారణం ఏమిటి ?

6–12 సంవత్సరాల మధ్య కుర్రవాళ్ళను విద్యకు అభిముఖులను చెయ్యడం కోసం ఉపాధ్యాయులు తమ శక్తిసామర్థ్యాలతో పాటు బెత్తాన్ని కూడ ఉపయోగించే వారు పూర్వం. ఆ వయస్సులోని కుర్రవాళ్ళకు భయమూ, భక్తీ రెండూ అవసరమే. ఇంటివద్ద తల్లిదండ్రులు, స్కూళ్ళలో గురువులు వాటిని ఉపయోగించి, బాలకుల్ని క్రమశిక్షణ కల నియమబద్ధులైన యువకులుగా తయారు చేసేవారు.

ఈనాడు వాటి స్థానంలో కఠినమైన నియమ నిబంధనలను అమలు పరచటం ద్వారాను, అట్టి ప్రతిభ కల ఉపాధ్యాయులను ఎంచుకోవడం ద్వారాను ఉన్నతశ్రేణి విద్యా ప్రబోధాన్ని మిషనరీ స్కూళ్ళు సాధించగలుగుతున్నాయి.

అట్టిది లేని మామూలు పాఠశాలల్లో కనీసం బెత్తాన్ని అయినా తిరిగి ప్రవేశపెట్టకపోతే, ఏం మిగిలేటట్టు ? పన్నెండు సంవత్సరాల లోపు పిల్లలకు బెత్తమే సరస్వతీ స్వరూపం కాదా ?

ఆరు-పన్నెండు సంవత్సరాల మధ్య కుర్రవాళ్ళని కేవలం సేవకులుగా చూడమని మన ధర్మ శాస్త్రాలు చెపుతున్నాయి. ఈ నాటి విద్యార్థి లోకంలో అవిద్య, అవిధేయత, అశిక్షణ ఇంత ఘోరంగా అలుముకొని ఉండడానికి హేతువు బహుశా ఈ ప్రాథమిక సత్యాన్ని గుర్తించక పోవడమే నేమో ! పవిత్ర విద్యా పీఠాలను ఆక్రమించుకొని కూర్చున్న పెద్దలు రాజకీయ స్వార్థాలకు, పదవీ వ్యామోహాలకు బానిసలుగా తయారై పోవడమే నేమో !

★★★

## 19. ఒక్క నెలలో రెండు క్లాసులు !

కనకయ్య పంతులుగారు వెళ్ళి పోవటంతో కోటలో విద్య కుంటుపడి - చదువు కోసం ఏలూరు పోవలసి వచ్చింది డాక్టరు ఖాను. అక్కడ 1932-33 సంవత్సరంలో, మునిసిపల్ హైస్కూలులో ఫస్ట్ ఫారంలో చేరాడాయన.

అక్షరాభ్యాసం తెలుగులో జరగడం వల్ల, తెలుగు భాషలో నిష్ణాతుడైన వ్యక్తి ఉపాధ్యాయుడుగా ఉండడం వల్ల తెలుగు భాష బాగానే వచ్చింది డాక్టరు ఖానుకు. కోటలోని లైబ్రరీలో లభించే భారత రామాయణ భాగవతాది గ్రంథాలు తరచు చదువుతూ దాన్ని మరింత అభివృద్ధి చేసుకొన్నా డాయన. తెలుగుతోపాటు కనకయ్య పంతులుగారే ఇంగ్లీషు కూడా చెప్పేవారు. అందుకే డాక్టరు ఖానుకు తెలుగు, ఇంగ్లీషు వచ్చినంతగా ఉరుదు భాష రాదు.

పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకూ కోటలోనే ఉండడం వల్ల, బయట ప్రపంచం గురించే తెలియదు ఖానుకు. అన్ని సౌకర్యాలూ, వినోదాలూ, ఆటపాటలూ – అన్నీ కోట గోడల మధ్యే జరిగిపోయేవి. కోట గుమ్మం వద్ద విచ్చు కత్తుల పహరా ఉండేది. కోట దాటి బయటకు వచ్చే అవకాశమే లేదు. అవసరమూ లేదు. తాను చదువు కోసం ఏలూరు బయలుదేరే వరకూ, తన ఆ పన్నెండేండ్ల బాల జీవితం ఒక "ఎ" క్లాస్ ఖైదీలా గడిచిందంటా డాయన.

కోట దాటి బయట ప్రపంచంలో అడుగు పెట్టగానే, ఒక నూతన ప్రపంచంలో అడుగుపెట్టి నట్టనిపించిం దాయన కాక్షణం. రోడ్లు, బళ్ళు, ఎంతో మంది మనుష్యులు, విశాలమైన పొలాలు, పెద్ద పెద్ద స్కూళ్ళు, అంగళ్ళు, హోటళ్ళు – అపూర్వమైన ఒక వింత అనుభూతిని, హాయిని కలిగించినై ఆయనకు. ఆయన ఫస్ట్ ఫారం చదువు నల్లేరు మీద బండిలా నడవసాగింది.

స్కూల్లో చేరిన ఒక మాసం రోజుల్లోనే అక్కడ జరిగిన ఒక విశేషాన్ని గురించి ఎంతో సంతోషంతో చెపుతూ ఉంటాడు డాక్టరు ఖాను.

ఒక రోజున హఠాత్తుగా హెడ్ మాష్టరుగారు వాళ్ళ క్లాసు లోకి వచ్చి ప్రశ్నలు వేశారట ! ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడ డాక్టరు ఖాను మంచి ఘటికుడుగానే కనిపించాడు ఆయనకు. హెడ్ మాష్టారు ఇంగ్లీషులో కొన్ని ప్రశ్నలు అడిగిన మీదట, చాలా మెచ్చుకొని "ఇంగ్లీషులో దిట్టంగానే ఉన్నాడు. తెలుగులో ఎలా ఉన్నాడో చూడండి" అంటూ తెలుగు మాష్టారు కేసి చూశాడు. తెలుగు మాష్టారికి ఈ కుర్ర వాని సంగతి అంతకుముందే తెలుసు గనుక, ఒక పద్యం చదివి, దాన్ని వివరించ మన్నాడు.

*ఇలలో ఇద్దరు రాజులు*
*మలయుచు చదరంగ మాడి, మాపటి వేళన్*
*బలమెత్త మరచి పోయిన,*
*ఎలుకలు తమ కలుగులోని కేనుగ నీడ్చెన్.*

ఈ పద్యాన్ని విని, దానికి అర్థం చెప్పమన్నట్టు చూశాడు క్లాసు పిల్లలందరి

వైపు హెడ్మాష్టారు. ఎవరూ సరైన సమాధానం చెప్పలేదు.

అసలే అది ఫస్ట్ ఫారం క్లాసు. చదరంగం ఆటను చూచిన వాళ్ళు గానీ, కనీసం వినిన వాళ్ళు గానీ ఆ క్లాసులో ఉండి ఉండరు. ఉన్నా, పద్యం అర్థమై ఉండదు. కోటలో నిత్యమూ చదరంగం ఆటను చూస్తూ ఉండేవాడు కనుకనూ - పద్యాలనూ, సమస్యలనూ ఎరిగి ఉన్న వాడు గనుకనూ - డాక్టరు ఖాను తనకున్న పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ పద్యాన్ని మంచి నీళ్ళ ప్రాయంగా వివరించాడు.

హెడ్ మాష్టారు ఎంతో సంతోషించారు. ఆ వెంటనే ఆయన్ను ఫస్ట్‌ఫారం నుండి సెకండు ఫారంకు ప్రమోట్ చేశారు.

ఒక నెలలోనే రెండు క్లాసులు !

శ్రేణికి మించిన తెలివితేటలు కనబరచే పిల్లలకు డబుల్ ప్రమోషన్లూ, ట్రిబుల్ ప్రమోషన్లూ కూడా ఉండేవి ఆ రోజుల్లో.

విద్యకూ, విద్యార్థులకు మంచి రోజులవి. మెరిట్‌ను గుర్తించి గౌరవించే వారు గనుకనే ఆనాడంత ఉన్నత స్థాయిలో ఉండేది విద్య. విద్యను బట్టి వృత్తి నైపుణ్యం, వృత్తి నైపుణ్యాన్ని బట్టి విశ్వప్రశస్తి !

ఏలూరులో ఆయన చదువంతా ఇలాంటి ఎన్నో చమత్కారాలతోనే నిండి ఉండేది. పిట్టకొంచం కూత ఘనం అన్న సామెతను అడుగడుగునా రుజువు పరుస్తూ ఉండేవాడు ఆయన.

ఒక రోజు తండ్రి గారితో ఒక సభకు వెళ్ళాడాయన. ఏలూరు మునిసిపాల్టీకి చైర్‌మెన్‌గా ఉన్న మోతే నరసింహరావు గారికి రావు బహదూర్ బిరుదు ఇచ్చింది ప్రభుత్వం. ఆ సందర్భంలో పట్టణంలో ఉన్న పెద్దలంతా ఆయనకు సన్మానసభ ఏర్పాటు చేశారు. అదీ ఆ సభ.

పెద్దలంతా ఉపన్యాసాలు ఇచ్చారు. కవులు పద్యాలు చదివారు. అదంతా చూస్తూ ఉన్న డాక్టరు ఖాను ఒక చిన్న కాగితం మీద తాను కూడా రెండు పద్యాలు వ్రాసి, ఎవరి అనుమతీ పుచ్చుకోకుండానే వేదిక ఎక్కి, నరసింహరావుగారి ప్రక్కన నిలబడి, గబగబా చదివేశాడు.

అంత చిన్నవాడు, ముస్లిం కుర్రవాడు, తెలుగు పద్యాలు వ్రాయడమే కాక, ధైర్యంగా వేదిక ఎక్కి, అంత శ్రావ్యంగా చదవడం !

సభంతా విస్తుపోయింది.

అప్పటికి పంగెడిగూడెం నుంచి వచ్చేసి, భీమడోలు స్కూలులో ఉపాధ్యాయుడుగా ఉంటున్న కనకయ్య పంతులు గారు, తన శిష్యుని ప్రతిభా వికాసాన్ని చూచి ఎంతో మురిసిపోయారు.

ఆ రోజుల్లోనే డాక్టరు ఖాను ప్రదర్శించిన ప్రతిభా విశేషాలలో ముఖ్యమైన మరొకటి – బియ్యపు గింజ మీద అక్షరాలు వ్రాయడం. అత్యద్భుతమైన ప్రక్రియ ఇది. ఎంతో నైపుణ్యం, హస్త సౌకుమార్యం, లాఘవం, దీక్ష, సహనం అవసరమైన విద్య ఇది. ఈ పనితనం ద్వారా ఉపాధ్యాయు లందరికీ అభిమాన పాత్రుడయ్యాడాయన.

చక్కని బియ్యపు గింజల మీద ఆనాటి జమీందార్ల పేర్లు, వదాన్యులైన పెద్దల పేర్లు వ్రాసి, వారికి వాటిని బహూకరిస్తూ ఉండేవాడు. అందుకు ప్రతిఫలంగా వారు ఆయనకు సన్మానాలు చేస్తూ ఉండేవారు. ధనరూపం గానూ, వస్తు రూపం గానూ ఎన్నో బహుమతులు ఇస్తూ ఉండేవారు. అర్థ నూట పదహార్లను కూడ ఇచ్చేవారు. ఆ కాలంలో అర్థ నూట పదహార్లు అంటే ఈ కాలంలో వెయ్యి న్నూట పదహార్లే.

★★★

## ౨౦. గాంధీజీ - జాతీయతా బీజం

ఏలూరులో డాక్టరు ఖాను మూడవ ఫారం చదువుతున్న సమయంలోనే గాంధీజీని చూచే అదృష్టం ఆయనకు పట్టింది.

1934లో గాంధీజీ ఆంధ్రదేశంలో పర్యటిస్తూ ఏలూరు వచ్చారు. ఆయన రావడానికి కొద్ది రోజులు ముందు నుంచే, ఆయనకు స్వాగతం చెప్పే నిమిత్తం ఏలూరు పట్టణం అంతా సమాయత్తం కాసాగింది. హైస్కూలు లోని విద్యార్థులలో

ఉత్సాహం పరవళ్ళు త్రొక్కసాగింది. స్కౌట్ మాష్టారు జోశ్యుల వెంకటరావుగారు స్కౌట్లను తయారు చేస్తున్నారు. స్కౌట్లలో చాలా ఉత్సాహవంతులైన కుర్రవాళ్ళలో డాక్టరు ఖాను ప్రథముడైనాడు.

గాంధీజీ వచ్చినప్పుడు, జనం తోసుకు వచ్చి ఆయన మీద పడకుండా ఎలా అరికట్టాలో, ఆయన చుట్టూ ఎలా రక్షణ కలిపించాలో ఆయన కారు వెంట ఎలా ఉండాలో, కారు దిగినప్పుడు, ఎక్కినప్పుడు, ప్రయాణం చేస్తున్నప్పుడు, సభల్లో ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు ఏ ఏ స్థానాల్లో ఉండి ఏయే విధంగా ప్రవర్తించ వలసి ఉంటుందో – ఆ పద్ధతు లన్నిటిలోనూ క్షుణ్ణంగా బాల భటు లందరికీ తరిఫీదు ఇచ్చారు వెంకటరావు గారు.

గాంధీజీ ఏలూరులో ఉన్నంతసేపూ ఆయన్ని అంటి ఉండవలసిన బాలభట దళానికి డాక్టరు ఖాను నాయకు డైనాడు.

దేశమంతా అరాధించే గాంధీమహాత్ముణ్ని అంత సన్నిహితంగా చూచే భాగ్యం తనకు లభించినందుకు ఎంతో ఉప్పొంగిపోయాడు ఆయన. ఆయన బాల హృదయం ఎగిరి గంతులు వేసింది.

పట్టణమంతా అలంకరించబడింది. కాంగ్రెసు సంస్థవారు పెద్ద ఎత్తున స్వాగత సన్నాహాలు చేస్తున్నారు. దూరగ్రామాల నుంచి వచ్చే అశేష ప్రజానీకానికి జాతిపితను దర్శించుకునే మహాభాగ్యం సులభ సాధ్యం అయ్యేలా సకల సౌకర్యాలు ఏర్పాటు చేయబడినై.

గాంధీజీ అనుకొన్న రోజున అనుకొన్న వేళకే ఏలూరు స్టేషన్ దిగారు కాని, వారి రక్షణ కోసం స్కౌట్ మాష్టారు చెయ్యాలనుకుందల్లా వ్యర్థమే అయింది.

రక్షణ ఏర్పాటులన్నీ పోలీసువారే చేశారు. కాంగ్రెసు వాలంటరీలు ఉండనే ఉన్నారు. అందువల్ల హైస్కూళ్ళ బాలభటుల అవసరం లేకుండానే పోయింది.

అయితే... గాంధీజీ ఊరేగింపులో, రోడ్డు పొడుగునా ఇసక వేస్తే రాలనట్టున్న జనం, తోసుకొచ్చి కారు మీద పడకుండా ఆయన కారు మడ్‌గార్డు మీద ఇటొక బాల భటుణ్ని, అటొక బాల భటుణ్ని పెట్టారు. అందులో డాక్టరు ఖాను ఒకడైనాడు.

జీవితంలో తనకు పట్టిన గొప్ప అదృష్టాలలో ఆనాడు తనకు లభించిన ఆ అవకాశం ఎంతో ప్రధానమైన దంటాడు ఆయన.

"ఆ వేళ సాయంత్రం, గాంధిజీ ఊరేగింపు ఆయన కోసం ఏర్పాటు చేసిన బంగాళాకు చేరేసరికి చీకటి పడింది. వెంటనే ఆయన ప్రార్థనలో కూర్చున్నాడు. "ఈశ్వర్ అల్లా తేరేనాం. సబ్‌కో సన్మతిదే భగవాన్" అంటూ. అక్కడ సమావేశమైన జన సమూహమే కాక, దశ దిశలు కూడా ఆయనతో కలసి గొంతెత్తి పాడినై. ఆ వాతావరణం ఎంతో దివ్యంగా, ఆనందకరంగా ఉంది. ప్రార్థన అయేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. మమ్మల్ని అందర్నీ ఇళ్ళకు పొమ్మన్నారు.

"ఇంటికి వెళ్ళానన్న మాటే గాని, మనస్సంతా గాంధీజీ పైనే ఉండిపోయింది. ఆ ముఖం, ఆ చిరునవ్వు, ఆ చూపులు, ఆ తేజస్సు, ఆ మాటలు, ఆ ప్రసంగంలో ఉండే తీవ్రత, ఆ ఊరేగింపు, ఆ జనం... వీటితోనే నిండి ఉంది నా మనస్సు. రాత్రంతా ఆవే స్వప్నాలు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు మళ్ళీ ఆ మహాత్ముని సాన్నిధ్యం లభిస్తుందా అన్న ఉద్రేకభావం తోనే గడచిపోయిందా రాత్రి.

"ఇంకా తెల్లవారకుండానే లేచి, కాలకృత్యాలు ముగించి, యూనీఫారం ధరించి, హోటల్‌లో టిఫిన్ తిని, గాంధీజీ మకాం చేరుకొన్నాను. స్కౌటును గనుక, గాంధీజీ సన్నిధిలో ఉండటానికి నాకు ఎలాంటి అభ్యంతరం ఏర్పడలేదు.

"నేను ఆయన దగ్గరకు వెళ్ళేటప్పటికి ఆయన ఒళ్ళు పట్టించుకొంటున్నారు. ఎవరో ఇద్దరు వ్యక్తులు ఆ ఉదయం వచ్చిన పత్రికలను ముందువేసుకొని, ఒక్కొక్కటే తీసి వార్తలు చదివి వినిపిస్తున్నారు. పట్టణంలో ఉన్న పెద్దలు, ఆ ప్రాంతాల నాయకులు ఒక్కొక్కరే వచ్చి మాట్లాడి వెళుతున్నారు. ఈ పనులన్నీ ఏక కాలంలోనే జరిగిపోతున్నాయి. ఒకేసారి ఇన్ని పనులు చేస్తూ కూడా, గాంధీజీ ఒళ్ళు పట్టించు కొంటునే ఉన్నారు. రాట్నం వడుకుతూనే ఉన్నారు. ఒక ప్రక్కన పెద్దలతో మాట్లాడు తూనే ఉన్నారు. మరోప్రక్క వార్తలు వింటూ ఉన్నారు. నిజంగా ఆయన మూర్తీ భవించిన సమగ్రకృషి! దేశ మాతకు విదేశీ దాస్యం నుంచి విముక్తి కలిగించడానికి అవతరించిన భగవంతుడు అంటాడు డాక్టరు ఖాను – ఆనాటి సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకొంటూ!

గాంధీజీ మీద అపరిమితమైన భక్తి గౌరవాలు ఏర్పడటానికి, బ్రిటిష్

పాలకుల మీద ద్వేషభావం కలగడానికి, దేశదాస్య విమోచన పోరాటంలో తాను ప్రవేశిం చటా ి అప్పటి సన్నివేశం తనకెంతో తోడ్పడిం దంటాడాయన.

ఆనాటి నుంచి ధృఢమైన జాతీయవాదిగా మారి పోయాడు డాక్టరు ఖాను.

అంతకు ముందు నుంచే ఈ జాతీయతా బీజం ఆయనలో ఉంది. 1923 ప్రాంతంలో కాకి ఃడలో జరిగిన ఖిలాఫత్ మీటింగులకు ఆయన తండ్రిగారు హాజరై నారట. షౌకతాలీ, ుహమ్మదాలీ మొదలైన నాయకుల ఉపన్యాసాలన్నీ అవగాహన చేసుకున్నారట. ఆ సిషయాలన్నీ తండ్రిగారి దగ్గర నుంచి డాక్టరు ఖాను వింటూ ఉండేవాడట. తనలో భక్తిబీజం బాగా నాటుకోవడానికి అవన్నీ తోడ్పడ్డాయి అంటాడు ఆయన.

ఆ తర్వాత జరిగిన జాతీయ యువకవీరుల పోరాట గాథలు – ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు తిరుగుబాటు ఉదంతం, కాకినాడ బాంబు కేసు, భగత్ సింగ్ ప్రభృతుల చరిత్ర ... ఇవన్నీ తన నెత్తురు వీరోచితం చేశాయంటా డాయన.

★★★

## 21. కళా వెంకటరావు కాంగ్రెసుతో తొలి పరిచయం

1937లో తాను అనాతవరం (అమలాపురం)లో ఉంటున్నప్పుడు తొలిసారిగా కాంగ్రెసు రాజకీయ రంగంలో ప్రవేశించాడు డాక్టరు ఖాను.

ఆ సంవత్సరం లోనే బ్రిటిష్‌వారి క్రొత్త రాజ్యాంగం క్రింద తొలిసారిగా ఎన్నికలు జరిగినై.

అప్పటికి రాష్ట్రంలో జస్టిస్ పార్టీ అధికారంలో ఉంది. భారతీయ కాంగ్రెసు సంస్థ ఒక రాజకీయ పార్టీగా ఎన్నికలలో పోటీ చెయ్యడానికి అదే ప్రారంభం.

పిఠాపురం రాజావారి నాయకత్వంతో అప్పుడే పుట్టిన పీపుల్సు పార్టీ కూడా ఎన్నికలలో పోటీ చెయ్యడానికి పూనుకొంది. ఆ ఎన్నికలలో ప్రజల దృష్టిని ఆకర్షించిన ప్రధాన నియోజక వర్గాలలో అమలాపురం ఒకటి. అక్కడ కాంగ్రెసు తరఫున కళా

వెంకటరావుగారు, పీపుల్సు పార్టీ తరపున పిఠాపురం యువరాజావారు పోటీ చేశారు. పీపుల్సు పార్టీ డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు పెట్టింది. లక్షలు తగలేసింది. ఆ డబ్బంతా మధ్యవర్తుల జేబులలోకి పోయింది. ప్రజల దాకా రాలేదు. అది వేరే కథ. ప్రజలు మాత్రం దేశభక్తి పూరితులై, తుఫానులోని మహా సముద్రంలా ఉద్రిక్తులై ఊగిపోయారు.

ఒక ప్రక్క తన సమస్తాన్నీ హరిజనోద్ధరణ కోసం, హరిజన బాల బాలికల విద్యాభివృద్ధి కోసం, అనదల కోసం, అబలల కోసం త్యాగం చేసిన పిఠాపురం మహారాజా !

మరో ప్రక్క దేశ దాస్య విముక్తి కోసం, హరిజనాభ్యుదయం కోసం తమ సమస్తాన్నీ త్యాగం చేసి పోరాడుతున్న కాంగ్రెసు నేత గాంధీజీ !

ఒక ప్రక్క స్థానికమైన వ్యక్తిగత భక్తి.

మరొక ప్రక్క సార్వజనికమైన దేశభక్తి.

అమలాపురం నియోజక వర్గం జయాపజయాల మధ్య అల్లల్లాడి పోయిన సమయ మది.

అలాంటి కల్లోల పరిస్థితిలో, తన మనస్సు నిండా గాంధీజీ దివ్య మూర్తిని నింపుకొని ఉన్న డాక్టర్ ఖాను – అప్పటికి 20 ఏండ్ల కుర్రవాడు – కళ్ళు మూసుకొని ఎన్నికల యజ్ఞంలోకి దూకాడు. కాంగ్రెసు జండా పట్టుకొని, కళా వెంకటరావుగారి ప్రక్కన నిలబడ్డాడు.

వెంకటరావుగారి బావమరది బాబయ్యగారి ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కోసం వాలంటరీ దళాలు నిర్మించబడ్డాయి. అందులో చాలా చురుకు గానూ, ప్రముఖం గానూ పనిచేసిన యువకుల్లో డాక్టరు ఖాను ఒకడు. ఆయనకు అప్పటికే సర్వరోగ నివారణ డాక్టరుగా ముస్లింల లోనూ, సాధారణ ప్రజల లోనూ పేరు ప్రఖ్యాతు లున్నాయి. ఆ పలుకుబడి ఈ ఎన్నికలలో కాంగ్రెసుకు బాగా ఉపయోగపడింది.

ఆంధ్ర కాంగ్రెసుకు అఖిల భారత నాయకత్వం సాధించటమే కాక, బ్రిటిష్

పార్లమెంటుకు కూడా గుండె తల్లడం గావించిన ఒక మహా విప్లవకారుడు కళా వెంకటరావు అంటే !

ఆగష్టు విప్లవ సమయంలో ఆంధ్ర సర్క్యులర్‌కు జనకుడై అఖిల భారత విప్లవాన్ని రెచ్చగొట్టిన వాడాయన. విప్లవశక్తి ఆయనకు పుట్టుకతోనే వచ్చింది. అత్యంత క్లిష్ట సమయంలో జెండా పట్టుకొని ఆయన ప్రక్కన నిలబడి, ఆయన ఆశీర్వాదం పొందగలిగాడు డాక్టరు ఖాను. గొప్ప మెజార్టీతో కాంగ్రెసు గెలిచిం దక్కడ.

ఈ ఎన్నికలలో - రాష్ట్రం మొత్తం మీద ప్రకటించబడిన తొలి ఫలితం, పోటీ లేకుండా తూర్పు గోదావరి నుంచి వచ్చిందే. అది కాంగ్రెసుకే లభించింది. అలా గెలిచిన వాడు బి.యస్. మూర్తి. హరిజన అగ్రనాయకులలో ఒకడాయన. ఆయన వెన్ను చలవగా, తదుపరి వచ్చి ఫలితాలన్నీ మొత్తం మీద కాంగ్రెసుకే లభించాయి. హోరా హోరి పోరాటంలో అఖండ విజయాన్ని సాధించినవాడు కళా వెంకటరావు.

డాక్టరు ఖానులో జాతీయ భావం, కాంగ్రెసు పట్ల విశ్వాసం పెరిగి పెద్దదిగా వికసించటానికి ఈ ఎన్నికలు చాలా వరకు తోడ్పడ్డాయి.

కళా వెంకటరావు గారికి ప్రచారం చెయ్యడం కోసం అమలాపురం వచ్చిన జాతీయ నాయకులలో శ్రీమతి సరోజనీనాయుడు ఒకరు. అక్కడ ఆమె ఉపన్యాసం తనను ఎంత ఉత్తేజ పరచిందో డాక్టరు ఖాను చెపుతుంటేనే వినాలి.

"కాంగ్రెసు దేశానికి జీవగఱ్ఱ. కాంగ్రెసు ద్వారానే దేశానికి ముక్తి. ప్రతి వ్యక్తీ తన జీవితాన్ని కాంగ్రెసుకు ముడి పెట్టుకొన్న నాడే దేశానికి అభ్యుదయం" అంటూ ఆవిడ చేసిన ఉద్ఘాటన ఈ నాటికీ తన హృదయంలో ఖంగు మంటూనే ఉంటుం దంటా డాయన.

ఆ తర్వాత కొద్ది రోజులకే అనాతవరం విడిచిపెట్టి, విజయనగరం వెళ్ళి పోయాడు డాక్టరు ఖాను.

★★★

## 22. తల్లులు - సవతి తల్లులు

ఎంతో ఉజ్జ్వలంగా, ఎంతో ఉన్నత స్థితికి పోవలసినంత శక్తివంతంగా ప్రారంభమైన ఆయన విద్యార్థి జీవితం ఛిన్నా భిన్నమై, ఆయనను ఏలూరు నుంచి అనాత వరానికి విసిరేసిన పరిస్థితి చాలా దయనీయ మైనట్టిది. అది ఆయన కుటుంబంలో ఏర్పడ్డ ఒక కల్లోల పరంపర.

పంగెడిగూడెం రాజావారి కోటలో ఉన్నంతకాలం బయట ప్రపంచం ఎలా ఉంటుందో, కష్టాలంటే ఏమిటో ఎరగడు. పెద్దాపురంలో భోగిగా పుట్టాడు. సిరిసంపదల మధ్య శైశవాన్ని గడిపాడు. మాతృ మరణానంతరం పంగెడిగూడెంలో రాజావారి కోటలో రాజాలా పెరిగాడు. పన్నెండేండ్ల వయస్సు వచ్చేవరకు బాల్యం యావత్తూ 'సర్కార్' అనే తన పేరును సార్థకం చేసుకొంటూ ఒక రాజకుమారుడులా సర్వ సుఖాలూ అనుభవించాడు.

లోకాన్ని ఆయన చూచింది ఏలూరు వచ్చిన తర్వాతనే. లోకంలో ఉండే కామ క్రోధాదుల్ని, బాధను, దుఃఖాన్ని రుచి చూచింది మాత్రం ఆయనకు రెండవ సవతి తల్లి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ఆవిడకు బిడ్డలు కలిగిన తర్వాత.

డాక్టరు ఖాను తండ్రి గారి రెండవ భార్య చాల గర్విష్ఠి. సవతి కొడుకైన ఖానునే కాదు, భర్తను కూడా లక్ష్యం చేసేది కాదు ఆమె. ఆ తర్వాత ఆ భర్త సుఖాన్నీ, శాంతినీ అన్వేషిస్తూ దఫదఫాలుగా భార్య మీద భార్యగా ముగ్గురు భార్యల వరకూ చేసుకోవలసి వచ్చింది. అయినా ఆయన కోరిన సుఖ శాంతులు లభించలేదు. అవి తొలిభార్య తోనే పోయినై. డాక్టరు ఖాను ఎక్కువగా బాధపడత రెండవ సవతి తల్లి చేతిలో.

అంతవరకూ తనకు ఏం కావాలో, ఏం అక్కర లేదో తెలియని దర్జాలో బ్రతి కాడు డాక్టరు ఖాను. అన్ని సౌకర్యాలు తన అభిరుచి తగ్గట్టు ఎప్పటి కప్పుడు ఎక్కడివి అక్కడ అమర్చి పెట్టబడి ఉండేవి. ఆ సవతి తల్లి వచ్చిన తర్వాత అవన్నీ అదృశ్యమై పోయాయి. ఇంట్లో పెత్తనమంతా ఆమెదే. ఇంట్లో పనిచేసే నౌకర్లు, చాకర్లు కూడా ఆమె మాటకు బద్ధులు. తన మాట వినే వాళ్ళు ఒకరూ లేరు.

తనకేది కావలసి వచ్చినా తండ్రిగారిని అడిగే అలవాటు లేదు. తండ్రి ఎదుట నిలబడి మాట్లాడటానికే భయం. ప్రతిదానికీ, స్కూలు జీతంతో సహా మారు తల్లినే అడగాలి. ఆమె ఆయన్ను గడ్డిపరక కంటే హీనంగా చూచేది. తిండి పెట్టేది కాదు. బట్టలు కుట్టించేది కాదు. స్కూలుకు జీతం కూడా కట్టేది కాదు. అందువల్ల ప్రతినెలా జీతం జరిమానాలతో కట్టవలసి వచ్చేది. చాలా సార్లు ఆయన పేరు హాజరు పట్టిలో కొట్టివేయబడి ఉండేది. జరిమానాతో జీతంకట్టి పేరు మళ్ళీ వ్రాయించు కోవలసి వచ్చేది.

ఏలూరులో డాక్టరు ఖాను చదివే హైస్కూలు ఇంటికి మూడు మైళ్ళ దూరంలో ఉండేది. ఇల్లు పెంషను లైనులో ఉండేది. మారుతల్లి బిడ్డలు చదువుతున్న చిన్న స్కూలు ఇంటికి సమీపంలోనే ఉంది. అయినా, ఇంట్లో ఉన్న నౌకర్లు అందరూ ఆవిడ బిడ్డల సేవలోనే మునిగి ఉండేవారు. ఆయనకు భోజనం కూడా తీసుకొని వెళ్ళేవారు కాదు.

పరిస్థితి ఎంత వరకు దిగజారిందంటే, ఇంటి నౌకర్లు తన మాట వినకపోగా, వాళ్ళకు పురమాయించబడ్డ పనుల్ని కూడ ఆయనకు చెప్పి ఆయన చేత చేయించుకునే వాళ్ళు. తన నౌకర్లకే తాను నౌకరు కావలసిన దుస్థితి ఏర్పడ్డ దాయనకు ఆ ఇంట్లో.

ఈ కష్టాలు కొద్ది కొద్దిగా పంగెడిగూడెం లోనే ప్రారంభమైనా, ఏలూరు వచ్చిన తర్వాత రాక్షస స్వరూపం దాల్చి జీవితాన్ని దుర్భరం చేసివేసినై.

తల్లిదండ్రుల ప్రేమ కరువై పోగా, చిన్ననాటి గారాబం క్షీణించి పోగా, తిండికి కూడా నౌకర్ల మీద, వంట వాళ్ళ మీద ఆధారపడవలసి వచ్చింది. రెండవ సవతి తల్లే కాక, ఆమెతో కలసి మూడవ సవతి తల్లి కూడా బాధనే కలిగించింది.

అయితే, ఇంట్లో ఎంత దైన్యాన్ని అనుభవిస్తున్నాడో అంత దైన్యాన్ని బయట కూడా అనుభవిస్తున్నాడని కాదు.

ఇంట్లో దైన్యం సహజమైంది కాదు. అది దారిద్ర్యం వల్ల వచ్చింది కాదు. సవతి తల్లులలోని కారుణ్య దారిద్ర్యం వల్ల, మానవత్వ దారిద్ర్యం వల్ల ఏర్పడినట్టిది. ఆయన తండ్రి భార్యా దాసుడు కావటం వల్ల ఏర్పడినట్టిది.

నిజానికి పిల్లల్ని కన్నంత మాత్రం చేత ఏ తల్లీ తల్లి కాబోదు. తన పిల్లల వలెనే ఇతర స్త్రీల పిల్లలను కూడా చూడగలిగిన స్త్రీయే నిజమైన తల్లి. తన పిల్లలకు మాత్రమే పెట్టుకొంటూ, ఎదుటి పిల్లల కడుపు మాడ్చే తల్లి గొడ్రాలి కంటే హీనురాలు.

పురుషుడి విషయంలో కూడా అంతే. మొదటి భార్య మీద ప్రేమకు, ఆమె సంతానం మీద వాత్సల్యానికి ఏ మాత్రమూ లోపం కలుగకుండా జాగ్రత్త పడగలిగిన మగవాడే మరొక పెళ్ళి చేసుకోవడానికి అర్హుడు.

అనర్హులైన వాళ్లు, అసమర్థులైన వాళ్ళు శక్తికి మించిన పనులకు, ఆశలకు పోవడమే మానవలోకం లోని దుఃఖాని కంతకూ మూలకారణం.

బయట మాత్రం ఖాను దర్జా ఎప్పటిలాగే ఉంది. అందుకు కారణం ఆయన చేతిలో ఉన్న వైద్య విద్య. దాన్ని రకరకాలుగా ప్రజల మీద ప్రయోగించి, వారి మన్నలను పొంది, సన్మానాలను చేయించుకొంటూ, డబ్బు గడించే వాడాయన. దానితో బట్టలు, టిఫిను, సాదర ఖర్చులు అన్నీ గడిచి పోయేవి. తాను తినేవాడు. తోడి వారలకు తిని పించేవాడు. ఆ రోజుల్లో తన వైద్య విద్యే తనకు తల్లీ, తండ్రీ, చుట్టం, స్నేహం.

"నా సొంత సంపాదనలో నుంచి నా సవతి చెల్లెండ్రకు ఏవేవో వస్తువులు కొని ఇచ్చే వాణ్ని. వాటిని ఎంతో ఆప్యాయంగా తీసుకొనే వాళ్ళు. 'అన్నయ్యా' అని నోరార పిలిచే వాళ్ళు. ఎంతో స్నేహంగా ఉండే వాళ్లు. నాకు పరమానందంగా ఉండేది. నా సవతి తల్లులు నాపై రేపిన ఎన్నో గాలి దుమారాలు ఆ నా చెల్లెండ్రు నా పక్షం వహించటంతో చల్లారి పోయినై. సోదరి ప్రేమ నేను అప్పుడే రుచి చూచాను" అంటాడు డాక్టరు ఖాను కన్నులు తుడుచుకుంటూ.

ఏలూరుకు సంబంధించిందే మరో చిన్న విషయం ఇక్కడ చెప్పటం బాగుంటుం దనుకొంటాను.

గాంధీజీ ఏలూరు వచ్చినప్పుడు ఆయనకు ఒక పర్సు ఇవ్వడానికి వాళ్ళ స్కౌటు మాష్టారు ఉద్దేశించారు. హైస్కూలులోని విద్యార్థులంతా అందుకు ఉత్సాహం కనబరిచారు. అందుకు గాను బాలభటులైన వారినంతా తోచిన చేతి వస్తువులు

తయారు చేయమని స్కాటు మాష్టారు చెప్పారు. డాక్టరు ఖానుకు బియ్యపు గింజపై పేర్లు వ్రాయటం అప్పటికే బాగా వచ్చు. ఆయన తాబేలు ఆకారంలో ఒక బ్లాటింగ్ పాడ్, ఒక చక్కని ఈతాకుల చాప, దూదితో చేసిన ఒక కొంగ, ఒక సీసా హేరాయిల్ ఇవి నాలుగూ తయారుచేసి మాష్టారికి ఇచ్చాడు. వాటిని ఎగ్జిబిషన్‌లో పెట్టి వేలం వేయగా నూట యాభై రూపాయలు వచ్చాయట ! అలా వచ్చిన డబ్బంతా కలిపి, గాంధీజీకి విద్యార్థుల తరఫున ఒక పర్సును సమర్పించు కొన్నారట.

★★★

## 23. అంటరాని వాడు వెలివేయ బడ్డవాడు

అంత ఉజ్జ్వలంగా సాగుతున్న విద్యార్థి జీవితానికి సవతి తల్లుల అమానుష ప్రవర్తనల కారణంగా స్వస్తి చెప్పవలసి వచ్చింది ఆయన.

ఏలూరు నుంచి అనాతవరం వెళ్ళి, అక్కడా, అమలాపురంలోనూ బాల వైద్యుడుగా రాణిస్తున్న సమయంలోనే - కళా వెంకటరావు గారి పరిచయంతో పాటు ఆయనకు కలిగిన మరొక చక్కని పరిచయం నంబూరి శ్రీనివాసరావు గారితో.

నంబూరి శ్రీనివాసరావుగారు కాంగ్రెసులో అతివాది. శ్రీయుతులు అల్లూరి సత్యనారాయణరాజు, మహీధర రామమోహనరావు, జగన్మోహన రావు, అల్లూరి సోమరాజు, మండెల విశ్వనాథం, కాసిన శంకరయ్య, కొరపాటి పట్టాభి రామయ్య, సి.వి.కె. రావు వగైరా యువకులంతా ఆనాడు కాంగ్రెసులో తీవ్రవాదులే. వారంతా రష్యాలోని బోల్షివిక విప్లవంతో ఉత్తేజితులైన వారు.

ఆనాడు ఉన్నది ఒకే ఒక కాంగ్రెసు సంస్థ. ఈనాడు కమ్యూనిస్టులుగా, సోషలిస్టులుగా, ప్రజా పార్టీగా, ప్రజా సోషలిస్టులుగా, ఫార్‌వర్డు బ్లాక్‌గా, స్వతంత్ర పార్టీగా, సర్వోదయ వాదులుగా, ఇంకా రకరకాలుగా కనిపిస్తున్న ప్రముఖ నాయకులంతా ఆనాడు కాంగ్రెసు సంస్థలోనే ఉండేవారు. యువకులైనవారు, సోషలిస్టు సమాజ స్థాపనమే ఆదర్శంగా కలవారు, అతివాదులుగా ఉండేవారు. అందులో నంబూరి ఒకడు.

నంబూరితో పరిచయం నాకు కూడా ఆ రోజుల్లోనే అయింది. బి.యస్.మూర్తి, వేముల కూర్మయ్య, కుసుమ ధర్మన్న, గొల్ల చంద్రయ్య, గొట్టుముక్కల వెంకన్న, రాయుడు గంగయ్య, కమతం షణ్ముఖం, చెన్నా ధర్మారావు, ఐలపాక శ్రీరాములు, సాకేటి గురువులు, పోలుకొండ భద్రయ్య, దిడ్ల పుల్లయ్య, ఉంద్రు సుబ్బారావు, ఈలి వాడపల్లి, పాము రామమూర్తి, మోకా మీరయ్య, రెడ్డి కామయ్య, గెద్దాడ బ్రహ్మయ్య, పచ్చిపాల రామస్వామి, నేరేడుమల్లి జగన్నాధం, గంటి కామయ్య, నక్కా చిన వెంకయ్య, తాళ్ళూరి జియ్యరుదాసు, మంగళగిరి వరవస్తుదాసు, నందనారు హరిశ్చంద్రుడు మొదలైన హరిజన నాయకులతో అప్పుడప్పుడు కలసి తిరుగుతూ ఉండేవాణ్ని నేను. కాంగ్రెసు వాణ్ని కావడం వల్ల కళా వెంకటరావు గారికి, పళ్ళంరాజు గారికి ఎక్కువ సన్నిహితుణ్నిగా ఉండేవాణ్ని.

అందులో అటు పూర్వ తరం నాయకులకు, ఇటు యువతరం కార్యకర్తలకు మధ్య ఒక సేతువులా ఉండి – ఒక తరం ప్రజా జీవితాన్ని తన ఉపన్యాసాలతో, పాటలతో, పద్యాలతో, నాట్యాలతో, నాటకాలతో, సిరి కథలతో, బహిరంగంగాను, అండర్ గ్రౌండులో ఉంటూనూ, ఉత్తేజ పరచిన వాడు నంబూరి శ్రీనివాసరావు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాలను ప్రధాన కార్యక్షేత్రంగా చేసుకొని – పేద వర్గాలలో, ముఖ్యంగా హరిజనులలో ఆయన చేసిన సేవ చరిత్రాత్మకమైనట్టిది. ఆనాడు డాక్టరు ఖానుకు పరిచయమైన నంబూరి అంతటి వ్యక్తి.

నంబూరితో పరిచయ మయ్యేదాకా హరిజనుల మీదకు దృష్టి మరలలేదు డాక్టరు ఖానుకు. అపలు అంటరాని తనం అనే దాన్నే ఎరగడాయన.

భారతజాతి ప్రజలలో ఎన్ని తర తమ భేదాలు ఉన్నాయో, ఎన్ని కులమత వర్గాలు ఉన్నాయో, పరస్పర ద్వేషం, హింస, దోపిడి, పీడన, అస్పృశ్యత, అసహనం, కుళ్ళు ఎంత విపరీతంగా పెరిగిపోయి ఉందో అప్పటి వరకు డాక్టరు ఖానుకు తెలియదు.

"నంబూరి సమాజంలో అంటరాని వాడు. నేను కుటుంబంలో వెలివేయబడ్డ వాణ్ని. మేమిద్దరమూ హరిజనులమే, మా ఇద్దరికీ హరి, అంటే భగవంతుడు, తప్ప మరొక దిక్కు లేదు. అలా అనిపించింది అప్పుడు నాకు. సబ్‌కో సన్మతి దే

భగవాన్ అంటూ మహాత్ముడు చేసిన ప్రార్థనలో ఎంత హృదయ పరితాపం ఉన్నదో అప్పుడుగాని నాకు అర్థం కాలేదు" అంటాడు డాక్టరు ఖాను.

"అందరం భగవంతుని బిడ్డలమే. అందరం హరిజనులమే. కృత్రిమ విభేదాలను కల్పించి, మానవుడు తన చుట్టూ ఎందుకు ఇలా నరకాన్ని సృష్టించు కొంటాడో?" అంటూ వాపోతా డాయన.

నంబూరితో ఆ రోజుల్లో ఆయనకు కలిగిన పరిచయం స్నేహంగా పరిణ మించి, ఒక విడరాని అనుబంధాన్ని సమకూర్చిం దాయనకు.

★★★

## 24. ఆదర్శ దాంపత్యం

విజయనగరంలో స్వతంత్రంగా ఆస్పత్రిని నెలకొల్పుకొని, సమర్థుడైన వైద్యుడుగా అనతికాలంలోనే ఖ్యాతిని గడించుకొని, సమాజంలో ఒక గౌరవస్థానాన్ని సంపాదించుకొంటూ ఉన్న ఖానుపై ఆయన సవతి తల్లుల దృష్టి పడింది మరొకసారి.

ఇప్పటి వారి దృష్టి అప్పటి దృష్టి కంటే భిన్నమైనట్టిది. ఆనాడు అతడు ఎందుకూ పనికిరానివాడు. ఈనాడు ఉపయోగించుకొంటే బాగా పనికివస్తాడు. ఒక చిన్న పన్నాగంతో ఆయనపై వాత్సల్యాన్ని కుమ్మరిస్తూ, వాళ్ళు పెళ్ళి మాటలు తలపెట్టారు. తమ బంధుకోటిలో ఒక సంబంధాన్ని చూచి, ఆయనకు ముడిపెట్టడానికి పూనుకొన్నారు.

అయితే, డాక్టరు ఖాను అందుకు ఒప్పుకో లేదు. పిల్లను తాను చూడాలనీ, తనకు నచ్చిన పిల్లనే పెండ్లాడతాననీ, అదెంత పేద కుటుంబమైనా తనకు అభ్యంతరం లేదనీ ఆయన ధైర్యంగా చెప్పేశాడు తండ్రి గారితో. తండ్రి అందుకు అంగీకరించక తప్పలేదు. సవతి తల్లుల పన్నాగం పారలేదు.

తన ఇష్టానుసారమే పెళ్ళి చేసుకొన్నాడు డాక్టరు ఖాను, 1939లో నిడదవో లులో, ఒక పేద ఇంటిపిల్లను. అవిడ పేరు రహమతున్నీసా బేగం.

ఆయన పెళ్ళి కూడా ఒక విప్లవాత్మకమైనట్టిదే. పెండ్లికి ముందు వరుడు

వధువును చూచుకునే సంప్రదాయం ముస్లింలలో లేదు. తల్లిదండ్రులు నిర్ణయించిన పిల్లను పిల్లవాడు చేసుకొని తీరవలసిందే. ఈ సంప్రదాయానికి భిన్నంగా తనకు నచ్చిన అమ్మాయినే చూచి చేసుకోవడంలో ముస్లిం సామాజిక సంప్రదాయంలో ఒక విప్లవాన్ని ఆయన సాధించా డనవచ్చు.

కట్నాలను కానుకలను అన్నిటినీ నిషేధించా డాయన. మామగారి నుంచి కేవలం ఖద్దరు బట్టలను మాత్రమే స్వీకరించాడు. బావ మరదుల పోరు పడలేక ఒక్క సిల్కు సూటును తీసుకొన్నాడు. అది కూడా ఖద్దరుదే.

జాతీయ వాదంలో అంత నైష్ఠికు డాయన. నేటికీ ఖద్దరు తప్ప కట్టడు. స్వదేశీ వస్తువులు తప్ప వాడడు. సంస్కరణను, స్నేహాన్ని గురించి తప్ప మాట్లాడడు. అంతటి సంస్కారం ఆధునికుల్లో చాలా అరుదు.

వివాహం కాగానే అనకాపల్లిలో ఆస్పత్రి తెరచి, క్రొత్తగా కాపురం పెట్టాడాయన.

భార్య చిన్న వయస్సుది. తానూ చిన్నవాడే. ఒక్కరికీ సంసారానుభవం లేదు. ప్రతి పనీ క్రొత్తే. ఊరు కూడ క్రొత్త. అయినప్పటికి అక్కడ ఉన్న కొద్దిమంది స్నేహితుల ఆసరాతో, తన పాండిత్య బలంతో, వైద్య సామర్థ్యంతో, హస్తవాసితో అన్నిటిని మించిన అమృత హృదయంతో అచిరకాలంలోనే నలుగురికి నోట్లో నాలుక కాగలిగాడు.

చిరకాలం నుంచీ వస్తున్న పరదా పద్ధతికి స్వస్తి చెప్పా డాయన. ఇరుగు పొరుగు హిందూ స్త్రీల వలెనే కలిసి మెలిసి తిరగడం నేర్పాడు భార్యకు. ఘోషా లేదు. కళ్ళ నిండా కాటుక, చేతుల నిండా గాజులు, జరీ చీర, నగలు, అచ్చంగా హిందూ స్త్రీలా తయారు చేశాడామెను. స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడేవారు దంపతు లిద్దరూ. ఎక్కడ ఏ పండగ జరిగినా, ఏ పుణ్యం జరిగినా ఇద్దరూ కలిసే వెళ్ళేవారు. ఇరుగు పొరుగుల కష్టసుఖాలను పంచుకొనేవారు. ముస్లిం కుటుంబాలలో ఎలా ఉన్నా, హిందూ కుటుంబాలలో రహమతున్నీసా బేగం రామతులశమ్మగా మారి పోయింది.

అన్ని రంగాలలో వలెనే, దాంపత్యరంగంలో కూడా డాక్టరు ఖాను ఒక విజయాన్ని సాధించాడు.

మొదటి నుంచీ తాను అభ్యసించింది తెలుగు భాష. నేర్చింది భారతీయ సాహిత్యం. పరిశీలించింది ఆర్షసారస్వతం. కనుక, ఆయనకు అనేక సనాతన శాస్త్రాలతో పరిచయం ఏర్పడి ఉంది. వాత్స్యాయన కామసూత్రాలను, తత్ సంబంధమైన అనేక ధర్మ సిద్ధాంతాలను, చరక సుశ్రుతాలను, ఆరోగ్య నిబంధనలను, సత్‌సంతాన ప్రక్రియలను బాగా చదివి జీర్ణించుకొన్న వాడవడం చేత, ఆయా ఋషులు చెప్పిన పద్ధతులనూ, నియమాలనూ, తిధివార నక్షత్రాది విధి నిషేధాలను, నిగ్రహాన్ని అమలు పరిచా డాయన. అందుకే తనకు సంతానం కలుగబోతున్న రోజులలో, చాలా ముందుగానే, తనకు మగసంతానం కలుగబోతున్నదని రూఢిగా చెప్పగలిగాడు.

ఆయన అలా చెప్పినప్పుడు ఎంతోమంది ఆశ్చర్యపడ్డారు. కొందరు అవహేళన చేశారు. ఎలా చెప్పగలవని మిత్రులు ప్రశ్నించారు. ధృతరాష్ట్రుడు పుట్టంధు డవుతాడని ముందుగానే వ్యాస మహాఋషి ఎలా చెప్ప గలిగాడో అలానే నాకు మగపిల్లవాడు పుట్టగలడని ముందుగానే నేను చెప్పగలనని జవాబిచ్చా డాయన.

రామాయణ భాగవత భారతాదుల మీద, ఆధ్యాత్మిక విషయాల మీద చర్చలు ప్రారంభమయ్యేవి. డాక్టరు ఎ. రామమూర్తి, కె. కామేశ్వర రావు మొదలైన వారు ఆయన కెంతో ఆప్తులు. వారితో మాట్లాడుతూ, చర్చలు జరుపుతూ, ఎంతో ఉత్తేజాన్ని పొందుతూ ఉండే వాడాయన

భార్య పురిటికై పుట్టింటికి పోగా, అనకాపల్లిలోని ఆస్పత్రిని ఎత్తేసుకొని, పుత్రోదయం కోసం ఎదురు చూస్తూ అత్తవారింట కూర్చున్న డాక్టరు ఖానుకు ఈ రకమైన ఆధ్యాత్మిక సాహిత్య వైజ్ఞానిక వ్యాసంగం ఎంతగానో కాలక్షేపం అయ్యేది. శాంతినీ ఇచ్చేది. ఇంతలో 1941 జులై నాల్గవ తేదీ రాత్రి భార్యకు పురుడు వచ్చింది. ఆయన చెప్పినట్టే మగపిల్లవాడు పుట్టాడు.

ఆ తర్వాత ఆయన మకాం బెజవాడకు మారింది. డాక్టరు రామమూర్తి, కామేశ్వరరావు గార్లు ఆధ్యాత్మికంగానే కాక, వ్యవహారంగంలో కూడా ఆయన కెంతో తోడ్పడ్డారు. ఆ ఇద్దరూ మానవతా వాదులనీ, నిష్కపటులనీ, ప్రేమహృదయులనీ,

బహుగ్రంథ పారీణులనీ, తన కత్యంతాప్తులనీ, వారి స్నేహం తనకు అమృత ప్రాయమూ, ప్రాణప్రదమూ అయిందనీ వారిని వేనోళ్ళ పొగుడుతూ ఉంటాడు డాక్టరు ఖాను ఈ నాటికీ.

★★★

## 25. అర్ధాంగి - ఆర్ష సంప్రదాయం

డాక్టరు ఖాను జీవితాన్ని మూడు అధ్యాయాలుగా విడదీస్తే, ఆయన బెజవాడ కాపురంతో రెండవ అధ్యాయం ప్రారంభమైన దనవచ్చు.

అది చాలా ముఖ్యమైన అధ్యాయం.

కృష్ణాజిల్లా ముస్లిం లీగుకు నాయకత్వం వహించడం, దాని విధానం నచ్చక వైదొలగటం, కాంగ్రెసు ఉద్యమాన్ని తీసుకొని రాష్ట్రమంతా ప్రచారం చెయ్యటం, వక్ఫ్‌సంస్థల పునర్నిర్మాణాన్ని సాధించటం, ఫీల్డ్‌లేబర్ సహకార సంఘాన్ని స్థాపించటం, ప్రత్యేకాంధ్రరాష్ట్రం కోసం కలలు కనటం, రే అండ్ కో ద్వారా వైద్యసేవను విస్తరింప జెయ్యటం వంటి వన్నీ ఆ అధ్యాయంలోని ప్రకరణాలు.

అందులో మరొక ప్రధానమైన ప్రకరణం ఆయన సతీమణి శ్రీమతి రహమతున్నీసా బేగంకు సంబంధించి నట్టిది.

ఆమె హిందూ స్త్రీ వలె, ఘోషా లేకుండా బహిరంగంగా భర్తతో కూడా తిరగడమే ఒక రకమైన విప్లవకరమైన చర్య. తమ ఇరుగు పొరుగు ముస్లిం స్త్రీలంతా ఆమెను ఎంతో వింతగా చూచేవారు. గుసగుసలాడే వారు. ముస్లిం సంప్రదాయాన్ని మంట కలుపుతున్నదని బహుశా తిట్టుకునేవారేమో కూడ !

మతాంధులైన మానవులకు మూఢాచారాలు చాలా ముచ్చటగా ఉంటాయి. అనారోగ్యవంతులకు అపథ్యమే బహు ఇష్టం. మంచిని చూచి నేర్చుకోదు లోకం.

ఎవరే మనుకొన్నా లెక్క చెయ్యకుండా శ్రీమతి రహమతున్నీసా బేగం బెజవాడలోని మహిళా జనోద్యమంలో చేరి పనిచేసింది. మహిళా సంఘ కార్య

క్రమాలలో ఎక్కువగా పాల్గొనేది. అక్కడ నేర్పే ప్రత్యేక వృత్తి విద్యలను కూడా అభ్యసించింది. ఒకటి రెండు విద్యలలో ట్రైనింగ్ కూడా పొందింది. ఆ తర్వాత హైద్రాబాదులో కమలానెహ్రూ మెమోరియల్ వెల్‌ఫేర్ సెంటర్ అనే పేరుతో స్త్రీల కోసం ప్రత్యేకంగా ఒక చేతి పనుల కేంద్రాన్ని ఆమె స్థాపించ గలిగిందంటే అందుకు పునాది బెజవాడలో ఆనాడు ఆమె గడించిన అనుభవమే.

ఒక ప్రక్క బెంగాలు కరువు - మరొక ప్రక్క రాయలసీమ కరువు - దేశాన్ని కొట్టి కాకులకూ, గ్రద్దలకూ ఎగరనేసిన రోజులు చరిత్రలో మహా భయంకర మైనట్టివి.

ఆ రోజుల్లో కరువులో చిక్కుకొని పీనుగు పెంటలుగా మారిపోతున్న ఆ ప్రాంతపు ప్రజానీకానికి తోడ్పడే కృషిలో తమకున్న సమస్తాన్నీ ధారపోసిన ప్రజా సంస్థల్లో బెజవాడ మహిళా మండలి ఒకటి. డాక్టరు కొమర్రాజు అచ్చమాంబ, శ్రీమతి కంభంపాటి మాణిక్యాంబ, శ్రీమతి జోస్యభట్ల సుబ్బమ్మ మొదలైన మహిళా మణులతో కలసి శ్రీమతి రహమతున్నీసాబేగం బెజవాడ పట్టణంలో ఇంటింటికీ తిరిగి బట్టలు, బియ్యం వగైరా ప్రోగు చేసి, కరువు నివారణ కార్యక్రమాలకు ఎంతగానో తోడ్పడింది. తన ఒంటిమీద ఉన్న నగలన్నిటినీ ఒలిచి విరాళంగా ఇచ్చేసింది.

తన భార్యను కూడా తనలాగే తయారు చేసుకోవడంలో డాక్టరు ఖాను సఫలీకృతుడయ్యాడు. తన ఆశయాలకు అనరిగుణంగా ఆమెను తీర్చిదిద్దుకోగలిగాడు. సర్వజన సమతా దృష్టి, పేదల పట్ల దయాదాక్షిణ్యాలు, దీనులపై కరుణా కటాక్షాలు, హృదయ వైశాల్యం, ఔదార్యం, వదాన్యత, ధాతృత్వం వంటి ఉత్తమ సంప్రదాయ గుణాలతో పాటు - తనకు గల విచక్షణా జ్ఞానం, పట్టుదల, ధర్మ కోసం పోరాడటం, తను మంచిదని నమ్మిన పని నుంచి వెనుకంజ వెయ్యక పోవడం వంటి రాజస గుణాలలో కూడా ఆమెను తనంతటి దానిగా తర్ఫీదు చేశాడు. అనేక రంగాలలో, అనేక సందర్భాలలో, ధర్మం కోసం పోరాడవలసి వచ్చినప్పుడు ఈ గుణశక్తులే ఆమెకు ఎన్నో విజయాలను సాధించిపెట్టినాయి. ఈ శక్తులనే తిరగబడి తన భర్త

మీద కూడా ప్రయోగించి, ఆయనను కొన్ని పొరపాట్ల నుండి మళ్ళించుకొన్న సందర్భాలను కూడా నే నెరుగుదును.

ఒక సారి డాక్టరు అచ్చమాంబగారు ఒక మహిళా సభలో ఉపన్యసిస్తూ, స్త్రీలకు భర్త పట్ల ప్రేమ ముఖ్యం కాని మంగళ సూత్రాలు కాదనీ, తక్కిన నగలతో పాటు వాటిని కూడా విరాళంగా ఇచ్చివేయ వచ్చుననీ ఉద్బోధించిందట.

ఒక ప్రక్క కమ్యునిస్టులూ, మరొక ప్రక్క గోరాగారి నాస్తిక వాదులూ మంగళ సూత్రాలను త్రెంచి పారవేసుకొంటున్న రోజులవి. ఈ మాంగల్య చిహ్న వ్యతిరేకోద్య మానికి బెజవాడే ప్రధాన కేంద్రం. అట్టి బెజవాడలో కమ్యునిస్టు, నాస్తిక మత ప్రాబల్యం కల మహిళా సభలో, డాక్టరు అచ్చమాంబ వంటి నాయకురాలు మంగళ సూత్రాలను త్రెంచి ఇచ్చివేయమంటే, కాదనే వారెవరు ? కాదనగల వారెవరు ?

అయితే...

ఆ సభలో కాదనగలిగిన, కాదన్న ఒక మహిళ ఉండనే ఉంది. ఆమే రహమతున్నీసాబేగం. ప్రేమ కంటే మంగళ సూత్రమే ప్రధాన మంది ఆమె.

ప్రేమ ఉండవచ్చు, లేకపోవచ్చు. అది హృదయానికి సంబంధించిన విషయం. పైకి కనిపించేది కాదు. దాంపత్య జీవితానికి ప్రధానమైంది ధర్మం. ధర్మానికి చిహ్నమే మంగళసూత్రం. అది పుణ్యస్త్రీకి అత్యంత ముఖ్యమైనట్టిది. పవిత్రమైనట్టిది. దానిని తీసివేయ మనడం ఉచితం కాదు. మెడలో మంగళసూత్రం ఉన్న స్త్రీనే లోకం గౌరవిస్తుంది. అది లేని స్త్రీని వితంతువును వలె అపవిత్రంగా చూస్తుంది. భారత సమాజంలో మంగళసూత్రం లేని స్త్రీకి గౌరవమూ లేదు, ప్రతిష్ఠా లేదు, పవిత్రతా లేదు.

శ్రీమతి బేగం చేసిన ఈ ధర్మవాదం – అధికార పక్షం బాగా మెజారిటీలో ఉన్న అసెంబ్లీలో ప్రతిపక్షవాదం వలె – అప్పటికి నిరర్థకమే అయినా, ఆ తర్వాత దానికి బాగా బలం చేకూరింది. మంగళ సూత్రాలను విరాళంగా ఇవ్వడానికి చాలా మంది స్త్రీలు నిరాకరించారు.

ఆ తర్వాత కమ్యూనిస్టులు కూడా తమ స్త్రీలు మంగళ సూత్రాలను ధరించ కూడదన్న సూత్రాన్ని మార్చుకొన్నారు.

"కార్యేషు దాసీ, కరణేషు మంత్రి" అన్న ఋషి నిర్వచనానికి అనురూపమైన భార్య తనకు లభించినందుకు డాక్టరు ఖాను ఎంతో మురిసిపోతాడు. బాహ్య ప్రపంచంలో తాను జరుప వలసి వచ్చిన ఎన్నో పోరాటాలలో తాను దృఢంగా నిలబడటానికి కారణం... ఇంట తన ఇల్లాలు తనకు ఇచ్చిన ఆత్మశక్తే అంటాడు ఆయన.

★★★

## 26. పార్లమెంటులో ఉండవలసినవాడు

ఆయన కల ఫలించి, పొట్టి శ్రీరాములుగారి ప్రాణాన్ని బలి తీసుకొని, 1953లో ఆంధ్రరాష్ట్రం అవతరించింది.

ఆ తర్వాత ఆయన దృష్టి రాష్ట్ర ప్రజాభ్యుదయం మీదికి మళ్ళింది.

ఒక పద్ధతిలో, ఒక ప్రణాళిక క్రింద, రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి... నైజాములోని ఆంధ్రజిల్లాలను కలుపుకొనడం ద్వారా సమగ్ర ఆంధ్రను నిర్మించడానికి ఆయన కృషిని ప్రారంభించాడు. ఆ కృషి లోని ఒక భాగమే "అజాద్" పత్రికా స్థాపన.

1955లో ఆయన సంపాదకత్వం క్రింద ఆజాద్ వారపత్రిక వెలువడింది. ఆయన ఊహలు, ఉద్దేశాలు, నిర్మాణ కార్యక్రమ నిర్వహణ పద్ధతులు, వివిధ సమస్యల పరిష్కార మార్గాలు – ఎన్నో విషయాలను ఆ పత్రిక చర్చిస్తూ ఉండేది.

అప్పటికి కాంగ్రెసు కార్యదర్శిగా ఉంటున్న కాసు బ్రహ్మానంద రెడ్డిగారి ప్రతిపాదనతో డాక్టరు ఖాను పి.సి.సి. మెంబరు అయ్యాడు.

కర్నూలు రాజధానిగా, ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రిగా, బెజవాడ గోపాలరెడ్డిగారు పి.సి.సి. అధ్యక్షులుగా బ్రహ్మాండంగా ప్రారంభమైన ఆంధ్ర రాష్ట్ర

ప్రభుత్వం ఒక్కవోటు దెబ్బతో కూలిపోగా – అప్పుడు జరిగిన మధ్యంతర ఎన్నికలలో, కాంగ్రెసు విజయం కోసం డాక్టరు ఖాను చేసిన కృషి నిజంగా అప్రతిమానం.

ఆయన కృషిని బెజవాడ గోపాలరెడ్డిగారే కాక, ఎన్నికల పర్యవేక్షణ కోసం ఆంధ్రలో మకాం పెట్టిన ఎస్.కె. పాటిల్‌గారు కూడా ఎంతగానో కొనియాడారంటే – అది ఎంత గొప్పదో వేరే చెప్పనక్కర లేదు.

ఆ ఎన్నికల సందర్భంలో నూజివీడులో ఎం.ఆర్.అప్పారావు గారి విజయం కొరకు జరిగిన ఒక 50 వేల మంది మహాసభలో డాక్టరు ఖాను చేసిన మహోపన్యాసాన్ని విని, తన్మయుడైన బారిష్టరు అక్బరు ఆలీఖాన్, వేదిక మీదనే కౌగలించుకొని "నీవు మహాశక్తివంతుడవు, పార్లమెంటులో ఉండవలసినవాడవు" అంటూ ఆయనను ఎంతో ప్రశంసించాడంటే అది ఎంతటి చారిత్రాత్మక సంఘటనో ఊహించుకోవచ్చు.

ఇలాంటి సంఘటనలు ఆనాడు ఎన్నో జరిగినై డాక్టరు ఖాను జీవితంలో.

ఆ ఎన్నికలలో కాంగ్రెసు పూర్తి విజయాన్ని సాధించింది. కమ్యూనిస్టులు చిత్తుగా ఓడిపోయారు. బెజవాడ గోపాలరెడ్డిగారి నాయకత్వం క్రింద కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడింది.

ఆ ఎన్నికలలో మైనారిటీ వర్గాలను, ముఖ్యంగా ముస్లింలను, కూడగట్టి వారి వోట్లన్నిటినీ కాంగ్రెసుకు సంపాదించిన ఖ్యాతి డాక్టరు ఖానుకు దక్కింది.

ఆయన చేసిన సేవను గుర్తించి, 1955 మార్చి 23వ తేదీన, ఆంధ్ర రాష్ట్ర యువజన కాంగ్రెసువారు ఆయన్ని ఘనంగా సన్మానించారు.

బెజవాడలో ఆంధ్రరత్న భవనంలో తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తిగారి అధ్యక్షతను జరిగిన ఈ సన్మాన సభలో, డాక్టరు ఖాను గుణగణాలను గురించి పలువురు ప్రముఖులు వేనోళ్ళ కొనియాడారు.

ఆ ఎన్నికలలో ఆయన ఎన్ని సభలు చేశాడో, ఎన్ని సమావేశాలకు అధ్యక్షత వహించాడో, ఎన్ని పట్టణాలలో, పల్లెలలో ఎన్ని వేల మందికి తన సమైక్యతా సందేశాన్ని వినిపించాడో, ఆనాటి పత్రికల్ని చూస్తే తెలుస్తుంది.

రాష్ట్రం ఈ దరి నుంచి ఆ దరికి తుఫానులా తిరిగా డాయన. ప్రతి మసీదులోను సభ చేశాడు. ప్రతి ముస్లిం యువకుడికి కాంగ్రెసు సిద్ధాంతాలను బోధపరిచాడు. నిద్రాహారాలు మానివేశాడు. నిర్విరామంగా శ్రమించాడు. తాను నమ్మిన పార్టీని గెలిపించాడు. తాను గెల్చాడు.

ఆంధ్రదేశంలో ఉన్న ముస్లింలు ఆంధ్రులే. క్రైస్తవుల కంటే, హిందువుల కంటే వారే విధంగాను భిన్నులు కారు" అంటూ ఆయన చేసిన సర్వాంధ్ర సమైక్యతా నినాదం దేశం మూల మూలలా వినిపిస్తుందీ నాటికీ – చెవులుండి వినగలిగిన వాళ్ళకు !

★★★

## 27. రాజకీయ వీరుడు

"అడిగో ! రాజకీయ వీరుడు వస్తున్నాడు ! రావయ్యా, ఖాన్ ! రా ! కూర్చో !" అన్నారు అయ్యదేవర కాళేశ్వరరావుగారు, ఒక సాయంకాలం, బషీర్‌బాగ్‌లోని ఆయన బంగళాలో మేమంతా కూర్చొని ఉండగా – అప్పుడే లోనికి అడుగు పెట్టిన డాక్టరు ఖానును చూచి.

"ఖాన్ సాహెబ్ తెలుసా నీకు ? రాజకీయ వీరుడు !" అన్నా రాయన నా కేసి చూసి.

అది 1959 నవంబరు ప్రాంతం.

అసెంబ్లీ స్పీకరు హోదాలో కాళేశ్వరరావుగారు ఒక గ్లాసరీ కమిటీని వేసి, దానికి ఆయనే అధ్యక్షుడుగా ఉండి, పారిభాషిక పదకోశాన్ని రూపొందిస్తున్న కాలమది.

ప్రాథమిక కృషి అంతా జరిగిపోయింది. దాన్ని పరిష్కరించి, ఒక పద్ధతిలోకి తెచ్చి, ముద్రణకు ఇవ్వవలసిన చివరి ఘట్టం మిగిలింది. ఆ ఘట్టం కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం నా అధ్యక్షత క్రింద ఒక ఉపసంఘాన్ని నియమించా రాయన.

శ్రీ కాళోజి నారాయణరావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, డి.వి.శివరావు, దేవుల పల్లి రామానుజరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, పి.వి. నరసింహారావుగార్లు

ఆ ఉపసంఘంలో సభ్యులు. ఆ పదకోశానికి సంబంధించిన విషయాలను కాళేశ్వర రావుగారితో చర్చిస్తూ కూర్చున్నాను నేను, డాక్టరు ఖాను వచ్చిన సమయానికి.

అప్పటికే నాకు డాక్టరు ఖాను బాగా తెలుసు. కాని, కాళేశ్వరరావు గారు ఆయనను రాజకీయ వీరుడని సంబోధించడంలో అర్థమేమిటో తెలియదు.

"జాతీయోద్యమంలో పాల్గొని, దేశం నుంచి విదేశీ ప్రభుత్వాన్ని వైదొలగించిన మనమంతా రాజకీయ వీరులమే కదా ?" అన్నాను నేను వారితో.

"ఖాన్ ప్రత్యేకత వేరులే" అన్నా రాయన.

"జాతీయోద్యమ పోరాటంలో పాల్గొన్న ఇద్దరు డాక్టరు ఖాన్ సాహెబ్‌లలోనూ, ఈయన దక్షిణ నాయకుడు" అన్నాను నేను.

"అదీ కాదు" అన్నారాయన నవ్వుతూ.

జాతీయోద్యమంలో పాల్గొని దానికి సంబంధించిన వివిధ రంగాలలో కృషి చేసి, ఎన్నో విధాలైన త్యాగాలను చేసి, చదువును, ఆస్తులను, ఉద్యోగాలను, ఆయుస్సును కూడా పోగొట్టుకొని, పోరాటం జరిపి - విజయానంతరం క్షతగాత్రులుగా మిగిలిన సైనికుల్లా బాధపడుతున్న ఉద్యమ కార్యకర్తలకు సహాయం చెయ్యడం ధర్మం అన్న ఉద్దేశం ఒకనాడు కళా వెంకట్రావుగారికి కలిగింది. మద్రాసు ప్రభుత్వంలో అప్పటికాయన మంత్రి. ఉద్దేశం కలగటమే తడవుగా దానిని కార్యరూపంలో పెట్టాడాయన.

రాజకీయ పోరాటంలో త్యాగాలు చేసి, నిరాధారులై ఉన్న వారికి రాజకీయ బాధితులు అన్న పేరు పెట్టారు. అట్టి రాజకీయ బాధితులకు భూవసతి కల్పిస్తామన్నారు. సేద్యానికి వీలైన, ఇతరుల ఆక్రమణలో లేని భూములను అట్టివారికి ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వంచే నిర్ణయింపజేశారు. నీటి వసతి కల పల్లపు భూమి అయితే ఐదెకరాలు, మెట్టభూమి అయితే పదెకరాలు ఒకొక్క వ్యక్తికి ఇవ్వబడతాయి.

ఈ ప్రణాళిక క్రింద ఎంతో మంది పేదలైన రాజకీయ బాధితులకు సహాయం లభించింది.

సమస్తమూ దేశమాత పాదాల వద్ద సమర్పించుకొని బికారులై పోయినవారే కాక – ఏమీ పోగొట్టుకొనని రాజకీయ సమయజ్ఞులు కూడ ఈ ప్రణాళిక క్రింద బాగా లాభపడటం జరిగితే జరిగి ఉండవచ్చు. అది వేరే విషయం. అది వెంకటరావు గారి ప్రణాళికలోని లోపం కాదు. ఎంత మంచి ప్రణాళికలైనా – బలమైన స్వార్థపరులు తమకు అనుకూలంగా మార్చుకోవడం జరుగుతూనే ఉంటుంది కదా ?

అది 1948–49 ప్రాంతం.

"నీవు కూడా రాజకీయ బాధితుడవే కదా ? ధరఖాస్తు పెట్టు. నేను సిఫార్సు చేస్తాను. ఐదెకరాల పొలం వస్తుంది" అన్నారట కాళేశ్వరరావుగారు డాక్టరు ఖానుతో ఒకనాడు.

"ప్రతిఫలాపేక్షతో మనం పోరాటం జరుపలేదు. దేశ విముక్తి కోసం పోరాడాం. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడుతున్నపుడు, బ్రతికి బయట పడతామన్న ఆశ కూడా ఆనాడు మనకు లేదు. దేశాన్ని దాస్య విముక్తం చేయడం మన ధర్మం. ధర్మం కోసం పోరాడాం. భవిష్యత్తులో ఏదోలాభం కలుగుతుందన్న దృష్టే అప్పుడు మనకు లేదు. రాజకీయాల వల్ల మనం బాధపడలేదు. మనం వీరులం. బాధితుల మనిపించు కోవడం ఒక ఐదెకరాల కోసమే కదా ? నాకు ఐదెకరాలు అక్కరలేదు. నేను రాజకీయ బాధితుణ్ని కాదు. రాజకీయ వీరుణ్ని" అన్నాడట డాక్టరు ఖాను.

కాళేశ్వరరావుగారు ఖాను సమాధానానికి విస్తుపోయారు, ఆనందించారు, అభినందించారు.

రాజకీయ బాధితులు కాని వారు కూడ ఐదెకరాల కోసం అప్లయి చేసు కొంటున్న రోజుల్లో – బాగా ధనవంతులైన రాజకీయ నాయకులు కూడ పదెకరాల కోసం ప్రయత్నిస్తున్న రోజుల్లో – వ్యవసాయ భూముల కోసం పట్టణాలలో బాగా ధర పలికే మార్కెట్టు స్థలాల కోసం పోటీలు పడుతున్న రోజుల్లో – నిరుపేదల అక్రమణలలో నుంచి మంచి భూముల్ని బలాత్కారంగా లాగుకోవడానికి కూడ పాలు పడుతున్న రోజులలో – ఎక్కడా ఏ ఆస్థి లేని డాక్టరు ఖాను ఊరికనే చేతికందుతున్న ఆస్తిని అక్కరలేదనడం ఎంత అపూర్వం !

అప్పటినుంచీ డాక్టరు ఖాను కనిపించినప్పుడెల్లా, ఆయనను 'రాజకీయ వీరుడు' అనే పిలిచేవారట కాళేశ్వరరావుగారు. ఈ ఉదంతాన్ని విన్న తర్వాత నాకు డాక్టరు ఖాను పట్ల అశేషమైన గౌరవం ఏర్పడింది.

"మేఘరంజని" పేరు కంటే, "రాజకీయ వీరుడు" బిరుదే నన్ను ఎక్కువగా ఆకర్షించి, నా హృదయాన్ని ద్రవీభూతం చేసి, ఆయనతో ఇతోధికమైన ఆత్మీయతకు దోహదం చేసింది.

తాను చేసిన త్యాగాలకు ఎట్టి ప్రతిఫలాన్ని కోరని ఉదాత్తచిత్తుడు డాక్టరు ఖాను. ఆయన ఒక రాజకీయ వీరుడే కాడు, జీవితం ప్రతి రంగంలోను ఆయన ధర్మ వీరుడే !

★★★

## 28. ఎవరు ఉత్తమ నాయకులు ?

1956, నవంబరులో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డానికి చాలా ముందుగానే - ఆంధ్రరాష్ట్రంలో నైజాం రాజ్యంలోని తెలంగాణా జిల్లాలను చేర్చి, ఆంధ్ర తెలంగాణా సమష్టి సమగ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలన్న నిర్ణయం గైకొన బడింది.

అప్పటి ఆంధ్రరాష్ట్రానికి బెజవాడ గోపాలరెడ్డిగారు, నైజాం రాజ్యానికి బూర్గుల రామకృష్ణారావుగారు ముఖ్యమంత్రులుగా ఉన్నారు. నైజాం రాజ్యాన్ని మూడు భాగాలుగా విడగొట్టి ఒకదానిని మైసూరుకు, ఒకదానిని మహారాష్ట్రకు, ఒకదానిని ఆంధ్రకు కలిపివేయడానికి కూడ తీర్మానించబడింది. ఆంధ్రకు వచ్చిన భాగంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు తొమ్మిది జిల్లాలు ఉన్నాయి. అదే తెలంగాణ.

నిజాం రాజ్యం మూడు భాగాలై ప్రక్క రాష్ట్రాలలో కలిసి పోవడంతో, రామకృష్ణారావు గారి ముఖ్యమంత్రి పదవి పోక తప్పదు. ఆంధ్ర రాష్ట్రం తెలంగాణాను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించడంతో, ఆంధ్రరాష్ట్ర మంత్రి వర్గంలో మార్పులు జరగడం కూడ తప్పదు.

తెలంగాణా శాసన సభ్యులు మొత్తం మీద గోపాలరెడ్డిగారి నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రకటన చేసి ఉంటే, ఆయనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగగల అవకాశం ఉంది. అయితే రాజకీయాలను నమ్మడానికి వీలు లేదు. ఏ క్షణంలో ఏ గాలి ఎటు వీస్తుంది చెప్పలేం. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో తేల్చుకోలేం. ఏది ఏమైనా, ఆంధ్రప్రదేశ్ అనేది ఒక కొత్త రాష్ట్రం కాబట్టి, నాయకత్వానికి క్రొత్తగా ఎన్నిక జరగాలని నిర్ణయం గైకొనబడింది.

ఆ ఎన్నిక ఇటు ఆంధ్రరాష్ట్రంలోని శాసన సభ్యులూ, అటు తెలంగాణా జిల్లాలకు చెందిన శాసన సభ్యులూ కలసి జరుపవలసి ఉంది. ఇక్కడ గోపాలరెడ్డిగారు గాని, అక్కడ రామకృష్ణారావుగారు గాని ముఖ్యమంత్రి పదవికి పోటీ చెయ్యవచ్చు. తెలంగాణా శాసన సభ్యుల కంటే ఆంధ్రశాసన సభ్యుల సంఖ్య ఎక్కువ కనుక, ఆంధ్ర నుంచి పోటీ చేసే అభ్యర్థికే విజయం కలిగే అవకాశం ఉంది. బహుశా, అందుకేనేమో, రామకృష్ణారావుగారు పోటీ చెయ్య దలచలేదు.

ఇక మిగిలింది గోపాలరెడ్డిగారు. ఆయనతో పోటీ చెయ్యడానికి సంజీవరెడ్డి గారు నిర్ణయించుకొన్నారు.

ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి ఏకగ్రీవ ఎన్నిక అసాధ్యమైంది. పోటీకి ఆంధ్ర కాంగ్రెసులో ఉన్నత శ్రేణికి చెందిన నాయకులిద్దరూ తలపడ్డారు. ఈ పోటీ సందర్భంలో డాక్టరు ఖాను నిర్వహించిన పాత్ర నిజంగా చాల గొప్పది. సంజీవరెడ్డి గారిని బలపరచి, ఆయన విజయం కోసం అహర్నిశలూ శ్రమపడి కృషి చేశాడు డాక్టరు ఖాను.

ఒక్క కాంగ్రెసు వాదిగానే కాక జాతీయ ముస్లిం నాయకుడుగా కూడ డాక్టరు ఖానుకు హైదరాబాదుతో సన్నిహిత సంబంధం ఉంది. అందు వల్ల ఆయన హైదరాబాదు వెళ్ళి మైసూర్ కేఫ్‌లో మకాం పెట్టి, తమ కార్యక్రమాన్ని ప్రారంభించాడు.

అల్లూరి సత్యనారాయణరాజు, మంతెన వెంకటరాజు, వేముల కేశవరావు (కూర్మయ్యగారి తమ్ముడు), నంబూరి శ్రీనివాసరావుగార్లతో కలసి ఒక నిర్ణీత పద్ధతిలో ఆయన పని చేశాడు. తెలంగాణలోని నాయకులను శాసన సభ్యులను ఖుద్దున

కలుసుకొని, చర్చలు జరిపి, సంజీవరెడ్డి గారి అభ్యర్థిత్వానికి పూర్తి బలం సంపాదించాడు.

ఈ నాయకత్వపు పోటీలో సంజీవరెడ్డిగారు అఖండ విజయం పొందుతారని మొట్టమొదటగా పత్రికా ప్రకటన చేసింది డాక్టరు ఖానే.

ఆంధ్ర తెలంగాణా రాజకీయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, మొత్తం శాసన సభ్యుల మనస్తత్వాన్ని గ్రహించి చెప్పిన జోస్యం కనుక, అది ఫలించింది. పోటీలో సంజీవరెడ్డిగారు గెలిచారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అగ్రశ్రేణిలోని నాయకులు అధికారాలను స్వీకరించారు. యుద్ధంలో గెలవడానికి ప్రధాన కారణమైన యోధులు గెలుపు తర్వాత వలె, డాక్టరు ఖాను వంటి కార్యకర్తలు ఇళ్ళకు మళ్ళారు.

నాయకత్వపు పోటీలో అంత కృషి చేసి, తాను బలపరచిన నాయకుడు అత్యధిక మెజారిటీతో గెలుపొందినా కూడ, డాక్టరు ఖానుకు ఏ పదవీ లభించలేదు. అందుకు ఆయన ప్రయత్నించనూ లేదు. అదే ఆయనలోని ప్రత్యేకత !

అయితే -

పోరాటంలో పాల్గొని, నిద్రాహారాలు లేకుండా కష్టించి, త్యాగాలు చేసి, తనకు అభిమాన పాత్రుడైన నాయకుణ్ని గెలిపించుకొన్న కార్యకర్తలు అందరూ ఒకేలా ఉండరు. కొందరు తమ కష్టానికి ఫలితాన్ని ఆశిస్తారు. తమ త్యాగాలకు ప్రతిఫలం కోరతారు. కొందరు పనిచేసినంత తీవ్రంగానే ప్రతిఫలాన్ని రాబట్టు కోవడానికి కూడా పోరాడుతారు.

కొందరు ఉదాసీనంగా ఉంటారు. ప్రతిఫలం లభిస్తే వద్దనరు. కాని, తమంతట తాముగా చేయి చాచి అడగరు.

మరి కొందరు ఏదైనా ఇస్తామన్నా పుచ్చుకోరు. చిరునవ్వుతో నిరాకరిస్తారు.

అసలు ఏ పనీ చెయ్యకుండానే అంతా తమకే కావాలనే వారు కూడ ఉంటారు. రాజకీయాలలోనే కాదు, ఏ రంగంలో అయినా సరే, అధికార పదవుల కోసం తాపత్రయ పడే వారంతా మొత్తం మీద ఈ బాపతే.

ఇన్ని రకాల ప్రజల్లో ఎవరు ఎటువంటి వారో గుర్తించి, వారి వారి అవసరాలను గమనించి, అందరినీ తృప్తి పరచవలసిన బాధ్యత నాయకత్వానికి ఉండవలసి ఉంది. డాక్టరు ఖాను విషయంలో మాత్రం అటువంటి దేదీ జరిగినట్టు లేదు.

నిజమైన కార్యకర్తల చేత, ప్రతిభా పాండిత్యాలు గల ప్రజ్ఞావంతుల చేత - జాతి పునర్నిర్మాణ ప్రణాళికలను అమలు జరిపించుకోవడం నాయకుల విధి. గాంధీజీ నాయకత్వం క్రింద తరిఫీదు పొందిన దేశంలో తరచు అట్టి విద్యుక్త ధర్మం విస్మరింపబడుతూ ఉండటం నిజంగా జాతి దురదృష్టం.

అందుకే -

ప్రతిభావంతులు, శక్తివంతులు, శీలవంతులు, స్వార్థరహితులు, సర్వజన సమతావాదులు, త్యాగనిరతులు వెనుకబడి పోవడం - స్వార్థపరులూ, అసమర్థులూ, దుశ్శీలురూ, ధనదాహపరులూ, అగ్రశేణుల లోకి తోసుకురావడం జరుగుతున్నది ! జాతి జీవితం ప్రగతికి కాక - అధోగతికీ, అయోమయస్థితికీ, అంధకారానికీ దిగజారి పోతున్నది !

★★★

## 29. సూర్యభవనం - చంద్ర భవనం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, దానికి హైదరాబాదు నగరం రాజధాని కావడంతో, డాక్టరు ఖాను తన ఆస్పత్రినీ, కార్య రంగాన్నీ హైదరాబాదుకు మార్చాడు.

ఆంధ్రులకు ఒక సమగ్ర రాష్ట్రం ఏర్పడింది. ఒక మహా నగరం లభించింది. ఒక అర్ధ శతాబ్దిగా సాగిన ఆంధ్రోద్యమం ఈ విధంగా సమగ్ర సత్ఫలితం ఇచ్చి, సమాప్తమైంది.

అయితే - అంతటితో సరా ?

ఆంధ్రోద్యమం నిజంగా సమాప్తమైందా ?

సమగ్ర సమ్యగ్రాష్ట్రాన్ని మనం ఎందుకు కోరాం ?

ఉద్యమం సమాప్తం కాలేదు. ఇప్పుడే ప్రారంభమైంది !

ఆంధ్రం – ఆబాల గోపాలం అందరకూ ఆనందకరం, ఐశ్వర్యవంతం, అమృతప్రాయం కావాలి. అందుకు నిజమైన కృషి ఇప్పుడు ప్రారంభం కావాలి.

ఇల్లు అలుకగానే పండగ కాదు. ఇంతవరకూ మనం చేసిన పని ఇల్లు అలకటం వరకే. ఇంట్లో ఏమీ లేంది పండగ ఎలా అవుతుంది ?

రాష్ట్రం ఏర్పడింది.

కాని, రాష్ట్ర ప్రజలు మాత్రం బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో ఎలా ఉన్నారో అలానే ఉన్నారు ఇప్పటికీ !

హిందూ ముస్లిం సమైక్యత, అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ, విద్యా వ్యాప్తి, దారిద్ర్య నిర్మూలన, గృహ నిర్మాణం, గ్రామ పునర్నిర్మాణం, రహదారుల ఏర్పాటు, పరిశ్రమల స్థాపన, సాముదాయక వ్యవసాయం, అధికాహారోత్పత్తి, ప్రాజెక్టుల నిర్మాణం, సంగీత సాహిత్య నృత్యాది కళల పునరుజ్జీవనం, సాంస్కృతిక సముద్ధరణ, సోషలిస్టు సమాజ స్థాపన వంటి కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం కూడ చుట్టబడలేదింత వరకు !

ఏం చెయ్యా లిప్పుడు ?

అందుకని –

నిర్మాణ కార్యరంగంలో ఇతోధికంగా కృషి చెయ్యడానికి పూనుకున్నాడు డాక్టరు ఖాను. అందుకే తన ఆజాద్ పత్రికను హైదరాబాదుకు తరలించాడు. భార్యచే ఒక చేతిపనుల కేంద్రాన్ని నెలకొల్పించాడు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తేవడానికి ఎన్నో రాయబారాలు నడిపాడు, అడుగడుగునా అవరోధాలను ఎదుర్కొంటూ కూడా ఇప్పటికీ ప్రతి కార్య రంగంతోనూ సంబంధం పెట్టుకొని, సాధ్యమైనంత కృషి చేస్తూనే ఉన్నాడు.

అయితే –

ఒక్కడూ ఏం చేస్తాడు ?

ఇది ప్రజా ప్రభుత్వం. ప్రభుత్వ ధనంతో ప్రజా సేవ చేస్తున్న నాయకోప

నాయకుల సంఖ్య లెక్కకు మిక్కిలిగా పెరిగిపోతూ ఉంది. ఒక డాక్టరు ఖాను వంటి వారికి అడుగు ముందుకు ఎలా పడుతుంది ?

అయితే - ఆయన జీవిత రంగంలో, వైద్య రంగంలో, సాంస్కృతిక రంగంలో, స్నేహ రంగంలో సుప్రసిద్ధుడు, సుస్థిరుడు, సువ్రతుడు, సహృదయుడు.

పెద్ద భార్య శ్రీమతి రహమతున్నీసా బేగం, చిన్న భార్య శ్రీమతి సలామా బేగం సూర్య - చంద్ర భవనాలలో ఆ ఇద్దరు భార్యలు అహర్నిశలూ సేవ చేస్తూ ఉంటే - ఆనందం మూర్తీభవించినట్టుంటా డాయన ఎల్లప్పుడూ.

ఇద్దరు భార్యలకూ - కొడుకులు, కూతుళ్ళు చాలామందే ఉన్నారు. అందరూ రత్న మాణిక్యాల లాంటి వాళ్ళు. కొందరికి పెళ్ళిళ్ళు చేశాడు. పెద్ద కొడుకులు చేతికి అంది వచ్చి. సంపాదన పరులైనారు. మనుమల్ని కూడా కనిపెడుతున్నారు. ఆయన రెండు సంసారాలూ మూడు పువ్వులూ ఆరు కాయలుగా, నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా ప్రవర్ధమానమవుతూ ఉన్నాయి.

బంధువులతో, స్నేహితులతో, అతిథి అభ్యాగతులతో కళ కళలాడుతూ ఉంటై అవి ఎప్పుడు చూచినా. ఇటు విజయనగరం కాలనీ గాని, అటు అంబరుపేటకు గాని ఎప్పుడు ఎటు వెళ్ళినా - ఏ సమయంలో నైనా సరే - పంచ భక్ష్య పరమాన్నాలు లభిస్తాయి వారి గృహాలలో.

ఆ ఇద్దరు సతీమణులూ అక్కడ చెల్లెండ్ర కంటే ఎక్కువ అన్యోన్యంగా ఉండడం కూడ ఆయన చేసుకొన్న మరొక సుకృతం !

*వండ నలయుదు వేవురు వచ్చిరేని*
*అన్నపూర్ణకు ఉద్దియౌ అతని గృహిణి !*
*అతిథులేతేర నడిరేయి యైన పెట్టు*
*వలయు భోజ్యంబు లింట నవ్వారి గాగ !*

అనే భారత గృహిణీ ధర్మం ఆ ఇద్దరిలోనూ పోటీ పడుతూ వర్ధిల్లుతూ ఉంది నిత్య నూతనంగా !

★★★

# ౩౦. వైవిధ్యంలో ఏకత్వం

అనేక వైవిధ్యాలకు, వైరుధ్యాలకు సమన్వయ కేంద్రం డాక్టరు ఖాను జీవితం.

ఆయన ఒక మహా నాయకుడు కాడు. కోటీశ్వరుడు కాడు. పరిపాలకుడు కాడు. ప్రవక్త కాడు. ఏదో ఒక రంగంలో పైకి వచ్చిన ఎవడైనా, తక్కిన రంగా లన్నిటి లోనూ అడుగున ఉంటాడు. అలాంటివాడు ఏక దృక్కు, ఏ దృక్కుక అయిన వాడు పూర్ణ పురుషుడు కాలేడు.

డాక్టరు ఖాను సామాన్యుడు. ధనదాహం, అధికార దాహం, కీర్తి దాహం - ఈ దాహత్రయం కోసం తాపత్రయం లేదాయనకు. మానవుడి జీవితం ఎలా ఉండాలని భగవంతుడి ఉద్దేశమో, అలా - ఆత్మవత్సర్వ భూతానిగా - జీవించే వాడే నిజమైన మానవుడు. అలాంటివాడు ఒక్క సామాన్య మానవుడే. డాక్టరు ఖాను సామాన్య మానవుడు కనకనే, మానవత్వం సర్వతో ముఖంగా వికసించిన సర్వజనీన సమ్యక్ దృక్కు అయినాడు, పూర్ణ పురుషుడైనాడు.

"ప్రతి సామాన్యుడూ పూర్ణ పురుషుడే నా ?"
"అవును"

"ప్రతి సామాన్యుడికీ ఇంతటి జీవిత చరిత్ర ఉంటుందా ?"
"ఉంటుంది."

"మరి, ఎవరూ వ్రాయరేం ?"

"వ్రాసే వాళ్ళు లేక."

ఎక్కడో బొగ్గు, ఎక్కడో ఇనుం, ఎక్కడో బంగారం, ఎక్కడో పెట్రోలు - అంతేనా భూగర్భ సంపద ? తవ్వేవాళ్లుంటే - ఎక్కడ తవ్వినా అమూల్యమైన ఖనిజాలు లభిస్తాయి. పండించే వాళ్లుంటే - ఎక్కడ దున్నినా అపారంగా పంటలు పండుతాయి.

మహా పర్వతాలు, అరణ్యాలు, వాగులు, జీవనదులు, విహంగాలు వేణు

రవాలు, పంట పొలాలు, మేఘాలు, వెన్నెలు, సముద్రాలు, రకరకాల ప్రజలు, రంగు రంగుల బ్రతుకులు - ఇలాంటి సహజ సంపదలు లేకనేనా, మనం ప్రతి దానికీ విదేశాలలో బిచ్చమెత్తుకొంటున్నాం ?

అన్నీ ఉన్నాయి, అల్లుడి నోట్లో శని ఉంది.

మన పొలాలను బీడు పెడతాం. విదేశాల నుంచి నూకలు కొంటాం.

మన పొరుగువాడి ప్రతిభను అణిచివేస్తాం. విదేశీ పుస్తకాల్ని అనువదించు కొంటాం.

మన ముడి ఖనిజం ఎగుమతి చేస్తాం. విదేశాల పిన్నుల్ని, పేకముక్కల్ని దిగుమతి చేసుకుంటాం.

ఇలా ఎన్నో, ఎందుకు చేస్తాం ?

అదే - శని !

సామాన్య మానవుడు కనిపించడం లేదు - నేడు దేశంలో పైకి వచ్చిన ఏ వ్యక్తి కంటికీ ! సామాన్యుణ్ని దోచుకోవడం, ప్రజాభివృద్ధి పద్దు క్రింద ఖర్చు వ్రాయడం, బ్యాంకు బేలన్సు పెంచుకోవడం ! దేశానికి స్వరాజ్యం వచ్చిన ఇరవై ఏండ్ల తర్వాత, ఈనాడు దేశంలో కనిపిస్తున్న దేమిటి ? కరువు ! దరిద్రం ! ఆకలి ! అలజడి ! విలయ తాండవం చేస్తున్న శని !

బ్రిటిషు ప్రభుత్వం మనల్ని ఎక్కడ విడిచి వెళ్ళిందో అక్కడికి - ఇరవై ఏండ్ల వెనక్కి - మనం వెళ్ళాలి. ఆనాటి స్థాయికి ధరల్ని దించాలి. పన్నుల్ని రద్దుచెయ్యాలి. జీతాలు తగ్గించాలి. పెరిగిన ఆస్తులను, బేంకు నిల్వలను స్వాధీనం చేసుకోవాలి. స్థిర నిర్ణయంతో, స్థిత ప్రతిజ్ఞతతో, ధైర్యంతో, ధర్మబుద్ధితో ఈ పనుల్ని నిర్వహించాలి. స్వప్రయోజన దృష్టిని తుడిచి వేసుకొని, భగవంతుని ముఖం చూచి, సామాన్య మానవుడి అభివృద్ధినే లక్ష్యంగా స్వీకరించి, సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం ప్రణాళిక వేసుకొని, మనం గట్టిగా పురోగమించ గలిగినప్పుడు గాని ఈ

శని తొలిగి పోదు. సామాన్యుణ్ని మనం ఎంత కాలం ఉపేక్షిస్తామో, అంత కాలం మన గతి అడుక్కు తినడమే !

సరే – ఆ విషయం అలా ఉంచుదాం.

మన ఆంధ్రరాష్ట్రంలో జనం నాలుగు కోట్ల మంది వరకూ ఉన్నారు కదా ? అందులో ఏ కొద్ది వేల మందో తప్ప, అందరూ సామాన్యులే కదా ? ప్రతి వ్యక్తికీ ఏదో ఒక రకమైన జీవితం ఉంది కదా ? ఎవరైనా పరిశీలిస్తున్నారా ? పట్టించు కొంటున్నారా ?

ప్రతి సామాన్యుడి జీవితమూ ఒక ప్రత్యేక మార్గం కలదే. అపూర్వ సౌందర్యాలను పండించేదే, ఆనందార్ణవ తరంగాల పరిష్వంగాల కోసం హస్తాలు చాచేదే – దాన్ని అనుసరించి చూడ గల్గితే.

డాక్టరు ఖాను సామాన్యుడు. అందరికీ తెలిసిన వాడు కాడు. పైగా, ఒక మైనారిటీ వర్గానికి చెందినవాడు. అయినా – ఆయన జీవితంలో ఇంత చరిత్ర ఉంది !

అయితే –

ప్రతి సామాన్యుడి జీవితం లోనూ ఇంతటి గొప్పతనం ఉంటుందని కాదు. ప్రతి ప్రవాహమూ, గంగో గోదావరో కాదు. ఝరులు, స్రవంతులు, సెలయేళ్ళు, వాగులు, వాహినులు, ధారలు – చిన్నా పెద్దా ఎన్నో రకాలుగా ఉండవచ్చు. కొన్ని వట్టి చినుకులు గానే ఆరిపోవచ్చు. అయినా – ప్రతి దాని రూపమూ రమ్యమే. ప్రతి రమ్య రూపమూ పరాశక్తే. ప్రతి శక్తిలవమూ పరమ శివాత్మకమే.

డాక్టరు ఖాను జీవితం ఇంత ఉత్తేజకమూ, ఉన్నతమూ కావడానికి, సాధారణ దృష్టితో పరిశీలించి చూస్తే, రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. అందులో ఒకటి – ప్రాపంచిక జీవిత రంగంలో, సాంఘిక సాంస్కృతిక సమన్వయ కృషిలో ఆయన సాధించిన విజయం.

తెలుగులో అక్షరాభాస్యం చేసిన అచ్చ తెలుగు వాడాయన.

ఒక మనుమరాలి పేరు మేఘరంజనీ బేగం, మరొక మనురాలి పేరు మయూరీ బేగం. చక్కని సంస్కృత పదాలను ఇస్లాం సంప్రదాయానికి మలచిన పరమ భారతీయు డాయన. సూర్యభవనం, చంద్రభవనం - ఎంత అందమైన, అర్థవంతమైన పేర్లు ! హిందువులుగా పుట్టిన వారిలో సైతం - ఆధునికులలో ఎంత మంది కుంది ఈ ఆర్ష సంస్కారం ?

తాము పుట్టిన నేల భాషే తమ మాతృభాష అన్న సత్యాన్ని గుర్తించిన ముస్లింలు దేశంలో ఎంత మంది ?

ఇప్పుడిప్పుడు తెలుగులో రచనలు చేస్తున్న కవులు, కథకులు, పండితులు, భాషా కోవిదులు, గాయకులు, నటులు ముస్లింలలో చాలా మందే ఉన్నారు. వారిలో కూడ - గృహాలకూ, బిడ్డలకూ తెలుగు పేర్లు పెట్టుకొన్న వారెంత మంది ?

తెలుగు హిందువులు మస్తాన్‌రావు వంటి పేర్లు పెట్టుకోవడం ఉంది. తెలుగు క్రైస్తవులు జాన్ రత్నం, డేవిడ్ రాజు, మేరీ దయావతి వంటి పేర్లు ఎక్కువగా పెట్టు కొంటారు. వేష భాషల్లో తేడా లేదు. ఆపాటి సంస్కరణ ముస్లింలలో వచ్చిన వాడు దేశంలో మత సమస్యే ఉండదు కదా ? ఈ సంస్కరణకు డాక్టరు ఖాను గురుస్థానీ యుడే కదా ?

మరో విశేషం -

ఆయన పెద్ద భార్యది పశ్చిమ గోదావరి. చిన్న భార్యది నిజామాబాదు. ఆంధ్ర తెలంగాణా సమైక్యం సాధించా డాయన ఆ విధంగా. పెద్ద కోడలు గుల్బర్గాకు, రెండవ కోడలు బీదరుకు చెందిన వారు. కర్ణాటక మహారాష్ట్రాలను కూడ ఆంధ్ర గృహానికి తెచ్చుకొన్నా డాయన.

పఠాన్ అంటే జయించుకొని వచ్చిన వాడని అర్థం. ఖాన్ అనేది అట్టి విజేతలకు బిరుదు నామం. జాతి, మత, భాషా సంప్రదాయాల సరిహద్దుల్ని జయించి, విశ్వకుటుంబ పరిమాణానికి పెరిగిన డాక్టరు ఖాను అన్వర్థ నామధేయుడే కదా !

ఆయన ఇంకా చిన్న వాడుగా ఉన్నప్పుడు - ఏలూరు, బెజవాడ మొదలైన చోట్ల కలరా, మసూచి వంటి వ్యాధులు వ్యాపించి, వేల కొలది జనాన్ని బలిగొని పోతున్న సమయాలలో - ఆ మహాగ్నిలో దూకి, ఆయన ప్రజలకు చేసిన సేవ ఎంతో సాహసోపేత మైనట్టిది. మహా భయంకరమైనట్టిది. అంతా భగవదిచ్ఛ అనుకొంటూనే - ప్రజాసేవే పరమేశ్వర సేవ అని కూడా విశ్వసించిన మహా భక్తుడు తప్ప అట్టి ప్రమాదకర వాతావరణంలోకి సామాన్యుడు నిశ్చింతగా దూకలేడు.

వరికుప్పలు అంటుకుంటే పేలాల కోసం ఎగబడే దుష్ట స్వార్థం ఉంటుంది లోకంలో ఎందరికో. అలాంటి వాళ్ళలో ఒకడు - వే అండ్ కో బోర్డు కట్టి రే అండ్ కో అదే అన్న భ్రాంతిని కలిగించి, ప్రజల్ని మోసగించాలని చూశాడు - డాక్టరు ఖాను రాజకీయాలలో నిమగ్నుడై తిరుగుతున్న రోజులలో. ఆ కేసు కూడా కోర్టు వరకూ వెళ్ళింది. ఏది సిసలో, ఏది నకలో కోర్టే నిర్ణయించ వలసి వచ్చింది. డాక్టరు ఖాను గెలిచాడు. వంచకుడు శిక్షపడ్డాడు. ఆ సందర్భంలో పచ్చిపులుసు సుబ్బారావు వంటి మిత్రులు తనకు చేసిన సహాయానికి ఆయన నేటికీ అంజలి ఘటిస్తూ ఉంటాడు.

అయితే - ఆ కేసు రే అండ్ కోకు మంచి ప్రచారం చేసి పెట్టింది. ప్రైవేటుగా చిరునవ్వులు కురిపించే మిత్రుడి కంటే, పది మందిలోనూ నోరు పారవేసుకొనే శత్రువే పురోగామికి ఎక్కువ ఉపకారి. కాంట్రవర్సీయే ఖ్యాతికి దారి.

ఆయన జీవితంలో జానపద గాథలా నడచిన ఒక ఉదంతం స్వర్ణ యోగం.

రకరకాల రసాయనిక సమ్మిశ్రణల ద్వారా రాగి, పాదరసం వంటి వాటిని బంగారంగా మార్చే ప్రయత్నాలు చాలా పురాతన మైనట్టివే. చాలా మంది యోగులు స్వర్ణ యోగాన్ని సాధించారని వింటాం కూడ. వేమన యోగి సైతం ఈ విషయంలో చెప్పింది చాలానే ఉంది.

డాక్టరు ఖాను తండ్రి తాతల నుంచీ ఈ యోగాన్ని సాధించాలనే ప్రయత్నం ఉంది. అది పంగిడిగూడెంలో పరాకాష్ఠనందు కొంది.

"కరి మ్రింగిన వెలగ పండును" సంపాదించి, దానిని పాదరసంతో నింపి పుఠం పెడితే - బంగారం అవుతుందట !

పంగిడిగూడెం రాజావారి కోటలో ఏనుగులకేం తక్కువ ? అయితే... ఎన్ని ఏనుగులకు ఎన్ని వెలగపండ్లు అందించినా... పటపట నమిలి మ్రింగటమే తప్ప, పండుపను పండు వళంగా మ్రింగే ఏనుగే కనుపించలేదట ! పట్టి గొంతులో త్రోసినా, మర్నాడు లద్దెలో ఏమీ కనిపించేది కాదట ! పాపం, ఏం చేస్తాడు ?

పంది పాలు తీసి, కరిగిన రాగిపై చురకా యిస్తే, అది బంగారం అవుతుందట ! అయితే... పంది పాలు ఎలా వస్తాయి ? చచ్చినా సరే పంది తన పిల్లలకు తప్ప మరొకళ్ళకు పాలివ్వదే !

సదాపాకు చెట్లలో ఒకానొక సమయంలో పుట్టే ఎర్రటి పురుగుతో మరొక యోగం.

ఈ విషయంలో డాక్టరు ఖాను తండ్రిగారికీ, ఢిల్లీలోని ప్రసిద్ధ యునానీ హకీం అజ్మల్‌ఖాన్‌గారికీ మధ్య ఎన్నో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయట. హకీం అజ్మల్‌ఖాను గొప్ప వైద్యుడు, జాతీయవాది, కోటీశ్వరుడు, కాంగ్రెసు అధ్యక్షుడు కూడ అయిన ప్రముఖుడు. హందర్ద్ దవాఖానా వ్యవస్థాపకుడు. తన సమస్తాన్ని యునానీ వైద్య వికాసం కోసం దానమిచ్చిన వదాన్యుడు. ఆయనతో స్వర్ణయోగం సంప్రదింపులు !

నానా అవస్థలు పడి సదా పురుగును పట్టుకొన్నారట. దానిని భద్రంగా ఢిల్లీ పంపించారట, అంతటితో ఆ యోగం ముగిసింది.

ఇలాంటి చమత్కారాలు కూడ వందలు, వేలు ఉన్నాయి డాక్టరు ఖాను జీవితంలో.

గాంధీజీ ఆవు పాలను విసర్జించి, మేక పాలు త్రాగడం ఎందుకు జరిగిందో... ఆ ఉదంతం వినడమే సాధ్యం కాదు. ఇక్కడ వ్రాయడం ఎలా సాధ్యం ?

బహు భార్యాత్వ నిషేధం, గోవధ నిషేధం మొదలైనవి ఈనాడు పాక్షిక రాజకీయ నినాదాలైనాయి. సనాతన ధర్మ దృష్టితో ఏ సమస్యా పరిశీలించ బడటం లేదు నేడు. బహు భార్యాత్వం ముస్లింలకు ఎంతటి సంప్రదాయమో, హిందువులకూ అంతటి సంప్రదాయమే. రాముడు ఏక పత్నీ వ్రతుడని బల్లలు గుద్దేవారు రామ లక్ష్మణులు సవతి తల్లుల బిడ్డలనే సత్యం మరచిపోతూ ఉంటారు.

గోవధ కూడ అలాంటిదే. ఆర్ష ధర్మ సమ్మత మైనట్టిదే. బహు భార్యాత్వాన్ని నిషేధించడంలో స్త్రీకి ఎంతటి అన్యాయం జరిగిందో, గోవధను నిషేధించాలన్న నినాదం హిందూ ముస్లిం సమైక్యాని కంతటి గొడ్డలి పెట్టు అయింది. ఇంతకూ... ముస్లింలంతా గో మాంసం తింటారని కాదు. అలాంటి వాళ్ళు సకృత్తుగా ఉంటారు. అభిరుచి, ఆహారం, ప్రేమ, వివాహం వంటివి వ్యక్తిగత విషయాలు. పిడుగుకి, బియ్యానికి ఒకటే మంత్రం వేసే విధానం పనికిరాదు.

నిజానికి.... ఈనాడు మన తెలుగు కవి సమ్మేళనలలో ఎక్కువగా పాల్గొంటున్న ముస్లిం మిత్రుడు శ్రీ జైనూలాబ్దీన్ (భయ్యా) ఏక పత్నీవ్రతుడు, సంపూర్ణ శాకాహారీ కాదా ?

★ ★ ★

## 31. ఇస్లాం - వీర శైవం

*లా వొక్కింతయు లేదు, ధైర్యము విలో*
*లంబయ్యె, ప్రాణంబులన్*
*ఠావుల్ తప్పెను, మూర్ఛ వచ్చె, తనువున్*
*డస్సెన్, శ్రమంబయ్యెడిన్,*
*నీవే తప్ప ఇతః పరంబెరుగ, మ*
*న్నింపన్ దగున్ దీనునన్ ;*
*రావే ఈశ్వర ! కావవే వరద ! సం*
*రక్షింపు భద్రాత్మకా !*

ఒక సాహితీ సమ్మేళనలో ఈ పద్యం చదివి.... ఇస్లాం మత సారమే ఈ పద్యం అనీ, బహుశా లోకంలో తొలి ముస్లిం గజేంద్రుడే కావచ్చుననీ అన్నాడు శ్రీ భయ్యా... ఆ మధ్య ఎప్పుడో.

"క్రైస్తవం విశిష్టాద్వైతం, ఇస్లాం వీరశైవం" అన్నాడు మిత్రుడు డాక్టర్ అరిపిరాల విశ్వం – మొన్న మాటల సందర్భంలో.

నిజానికి ఏ మత లక్ష్యమైనా ఒక్కటే – భగవంతుణ్ని పొందడం. అందుకు ఏ మతం చూపే మార్గమైనా ఒక్కటే – భక్తి మార్గం.

"నీవే తప్ప ఇతః పరంబెరుగ, మన్నింపన్ దగున్ దీనునన్ !" అంటూ చేతులు మోడ్చి నమస్కరించడం, నిండు మనస్సుతో భగవంతుడికి తనను తాను పూర్ణార్పణ గావించుకొనడం – అంతే ఏ మతం బోధించినా ! చివరకు – భగవంతుడి పేరైనా ఎత్తని బౌద్ధం కూడ బోధించింది శరణాగతినే !

అయితే –

జ్ఞానులు, తత్త్వవేత్తలు, వేదాంతులు, భాగవతులు, యోగులు ప్రతి మతంలోనూ పుడుతూ ఉంటారు. వాళ్ళు అప్పటికి తమ చుట్టూ ఉన్న మత సిద్ధాంతాలను గ్రుడ్డిగా అనుసరించడానికి నిరాకరించి, భగవంతుడి కోసం స్వతంత్రాన్వేషణ సాగిస్తారు. అలాంటి సాధకులలో ఒకొక్క అదృష్ట వంతుడు ఒకొక్క సత్యాన్ని ఆవిష్కరించడం కద్దు. అలాంటి సత్యాలే – హిందూ మత పరిధిలోని ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత తత్త్వాలూ, ఇస్లాం మత పరిధిలోని సూఫీ తత్త్వమూ.

సూఫీ తత్త్వంలో కూడ ద్వైతాద్వైత భావ భేదాలెన్నో ఉన్నై. అందులో "అహం బ్రహ్మాస్మి" అనే అద్వైత తత్త్వానికి చెందిన వాడు డాక్టరు ఖాను. అందుకే ఆయనలో మతాచార పట్టుదలలు లేవు.

ఈ మధ్య సాహిత్య అకాడమీ వారు ప్రకటించిన రెండు మంచి గ్రంథాలను చూశాను నేను. ఒకటి – శ్రీ సదాశివగారు అనువదించిన మౌలానా రూమీమస్నవీ. రెండు – గుంటూరు శేషేంద్రశర్మగారి షోడశి.

మస్నవీ సూఫీ తత్త్వ బోధకం, షోడశి యోగ విద్యా విస్ఫారకం.

సూఫీ తత్త్వం లోని వేణువే యోగ విద్యలోని కుండలిని. (పృష్ఠవంశనాద బ్రాహ్మి !) వెదురు పొదే సహస్రారంలోని పరమాత్మ వియోగ వ్యధ, పునస్సమాగ మోన్మనస్కత ఉభయత్రా సమానమే. ఎంత దివ్యమైన ఏక భావనత !

ఏడు ఆకాశాల కవతల ఈశ్వర స్థానమని, మహమ్మదు ప్రవక్తను ఈశ్వరుడు అక్కడికి రప్పించుకున్నాడనీ ఖురాను చెపుతున్నది. క్రెస్తును కూడా ఆలానే రప్పించు కున్నాడట.

మన యోగ విద్యలోని షట్కమలాలకు ప్రతి పత్కళా కమలాన్ని కూడ చేర్చి, ఆ ఏడు ఆవరణలు ఏడు ఆకాశాలు అనుకుంటే – ఖురాను సూచించిన ఈశ్వర స్థానం ఏదో, మహమ్మదు ప్రవక్త పొందిన అపవర్గం ఎంతటి పరమైశ్వర్య పారమ్యమో ఊహించగలం కదా?

అది ద్వైతం కానీ, అద్వైతం కానీ, వైష్ణవాద్వైతం కానీ, శైవా ద్వైతంకానీ – ప్రపంచంలోని ఏ మతానికైనా, ఏ తత్త్వానికైనా పునాది ఒక్కటే. అది జీవుని వేదన. అదే సమస్త మతాలకూ, భావాలకూ, తత్త్వాలకూ, ఉపాసనలకూ, విమోచన మార్గాలకూ మూల వేదం. దిగ్దిగంతాలకు వ్యాపించిన మహా శాఖి. అందులోని లలిత లలితాలైన లవలీ గుచ్ఛాలే, మధుర ఫలాలే ఈశ్వర ప్రణయమూ, మధుర భక్తీ, ఆత్మార్పణా, అనంత సంలీనతా.

ఆయా కాలలాలో, ఆయా భాషలలో మోజస్, మూసా, మహేశా అని పిలువబడ్డ ప్రవక్తలు ముగ్గురూ ఒకే మూల వ్యక్తిగా మనం గుర్తించ వచ్చు. క్రైస్తవుల మోజస్సే ముస్లింల మూసా, హిందువుల మహేశా. ఈ మూడు మతాలకూ మూల వేదం ఒకటే అనడానికి ఇదొక ప్రబల నిదర్శనం.

ఈ సత్యాన్ని మక్కాలోని "కాబా" లింగం మరింత రుజువు చేస్తుంది.

మక్కాను దర్శించే పవిత్ర యాత్రికులంతా, ప్రవక్త సమాధిని దర్శించుకునే ముందు, కాబా లింగానికి నుదురు ఆనించి మ్రొక్కుతారు... (మన శ్రీశైలంలో వలె)! ప్రదక్షిణ చేస్తారు.

మొదట్లో అది తెల్లని స్ఫటిక లింగమట. శతాబ్దాలుగా, శత సహస్రాల భక్తుల పాపాలను స్వీకరించడం వల్ల అది నల్లబడి పోయిందట. ఇప్పుడది నల్లగా ఉంటుంది. ముస్లింలు హిందూ పద్ధతిలో లింగార్చన చేసేది ఆ ఒక్క చోటనే. కాబాకు మ్రొక్కి, పాప విముక్తులైన తర్వాతనే ప్రవక్త పవిత్ర సమాధి దర్శన యోగ్యత.

కాబా అంటే కవి. అంటే శుక్రుడు. శుక్రుడు భృగు వంశం వాడు. అంటే యూదులుగా నేడు పేర్కొన బడుతున్న వారి పూర్వీకుడన్న మాట. గురువు, శుక్రుడు, ప్రాచీన వైదిక ఋషులు. సురలు, అసురులు అంతా సిరియా, అసీరియా ప్రాంతం వాళ్ళే. ఆర్ష జాతికి అగ్ని స్థానమైన స్వాదిష్ఠాన మది. ఆధార భూమి. అక్కడి నుంచే శాఖోప శాఖలుగా ప్రపంచ మంతా వ్యాపించిందది.

ధర్మరాజు అశ్వమేధం చేసిన తావు ఈజిప్టు అనే వాదం ఉంది. యూదులు, పూర్వక్రైస్తవులు జంజాలు ధరించే వారట కూడ. ఆర్యుల జన్మ స్థానం మధ్య ప్రాచ్య మనడానికి, అన్ని మతాలకూ మూల తత్వం ఆర్ష వైదికమే అనడానికీ ఇవన్నీ ఉపబలకాలు.

కవి అంటే వైదిక భాషలో పరమేశ్వరుడు, మహేశ్వరుడు. పాప విమోచనకు అతడు ప్రసాదించినట్టిదే కాబా లింగం.

ఆచార్య చతురసేన శాస్త్రి వ్రాసిన "వయం రక్షామ" అన్న గ్రంథం అనుబంధంలో ఈ విషయాలన్నీ చారిత్రక సాక్ష్యాలతో పాటు వివరించబడి ఉన్నాయట. జిజ్ఞాసువులు పరిశీలించ వచ్చు.

పార్వతీ పతి తెలుపు.

ముస్లింల చంద్రోపాసన, శ్వేతవర్ణ సమాభిముఖ్యం వంటివన్నీ కూడ ఇస్లాం వీరశైవానికి దగ్గర అన్న వాదాన్ని బలపరచేవే.

ఈ సత్యాలన్నిటి దృష్ట్యా, భారతీయ తత్త్వ శాస్త్రాన్ని కూలం కషంగా అర్థం చేసుకొన్న వాడు కనుకనే, సర్వతత్త్వ శిరోభూషణమైన అద్వైతాన్ని ఆశ్రయించాడు డాక్టరు ఖాను.

అన్ని మతాలు, అన్ని వర్గాలు, అన్ని కులాలు, అందరు మానవులూ ఒకటే ఆయనకు. తనలో అందర్నీ, అందరిలో తననూ చూచుకునే అద్వైతి ఆయన.

ఏకం సత్, విప్రా బహుధా వదంతి.

★★★